

ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ

తెలుగు జాతీయ దినపత్రిక
# వార్త

epaper.vaartha.com WWW.VAARTHA.COM

హైదరాబాద్ : fb.com/vaartha Digital

Published from Hyderabad, Vijayawada, Visakhapatnam, Rajahmundry, Guntur, Ongole, Nizamabad, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam

3-10-2026 శనివారం సంపుటి: 32 సంచిక: 244 పేజీలు: 10+4 వెల: 6.50


ఫైదుబాయ్ కెప్టెన్‌కు ప్రధాని మోదీ పరామర్శ 5

కలినిన్‌గ్రాడ్‌పై దాడి చేస్తే అణ్వాయుధ ప్రయోగం: పుతిన్



## 'స్వర్ణ'భారత్ 2

ఆసియా క్రీడల్లో ఒకే రోజు ఆరు బంగారు పతకాలు

44 యేళ్లకు హాకీలో చైనాపై ఇండియా ఘన విజయం

బాక్సింగ్‌లో లవ్లీనా, పర్వీన్, అంకుష్ 'గోల్డ్' పంచ్‌లు







శుక్రవారం గాంధీ జయంతి సందర్భంగా లంగర్ హౌస్‌లోని బాపు ఘాట్‌వద్ద నివాళులర్పిస్తున్న గవర్నర్ శివ్‌ప్రతాప్ శుక్లా, సిఎం రేవంత్ రెడ్డి, డి.సిఎం భట్టి, పిసిసి అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ తదితరులు

# బాపూ! నీ బాటే మా మాట

### గాంధీ జయంతి సందర్భంగా బాపుఘాట్ వద్ద ఘనంగా నివాళులర్పించిన గవర్నర్ శివ్‌ప్రతాప్ శుక్లా, సిఎం రేవంత్, పిసిసి చీఫ్ మహేష్ గౌడ్ ప్రభృతులు

**మెహిదీపట్నం,అక్టోబర్ 2, ప్రభాతవార్త :** జాతిపిత మహాత్మ గాంధీ జయంతి వేడుకలు లంగర్ హౌస్ లోని బాపు సమాధి వద్ద ఘనంగా జరిగాయి. 157 జయంతి వేడుకలను పురస్కరించుకొని గవర్నర్ శివ్‌ప్రతాప్ శుక్లా, సిఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సిఎం మల్లు భట్టి విక్రమార్క, పిసిసి అధ్యక్షుడు మహేష్‌కుమార్ గౌడ్, రాష్ట్ర మంత్రులు బాపు సమాధి వద్ద పుష్పాంజలి ఘటించి నివాళులర్పించి, సుందరీకరణ చేపట్టిన మహాత్మా గాంధీ డిజిటల్ మ్యూజియంను ప్రారంభించారు. పలు ప్రాంతాలను తిలకించిన అనంతరం గాంధీ మ్యూజియంలో ఏర్పాటుచేసిన సర్వమత ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్నారు. అదేవిధంగా బాపు ఘాట్‌లోని గాంధీజీ విగ్రహానికి పుష్పగు >>2

# హైదరాబాద్ అందానికి కొత్త మెరుగులు

### రోడ్లు, ఫ్లైఓవర్లు, బ్రిడ్జిలు, అండర్‌పాస్‌ల అభివృద్ధికి రూ. 52 వేల కోట్లు

### భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా మౌలిక వసతులు

### మెట్రో రైలు 122 కి.మీ మేర విస్తరణ

### ఆర్టీసీ, మెట్రో కామన్ పాస్‌ను ప్రారంభించిన డి.సిఎం భట్టి







శుక్రవారం హైదరాబాద్‌లో ఆర్టీసీ, మెట్రో కామన్ పాస్‌ను ప్రారంభించిన డి.సిఎం భట్టి, చిత్రంలో మంత్రులు పొన్నం, అజారుద్దీన్, సిఎస్ సంజయ్ జాజు తదితరులు

**హైదరాబాద్, అక్టోబరు 2, ప్రభాతవార్త:** హైదరాబాద్ నగర అభివృద్ధికి రూ.52 వేల కోట్ల విలువైన మౌలిక వసతుల పనులు శరవేగంగా కొనసాగుతున్నాయని డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క తెలిపారు. రోడ్లు, ఫ్లైఓవర్లు, బ్రిడ్జిలు, అండర్‌పాస్‌లు, తాగునీటి వసతులు తదితర రంగాల్లో భారీగా పనులు చేపట్టామని చెప్పారు. హైదరాబాద్‌లో శుక్రవారం మంత్రులు పొన్నం ప్రభాకర్, అజారుద్దీన్, వివేక్ వెంకటస్వామితో కలసి ఆర్టీసీ-మెట్రో రైల్ కామన్ పాస్‌ను ప్రారంభించిన ఆయన మాట్లాడుతూ భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని హైదరాబాద్‌ను మరింత అభివృద్ధి చేయడానికి ప్రభుత్వం సమగ్ర ప్రణాళికతో ముందుకు సాగుతోందన్నారు. హుడా పరిధిలో రూ.35వేల కోట్లతో రోడ్లు, ఫ్లైఓవర్లు, బ్రిడ్జిల వంటి భారీ మౌలిక వసతుల పనులు చేపట్టామన్నారు. జిహెచ్‌ఎంసి, వాటర్ వర్క్స్, అండర్‌పాస్‌లు, ఫ్లైఓవర్లు, ఇతర అభివృద్ధి పనులతో కలిపి నగరంలో మొత్తం రూ.52 వేల కోట్ల విలువైన పనులు కొనసాగుతున్నాయని వెల్లడించారు. నగరానికి తాగునీటి అవసరాలను తీర్చేందుకు కృష్ణా, గోదావరి, మంజీరా జలాలను గత కాంగ్రెస్ ప్రభుత్వాలే తీసుకొచ్చాయని చెప్పారు.
హైదరాబాద్ నగరంలో ప్రజా రవాణాను మరింత మెరుగుపరిచేందుకు మెట్రో రైల్‌ను 122 కిలోమీటర్ల మేర విస్తరించనున్నట్లు తెలిపారు. ఓల్డ్ సిటీ, ఎయిర్‌పోర్టు, పటాన్‌చెరు, హయత్‌నగర్ ప్రాంతాలకు మెట్రో కనెక్టివిటీ కల్పించేందుకు సుమారు రూ.38 వేల కోట్లతో ఫేజ్-2 ప్రాజెక్టును చేపట్టనున్నట్లు వెల్లడించారు. హైదరాబాద్ అభివృద్ధిని నగర పరిధి దాటి రాష్ట్రవ్యాప్తంగా విస్తరించాలనే ఉద్దేశంతో రీజినల్ రింగ్ రోడ్డు ప్రాజెక్టును చేపట్టామన్నారు. 362 కిలోమీటర్ల మేర అన్ని జిల్లాలను అనుసంధానించే ఈ ప్రాజెక్టుకు రూ.30,627 కోట్ల వ్యయం అవుతుం దని పేర్కొన్నారు. ఒఆర్ఆర్, >>2

# రాష్ట్రమంతా సెంట్రల్ కిచెన్లు

### ప్రభుత్వ స్కూళ్ల విద్యార్థుల బ్రేక్‌ఫాస్ట్ కోసం ఏర్పాట్లు

### హారేకృష్ణ ఫౌండేషన్‌తో జున్నా సోలార్ సిస్టమ్స్, చైన్ ల్యాబ్స్ ఒప్పందం

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,అక్టోబరు2:** రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలల్లో నిర్మిస్తున్న సెంట్రలైజ్డ్ కిచెన్లను డిసెంబరు 9న ప్రారంభించనున్నట్లు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వెల్లడించారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు బ్రేక్‌ఫాస్ట్ పథకం అమలు చేయడానికి సిఎం రేవంత్ రెడ్డి సమక్షంలో జున్నా సోలార్ సిస్టమ్స్, చైన్ ల్యాబ్స్ ఇండియా సంస్థలు హారేకృష్ణ ఫౌండేషన్‌తో ఒప్పందం చేసుకున్నాయి. హారేకృష్ణ ఫౌండేషన్ ప్రతినిధులు, జున్నా సోలార్ సిస్టమ్స్, చైన్ ల్యాబ్స్ ప్రతినిధులు ముఖ్యమంత్రిని శుక్రవారం జూబ్లీహిల్స్ నివాసంలో కలిశారు. నాగర్‌కర్నూల్, వికారాబాద్‌లలో ఆధునిక సెంట్రలైజ్డ్ కమ్యూనిటీ కిచెన్ల ఏర్పాటుకు ఈ రెండు సంస్థలు హారేకృష్ణ ఫౌండేషన్‌కు సహకారం అందిస్తాయి.
నాగర్‌కర్నూల్‌లో సెంట్రలైజ్డ్ కమ్యూనిటీ కిచెన్ కోసం జున్నా సోలార్ సిస్టమ్స్ సంస్థ సిఎండి శేఖర్ రెడ్డి, సిఇఒ అనిల్ బాబుతో కలిసి రూ.5.17 కోట్ల చెక్కును ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేతుల మీదుగా హారే కృష్ణ ఫౌండేషన్‌కు అందించారు. వికారాబాద్‌లో ఆధునిక సెంట్రలైజ్డ్ కమ్యూనిటీ కిచెన్ నిర్మాణం కోసం చైన్ ల్యాబ్స్ ఇండియా సంస్థ ప్రతినిధి డి. సుమంత్, వైస్ ప్రెసిడెంట్ బుగత సంతోష్ కుమార్‌తో కలిసి ముఖ్యమంత్రి చేతుల మీదుగా రూ.4 కోట్ల



శుక్రవారం హైదరాబాద్‌లో సిఎం రేవంత్ సమక్షంలో హారేకృష్ణ ఫౌండేషన్‌తో ఒప్పందం చేసుకుంటున్న జున్నా సోలార్ సిస్టమ్స్ చైన్ లాబ్స్ ప్రతినిధులు

చెక్కును హారే కృష్ణ ఫౌండేషన్‌కు అందించారు. ఒక మంచి కార్యక్రమానికి నిధులు అందించి సహకరించడానికి ముందుకు వచ్చిన సంస్థల ప్రతినిధులను ఈ సందర్భంగా రేవంత్ రెడ్డి అభినందించారు. ఈ కార్యక్రమంలో మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, రాజ్యసభ సభ్యుడు వేం నరేందర్ >>2



# వానలొచ్చేనా?

### 15 నుంచి ఈశాన్య పవనాలు

### సాధారణ వర్షపాతం ఉండొచ్చన్న ఐఎండి

**హైదరాబాద్, అక్టోబరు 2, ప్రభాతవార్త :** ఈశాన్య రుతుపవనాలు అక్టోబర్ 15 నుంచి 21 మధ్య దక్షిణ ద్వీపకల్ప భారత్‌లోకి ప్రవేశించే అవకాశం ఉందని భారత వాతావరణ శాఖ (ఐఎండి) వెల్లడించింది. దేశంలోని దక్షిణ ప్రాంతాల్లో వాతావరణ పరిస్థితులపై భారత వాతావరణ శాఖ కీలక అంచనాలను వెల్లడించింది. మరోవైపు ప్రస్తుతం కొనసాగుతున్న నైరుతి రుతుపవనాలు మరో రెండు, మూడు రోజుల్లో పూర్తిగా ఉపసంహరించుకునే అవకాశం ఉందని వెల్లడించింది. చెన్నైలోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఓషన్ టెక్నాలజీలో శుక్రవారం ఈశాన్య రుతుపవనాలపై వివిధ ప్రభుత్వ విభాగాల ప్రతినిధులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో భారత వాతావరణ శాఖ డైరెక్టర్ జనరల్ మృత్యుంజయ మహాపాత్ర, తమిళనాడు రెవెన్యూ, విపత్తు నిర్వహణశాఖ కమిషనర్ చంద్రమోహన్ పాల్గొన్నారు. ఈశాన్య రుతుపవనాల సీజన్‌లో దక్షిణ ద్వీపకల్ప భారతదేశంలో మొత్తంగా సాధారణ స్థాయిలో వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉందని మహాపాత్ర తెలిపారు.
ముఖ్యంగా దక్షిణ తమిళనాడు, దక్షిణ కేరళలో సాధారణం కంటే ఎక్కువ వర్షాలు కురిసే అవకాశాలున్నాయని చెప్పారు. అక్టోబర్‌లో దక్షిణ తమిళనాడు, ఉత్తర తమిళనాడులోని >>2

# జంతర్‌మంతర్ ఉద్రిక్తం

### సిఇసిని తొలగించాలంటూ ఆప్ నిరసనలు

### పలువురు నేతలను అదుపులోకి తీసుకొన్న పోలీసులు



శుక్రవారం న్యూఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద నిరసనలు చేస్తున్న ఆప్ కార్యకర్తలు

**న్యూఢిల్లీ, అక్టోబరు 2:** ఎన్నికల సంఘం, ఓటర్ల జాబితాల ప్రత్యేక సమగ్ర పునఃపరిశీలన అంశంపై ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద శుక్రవారం నిరసనలకు పిలుపునిచ్చిన నేపథ్యంలో ఢిల్లీలో భద్రతను కట్టుదిట్టం చేశారు. ఆమ్ ఆద్మీ పార్టీ నేతలు సౌరభ్ భరద్వాజ్, సంజీవ్ ఝా సహా పలువురు నిరసనకారులను ఢిల్లీ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఎన్నికల సంఘానికి వ్యతిరేకంగా నిరసనలో పాల్గొనేందుకు ఆప్ నేతలు జంతర్ మంతర్‌కు చేరుకున్నారు. అక్కడ పోలీసులు వారిని అదుపులోకి తీసుకున్నారు. పలువురు పార్టీ కార్యకర్తలు, నిరసనకారులను కూడా పోలీసులు అదుపు >>2

# ముంబయిలో సిజెపి భారీ ఆందోళన

**ముంబయి, అక్టోబరు 2:** ప్రధాన ఎన్నికల కమిషనర్ (సిఇసి) జ్ఞానేశ్ కుమార్‌కు వ్యతిరేకంగా ఆందోళనకు దిగుతున్నట్లు కాక్రోచ్ జనతా పార్టీ (సిజెపి) నేతలు ప్రకటించారు. ఓటు చోరీ ఆరోపణలపై ఆయన బాధ్యత వహించాలని, పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. తమ డిమాండ్ల సాధన కోసం అవసరమైతే జైలుకు వెళ్లేందుకూ సిద్ధమని తెలిపారు. శుక్రవారం ముంబైలోని శివాజీ పార్క్‌లో ఈ ఆందోళన చేపట్టనున్నట్లు వెల్లడించారు. 13 కోట్లమంది ఓటర్ల ఓట్లను తిరిగి సాధించడానికి, సిఇసి జ్ఞానేశ్ కుమార్‌ను >>2



శుక్రవారం ముంబయిలో ఆందోళన చేస్తున్న సిజెపి కార్యకర్తలు



# పెరిగిన ఆటో ఛార్జీలు

### కనీస ఛార్జీ: రూ. 30, తర్వాత కి.మీకి రూ. 14 అదనం

### రాత్రి 11 గం. నుంచి ఉదయం 5గం. దాకా ఒకటిన్నర రెట్లు అధికం

**హైదరాబాద్,అక్టోబరు2,ప్రభాతవార్త:** తెలంగాణలో సామాన్యులపై మరో భారం పడింది. రాష్ట్రవ్యాప్తంగా ఆటో రిక్షా ఛార్జీలను పెంచుతూ రవాణాశాఖ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. దాదాపు 12 యేళ్ల విరామం తర్వాత ఈ ఛార్జీలను సవరించడం గమనార్హం. నూతన ఛార్జీలప్రకారం, కనీసఛార్జీని (తొలి 1.6కిలోమీటర్లకు) రూ.30గానిర్ణయించారు. ఆ తర్వాత >>2

# విద్యుత్ ప్రైవేటీకరణ యత్నాలను ఆపండి

### రాహుల్ గాంధీకి హరీష్‌రావు లేఖ



**హైదరాబాద్,అక్టోబరు2,ప్రభాతవార్త:** తెలంగాణలో ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణపై రాహుల్‌గాంధీ వెంటనే జోక్యం చేసుకోవాలని బిఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్,మాజీ మంత్రి హరీశ్‌రావు డిమాండ్ చేశారు. టిజి ట్రాన్స్‌కో, టిజిజెన్‌కో, సింగరేణి, డిస్కంల ప్రైవేటీకరణకు తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాలను అడ్డుకోవాలని కోరారు.కాంగ్రెస్ జాతీయ విధానం ఢిల్లీలో ఒకలా.. తెలంగాణలో మరోలా ఎందుకు? కాంగ్రెస్ మేనిఫెస్టో, రాయ్‌పూర్ ఆర్థిక తీర్మానాలను తెలంగాణ ప్రభుత్వం పాటిస్తుందా? స్పష్టం చేయాలని పేర్కొన్నారు. దశాబ్దాలుగా ప్రభుత్వాలు నిర్మించిన ప్రజా ఆస్తులను రేవంత్ ప్రైవేటీకరించడం దుర్మార్గం అని >>2



# జనారణ్యంలో మూగజీవాల హాహాకారాలు

● హైదరాబాద్‌లో పెరుగుతున్న నాన్‌వెజ్ ప్రియులు ● గోవులు, ఒంటెలు, నెమళ్లు, జింకలు, తాబేళ్లు సైతం కత్తి వేటుకు బలి ● షాద్‌నగర్ వద్ద పట్టుబడిన జింకమాంసం ముఠా ● రెక్కలు తెగిపడుతున్న పక్షులు ● బహిర్గతమవుతున్న అధికారుల పర్యవేక్షణ లోపం

**హైదరాబాద్, అక్టోబరు 2, ప్రభాతవార్త:** రాష్ట్రంలో వన్యప్రాణుల స్మగ్లింగ్‌తో పాటు వాటిని వధించి, మాంసం విక్రయాలు ఆగడం లేదు. అడవులను కాపాడేందుకు, వన్య ప్రాణులను, మూగ జీవాలను రక్షించేందుకు ఓవైపు ప్రభుత్వం కఠిన చట్టాలు అమలు చేస్తున్నా ఇవేవి వేటగాళ్లు, స్మగర్ల ఆగడాలను అడ్డుకోలేక పోతున్నాయి. హైదరాబాద్‌కు సమీపంలో గల షాద్‌నగర్‌వద్ద జింక మాంసంతో పాటు దాని అవశేషాలను తర లిస్తున్న ముఠా పోలీసులకు పట్టుబడడం తెలిసిందే. ఇటువంటి ఘటన కొన్ని రోజుల క్రితం నిజామాబాద్‌లోనూ >>2



శుక్రవారం గాంధీజయంతి సందర్భంగా రాజ్‌ఘాట్‌లోని సమాధివద్ద నివాళులర్పిస్తున్న ప్రధాని మోడీ

## బాపూజీ సందేశం వికసిత్ భారత్ నిర్మాణానికి బాటలు

### గాంధీజీకి ప్రధాని మోడీ ఘన నివాళులు

**న్యూఢిల్లీ, అక్టోబరు 2:** జాతిపిత మహాత్మాగాంధీ ఆశయాలు ఎప్పటికీ మానవాళికి మార్గదర్శకంగా నిలుస్తాయని ప్రధానమంత్రి నరేంద్ర మోడీ అన్నారు. సత్యం, అహింస, నిరాడంబరత, స్వదేశీ భావనలతో కూడిన బాపూజీ జీవితం ప్రతి ఒక్కరికీ స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. గాంధీజీ చూపిన బాటలో నడుస్తూ మెరుగైన సమాజంతో పాటు వికసిత భారత్ నిర్మాణం దిశగా ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. గాంధీ జయంతి సందర్భంగా శుక్రవారం మహాత్ముడికి నివాళులర్పించిన మోడీ ఆయన సందేశాలను గుర్తుచేసుకున్నారు. ఈ సందర్భంగా ఎక్స్ వేదికగా స్పందించిన ప్రధాని బాపూజీ శాశ్వత సందేశం మెరుగైన సమాజం, వికసిత భారత్ నిర్మాణానికి నిరంతరం దిశానిర్దేశం చేయాలని ఆకాంక్షించారు. గాంధీజీ జీవితం సత్యం, అహింస, కరుణ, సేవలకు నిలువెత్తు నిదర్శనమని పేర్కొన్నారు. ప్రతి కాలంలోనూ మానవాళికి ఆయన జీవితం మార్గం చూపుతుందని అన్నారు. వీడియో సందేశంలోనూ గాంధీజీ గొప్పతనాన్ని మోడీ వివరించారు. అక్టోబరు 2 ప్రాధాన్యం దేశంలోని ప్రతి చిన్నారికీ తెలుసని అన్నారు. అధికారానికి దూరంగా ఉన్నప్పటికీ కోట్లాది మంది ప్రజల హృదయాల్లో గాంధీజీ ఇప్పటికీ నిలిచిపోయారని పేర్కొన్నారు. ఆయన సిద్ధాంతాల ప్రభావం మానవాళిపై ఉన్నంతకాలం ఆ ఆశయాలు స్ఫూర్తినిస్తూనే ఉంటాయని తెలిపారు. గాంధీజీ స్వదేశీ భావనకు ఎంతో ప్రాధాన్యమిచ్చారని, ఖాదీ దానికి ప్రధాన చిహ్నమని ప్రధాని గుర్తుచేశారు. గాంధీ జయంతి సందర్భంగా ప్రతి ఒక్కరూ ఖాదీ ఉత్పత్తులను కొనుగోలు చేయాలని కోరారు. స్వదేశీ వస్తువులను గర్వంగా వినియోగించాలని పిలుపునిచ్చారు.

## బాపూ! నీ బాటే మా మాట

>> చ్చాలు ఉంచి నివాళులర్పించారు. కార్యక్రమంలో మంత్రులు పొన్నం ప్రభాకర్, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, మొహమ్మద్ అజారుద్దీన్, ప్రభుత్వ విప్‌లు అద్దంకి దయాకర్, రామచంద్రనాయక్, బిసి కమిషన్ చైర్మన్ నిరంజన్, తెలంగాణ స్టేట్ ప్లానింగ్ బోర్డ్ వైస్ చైర్ పర్సన్ గద్వాల విజయలక్ష్మి, శాసన సభ్యుడు నవీన్ యాదవ్, మాజీ పార్లమెంట్ సభ్యుడు హనుమంతు రావు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు, డిజిపి సి.వి ఆనంద్, సిపి సజ్జనార్, జిహెచ్ఎంసి కమిషనర్ ఆర్ వి కర్ణన్, పర్యాటకశాఖ మేనేజింగ్ డైరెక్టర్ క్రాంతి వల్లూరి, జిల్లా కలెక్టర్ డాక్టర్ ప్రియాంక అలా, డిసిపి గోల్కొండ జోన్ రాఘవేందర్ రెడ్డి, వివిధ శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## యత్నాలను ఆపండి

>> తప్పుపట్టారు. ఈ మేరకు శుక్రవారం కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభలో విపక్ష నేత, రాహుల్‌గాంధీకి లేఖ రాశారు. తెలంగాణ ప్రభుత్వ ప్రతిపాదిత టిజి ట్రాన్స్‌కో 26 శాతం ఈక్విటీ డైల్యూషన్/ఐపిఒ (వాటా తగ్గింపు) నిర్ణయం మొత్తం ప్రభుత్వ విద్యుత్ సంస్థల మనుగడనే ప్రశ్నార్థకం చేస్తున్నదన్నారు.ఇది రాష్ట్రంలోని వ్యూహాత్మక విద్యుత్ మౌలిక వసతుల భవిష్యత్ యాజమాన్యం, నియంత్రణకు సంబంధించిన కీలక అంశం.

టీజీట్రాన్స్‌కో ఒక సాధారణ వాణిజ్య సంస్థ కాదు. తెలంగాణ విద్యుత్ వ్యవస్థకు వెన్నెముకగా నిలిచిన కీలక ప్రజా సంస్థ. టీజీట్రాన్స్‌కో పరిధిలో 29, 400 కేవీ సబ్‌స్టేషన్లు, 107, 220 కేవీ సబ్‌స్టేషన్లు, 337, 132 కేవీ సబ్‌స్టేషన్లు, 31,420కు పైగా సర్క్యూట్ కిలోమీటర్ల ఈహెచ్‌టి లైన్లు, 1,184 పవర్ ట్రాన్స్‌ఫార్మర్లు, 43,848 ఎంవిఏ ట్రాన్స్‌ఫర్మేషన్ సామర్థ్యం ఉన్నాయని పేర్కొన్నారు. దశాబ్దాలుగా ప్రజాధనంతో, గత ప్రభుత్వాల కృషితో నిర్మించిన ఈ ప్రభుత్వ ఆస్తులను రాత్రికి రాత్రి ప్రైవేట్ యాజమాన్యానికి అప్పగించే హక్కు కాంగ్రెస్ ప్రభుత్వానికి ఎవరు ఇచ్చారు? అని ప్రశ్నించారు. 26 శాతం వాటా తగ్గింపు మొదటి అడుగు మాత్రమే. భవిష్యత్తులో మిగిలిన వాటాను కూడా ప్రైవేటు చేతుల్లోకి అప్పగించే మార్గాన్ని సుగమం చేస్తున్నారు.

అంటే టీజీట్రాన్స్‌కో తర్వాత టీజీజెన్‌కో, సింగరేణి, డిస్కంలు కూడా ఇదే బాట పట్టనున్నాయా? అని ప్రశ్నించారు. తెలంగాణ ప్రభుత్వం ప్రజలకు స్పష్టమైన సమాధానం చెప్పాలి. ప్రభుత్వ రంగ సంస్థలను కాపాడాలని ఢిల్లీలో కాంగ్రెస్ ఒక మాట.. కాంగ్రెస్ అధికారంలో ఉన్న తెలంగాణలో మరో మాటా? అని ప్రశ్నించారు.కాంగ్రెస్ 2019 మేనిఫెస్టోలో వ్యూహాత్మకేతర, నాన్‌కోర్ ప్రభుత్వ రంగ సంస్థలకే డిజ్‌ఇన్వెస్ట్‌మెంట్‌ను పరిమితం చేయాలని పేర్కొందని తెలిపారు. 2023 రాయ్‌పూర్ కాంగ్రెస్ ప్లీనరీ ఆర్థిక తీర్మానంలో కూడా డిజ్‌ఇన్వెస్ట్‌మెంట్ పేరుతో ప్రైవేట్ మోనోపాలీలు, డ్యూపాలీలు ఏర్పడకూడదని స్పష్టం చేసిందని,మరి తెలంగాణలో వ్యూహాత్మక విద్యుత్ సంస్థ అయిన టీజీట్రాన్స్‌కోలో ఈక్విటీ డైల్యూషన్ ఏ కాంగ్రెస్ విధానం ప్రకారం చేస్తున్నారు? అని ప్రశ్నించారు,ఉత్తరప్రదేశ్‌తో పాటు కాంగ్రెస్ అధికారంలో లేని ఇతర రాష్ట్రాల్లో విద్యుత్ రంగ ప్రైవేటీకరణను కాంగ్రెస్ వ్యతిరేకించిందని,అధికారంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఉన్నా అదే సూత్రం వర్తించాలి. కాంగ్రెస్ విధానం ఢిల్లీలో ఒకలా, కాంగ్రెస్ పాలిత తెలంగాణలో మరోలా ఉండకూడదన్నారు.కాంగ్రెస్‌కు రెండు ఆర్థిక విధానాలు ఉన్నాయా? ప్రతిపక్షంలో ఉన్నప్పుడు ఒకతీరు, అధికారంలో ఉన్నప్పుడు మరొక తీరా? దిల్లీలో ఒక తీరు?రాష్ట్రాల్లో ఒక తీరు? టీజీట్రాన్స్‌కో ప్రైవేటీకరణపై రాహుల్‌గాంధీ మోనం వహిస్తే.. కాంగ్రెస్ జాతీయ విధానం, తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వ విధానం ఒక్కటి కానట్లేనా? అని ప్రశ్నించారు.రాహుల్‌గాంధీ, మల్లికార్జున ఖర్గే, కేసీ వేణుగోపాల్ వెంటనే జోక్యం చేసుకుని టీజీట్రాన్స్‌కో ప్రైవేటీకరణను అడ్డుకోవాలి,తెలంగాణ ప్రజల ఆస్తులు.. ప్రైవేట్ వ్యక్తుల ఆస్తులు కావు.జీ ట్రాన్స్‌కోతో మొదలయ్యే ప్రైవేటీకరణకు ఇక్కడే అడ్డుకట్ట వేయాలి అని డిమాండ్ చేశారు.

## కొత్త మెరుగులు

>> ఆర్ఆర్ఆర్‌లను అనుసంధానిస్తూ 21 రేడియల్ రోడ్లను అభివృద్ధి చేస్తున్నామన్నారు. ఇప్పటికే 10 రోడ్ల అలైన్‌మెంట్‌కు అనుమతులు ఇచ్చామని, రెండు రోడ్ల పనులు ప్రారంభమయ్యాయని తెలిపారు. హైదరాబాద్ నగరానికి కీలకమైన మూసీ నది పునరుజ్జీవనానికి ప్రభుత్వం చర్యలు చేపట్టిందని తెలిపారు. సుమారు 55-56 కిలోమీటర్ల మేర ప్రవహించే మూసీని ప్రక్షాళన చేసి, నగరానికి మెరుగైన పర్యావరణ వాతావరణాన్ని అందించాలన్నదే తమ లక్ష్యమన్నారు. దీనికి సంబంధించి ఫేజ్-1 పనులు ఇప్పటికే ప్రారంభమయ్యాయన్నారు. హైదరాబాద్‌లో వాయు కాలుష్యాన్ని తగ్గించేందుకు డీజిల్ ఆర్టీసీ బస్సుల స్థానంలో ఎలక్ట్రిక్ బస్సులను ప్రవేశపెడుతున్నామని వెల్లడించారు. ఇప్పటికే 550 ఎలక్ట్రిక్ బస్సులు అందుబాటులోకి వచ్చాయని, మరో 2,200 బస్సులను భవిష్యత్తులో ప్రవేశపెట్టనున్నట్లు చెప్పారు. ఆటో డ్రైవర్లు డీజిల్ ఆటోలను ఎలక్ట్రిక్ ఆటోలుగా మార్చుకునేందుకు రెట్రోఫిట్టింగ్ కోసం రూ.200 కోట్లు మంజూరు చేశామన్నారు. హైదరాబాద్‌ను అంతర్జాతీయ స్థాయి నగరంగా తీర్చిదిద్దే లక్ష్యంతో 30 వేల ఎకరాల్లో భారత్ ఫ్యూచర్ సిటీని అభివృద్ధి చేస్తున్నామని తెలిపారు. ఈ ప్రాజెక్టులతో హైదరాబాద్ మరింత నివాసయోగ్యమైన నగరంగా మారుతుందని, పెట్టుబడులు, పరిశ్రమలు, ఉపాధి అవకాశాలు పెరుగుతాయని చెప్పారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు, రవాణా శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ వికాస్ రాజు తదితరులు పాల్గొన్నారు.

## రైతుల సేవలకు గుర్తింపుగా..
## రైతు కమిషన్ ఓఎస్‌డి ప్రసాద్‌కు
# కిసాన్ సేవా రత్న

**హైదరాబాద్, అక్టోబరు 2, ప్రభాతవార్త:** రైతుల సేవలకు గుర్తింపుగా రైతు సంక్షేమ కమిషన్ ఓఎస్‌డిగా విధులు నిర్వహిస్తున్న బి. హరి వెంకట ప్రసాద్‌కు కిసాన్ సేవా రత్న అవార్డుకు ఎంపికయ్యారు. హైదరాబాద్‌లోని ఎల్‌బీ స్టేడియంలో శుక్రవారం నిర్వహించిన ఒక కార్యక్రమంలో ప్రసాద్‌కు తెలంగాణ వ్యవసాయ, రైతు సంక్షేమ కమిషన్ చైర్మన్ ఎం. కోదండరెడ్డి ఈ అవార్డును అందచేశారు. రైతుల సమస్యలను క్షేత్రస్థాయిలో తెలుసుకోవడం, వాటిని సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లడం, రైతులకు ప్రభుత్వ పథకాలు, సేవలు అందేలా సమన్వయం చేయడం వంటి సేవలను గుర్తిస్తూ ఈ పురస్కారాన్ని అందజేసినట్లు ఈ సందర్భంగా కోదండరెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ప్రసాద్ మాట్లాడుతూ ఈ అవార్డును రైతులకు అంకితం చేస్తున్నానన్నారు. రైతుల సమస్యల పరిష్కారానికి మరింత బాధ్యతతో పనిచేస్తూ, రైతు సంక్షేమం కోసం నిరంతరం కృషి చేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రి పొన్నం ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

# 'స్వర్ణ'భారత్

## రెజ్లింగ్‌లో సుజీత్ 'స్వర్ణ పట్టు... ఆర్చరీలో మహిళల పసిడి 'గుర్తి

### పతకాల పట్టికలో 76 మెడల్స్‌తో భారత్ 5వ స్థానం

**ఐచినగోయా, అక్టోబరు 2:** ఆసియా క్రీడలలో 14వ రోజుల భారత్ 6 స్వర్ణ పతకాలతో ఒక అద్భుతమైన చారిత్రాత్మక రోజును ముగించింది. ఒకే రోజులో అత్యధిక స్వర్ణ పతకాలు సాధించడంలో ఇది భారత్‌కు అత్యుత్తమ ప్రదర్శన. మహిళల రికర్వ్ ఆర్చరీలో 'స్వర్ణం'తో మొదలైన రోజు మహిళల హాకీలో చారిత్రాత్మక 'స్వర్ణం'తో ముగిసింది. భారత మహిళల హాకీ జట్టు 44యేళ్ల తర్వాత స్వర్ణ పతకాన్ని గెలుచుకుంది. ఐచి నగోయాలో సలీమా టెటే నేతృత్వంలోని భారత జట్టు చైనాను 10తో ఓడించి చరిత్ర సృష్టించింది. మహిళల రికర్వ్ ఆర్చరీలో అంకిత భకత్, కుంకుమ్ మోహోద్, కీర్తి శర్మ దక్షిణ కొరియాను ఓడించి చరిత్ర సృష్టించడంతో భారత్ రోజును స్వర్ణ పతకంతో ప్రారంభించింది. బాక్సింగ్‌లో లవ్లీనా బోర్గోహైన్ తన బౌట్‌లో గెలిచి రెండో పతకాన్ని అందించగా, ఆ తర్వాత పర్వీన్ హుడా కూడా పతకం సాధించారు. పురుషుల బాక్సింగ్‌లో అంకుష్ పంఘాల్ అద్భుతమైన దాడితో కూడిన ఆటతీరును ప్రదర్శించి స్వర్ణ పతకాన్ని గెలుచుకున్నారు. సుజీత్ కల్కల్ కుడియేవ్ (రెజ్లింగ్)పై స్వర్ణ పతక పోరులో గెలిచి ఐదవ పతకాన్ని అందించారు. ఆర్చరీలో మిక్స్‌డ్ టీమ్ ఈవెంట్, పురుషుల రికర్వ్ జట్టు విభాగాల్లో కుంకుమ్, ధీరజ్ బొమ్మదేవర రెండు రజత పతకాలను అందించారు. అలాగే, సెయిలింగ్‌లో నేత్ర కుమనన్ కాంస్య పతకాన్ని, సెపాక్‌తక్రోలో పురుషుల క్వాడ్రాథ్లాన్ జట్టు కాంస్య పతకాన్ని సాధించాయి. 50 కేజీల విభాగంలో కాంస్య పతక పోరులో ఓడిపోవడంతో దీపాంశి మరో రెజ్లింగ్ పతకాన్ని తృటిలో కోల్పోయారు. భారత్ ఈ రోజును మొత్తం 10 పతకాలతో ఆరు స్వర్ణం, రెండు రజతం, రెండు కాంస్యం ముగించింది. దీంతో మొత్తం పతకాల సంఖ్య 76కి చేరింది. అలాగే, స్వర్ణ పతకాల పరంగా చూస్తే ఆసియా క్రీడలలో భారత్‌కు ఇది అత్యుత్తమ రోజులలో ఒకటి. ఆరు స్వర్ణ పతకాలను గెలుచుకోవడం ద్వారా భారత్ 8వ స్థానం నుండి 5వ స్థానానికి ఎగబాకింది.

మహిళల రికర్వ్ ఆర్చరీ జట్టు

| | | |
|---|---|---|
| (అంకిత భకత్, కుంకుమ్ మోహోద్, కీర్తి శర్మ | | : స్వర్ణం |
| బాక్సింగ్ (మహిళల 75కిలోలు) | : లవ్లీనా | : స్వర్ణం |
| బాక్సింగ్ (మహిళల 65కిలోలు) | : పర్వీన్ | : స్వర్ణం |
| బాక్సింగ్ (పురుషుల 80కిలోలు) | : అంకుష్ | : స్వర్ణం |
| రెజ్లింగ్ (పురుషుల విభాగం) | : సుజీత్ | : స్వర్ణం |
| మహిళల హాకీ (సలీమా టెటె నేతృత్వంలోని జట్టు) | | : స్వర్ణం |

### వారం - వర్జ్యం

03-10-2026, శనివారం,
శ్రీ పరాభవ నామ సంవత్సరం,
భాద్రపద మాసం, దక్షిణాయణం,
వర్ష ఋతువు, కృష్ణపక్షం, హస్త కార్తె,
తి.సప్తమి ఉ.8.00, అష్టమి తె. 5.52,
న. ఆరుద్ర రా.1.30,
వ.ఉ.10.49 -మ.12.20,
దు.తె .5.57-ఉ.7.33,
రాహు : ఉ.9.00- ఉ.10.30,
శుభ. స.ఉ.6.00-ఉ .7.00.

### వార్తాఫలం

**మేషం :** చిన్ననాటి మిత్రుల నుండి ఆహ్వానాలు అందుతాయి. ఆర్థిక పరిస్థితి మెరుగుపడుతుంది.

**వృషభం :** శ్రమకు తగిన ఫలితం దక్కుతుంది. బాధ్యతలు ఉక్కిరిబిక్కిరి చేసిన సన్నిహితుల సహాయంతో పూర్తి చేస్తారు.

**మిథునం :** సహోదరి నుండి కీలక సమాచారం అందుతుంది. జీవిత భాగస్వామి నుండి ఆస్తి లాభం పొందుతారు.

**కర్కాటకం :** నూతనోత్సాహంతో పనులు పూర్తి చేస్తారు. ఆత్మీయులను కలిసి ఆనందంగా గడుపుతారు.

**సింహం :** ఆకస్మిక ధనలాభం పొందుతారు. ఋణబాధలు తొలగి ఊరట చెందుతారు. వస్తు, వస్త్ర, విలువైన ఆభరణాలు పొందుతారు.

**కన్య :** విద్య, ఉద్యోగావకాశాలు వుంటాయి. ఉద్యోగాలలో చిక్కులు ఎదురైనా అధిగమించి ముందుకు సాగుతారు.

**తుల :** ఇంట బయటా చికాకులు ఎదురైనా అధిగమించి ముందుకు సాగుతారు. జీవిత భాగస్వామి సలహాతో నూతన కార్యక్రమాలు చేపడతారు.

**వృశ్చికం :** శుభకార్యాలలో చురుకుగా పాల్గొంటారు. పాతబాకీలు వసులవుతాయి. ఆహ్వానాలు ఆశ్చర్యపరుస్తాయి.

**ధనుస్సు :** బంధు వర్గంతో ఏర్పడిన వివాదాలు వరిష్కారించుకుంటారు. కాలభైరవాష్టకం పారాయణం చేయండి.

**మకరం :** ఇంటా బయటా ప్రోత్సాహం లభిస్తుంది.దూరప్రాంతాల నుండి అరుదైన ఆహ్వానాలు అందుతాయి. కార్యజయం.

**కుంభం :** అదనపు బాధ్యతలు ఉక్కిరి బిక్కిరి చేస్తాయి. దూరపు బంధువులను కలిసి కష్టసుఖాలును పంచుకుంటారు.

**మీనం :** ముఖ్యమైన వ్యవహారాలలో విజయం సాధిస్తారు. ఇంటర్వ్యూలలో విజయం సాధిస్తారు.ఆస్తి లాభం పొందుతారు.

-శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్



శుక్రవారం గాంధీజయంతి సందర్భంగా రాజ్‌ఘాట్‌లోని సమాధివద్ద నివాళులర్పిస్తున్న రాష్ట్రపతి ద్రౌపది ముర్ము

## జంతర్‌మంతర్ ఉద్రిక్తం

>> లోకి తీసుకున్నారు. నిరసనకు అధికారిక అనుమతి ఇవ్వలేదని పోలీసులు చెబుతున్నారు. అయితే ఆప్ నేతలు శాంతియుతంగా నిరసన నిర్వహించేందుకు అనుమతి కోసం ముందుగానే దరఖాస్తు చేసుకున్నామని పేర్కొన్నారు. నిరసన చేపట్టడం తమ హక్కు అని వారు తెలిపారు. నిరసన నేపథ్యంలో జంతర్ మంతర్ పరిసర ప్రాంతాల్లో మొబైల్ ఇంటర్నెట్ సేవలను అధికారులు నిలిపివేసినట్లు నివేదికలు వెల్లడించాయి. భద్రతా ఏర్పాట్లలో భాగంగా జంతర్ మంతర్ చుట్టుపక్కల ప్రాంతాలను పలు జోన్లుగా విభజించి, ప్రతి జోన్‌కు సీనియర్ పోలీసు అధికారులను నియమించారు. పోలీసులు డ్రోన్ కెమెరాలతో పరిసరాలను పర్యవేక్షించడంతో పాటు సోషల్ మీడియా కార్యకలాపాలపై కూడా నిఘా ఉంచినట్లు సమాచారం. భద్రతా చర్యల్లో భాగంగా ఢిల్లీ మెట్రో రైల్ కార్పొరేషన్ 11 మెట్రో స్టేషన్లలో ప్రవేశం, నిష్క్రమణను తదుపరి ఆదేశాలు వచ్చే వరకు మూసివేసింది. అయితే కొన్ని స్టేషన్లలో ఇంటర్‌చేంజ్ సదుపాయం కొనసాగుతోంది. రాజీవ్ చౌక్, మండీ హౌస్, న్యూఢిల్లీ, సెంట్రల్ సెక్రటేరియట్ వంటి కొన్ని స్టేషన్లలో ఇంటర్‌చేంజ్ సదుపాయం అందుబాటులో ఉన్నట్లు అధికారులు తెలిపారు. నిరసన నేపథ్యంలో న్యూఢిల్లీ జిల్లాలో సెక్షన్ 163 కింద నిషేధాజ్ఞలు అమల్లోకి తీసుకొచ్చారు. జంతర్ మంతర్ వద్ద నిరసనకు ఢిల్లీ పోలీసులు అనుమతి ఇవ్వలేదని అధికారులు తెలిపారు. భద్రతా బలగాలను కూడా భారీగా మోహరించారు. జంతర్ మంతర్, జైసింగ్ రోడ్, అశోక్ రోడ్, ఫిరోజ్ షా రోడ్, జన్‌పథ్ తదితర ప్రాంతాల్లో ట్రాఫిక్ ఆంక్షలు, మళ్లింపులు అమల్లోకి వచ్చాయి. జంతర్ మంతర్ రోడ్డులో వాహనాల రాకపోకలను నియంత్రించడం లేదా ప్రత్యామ్నాయ మార్గాలకు మళ్లించారు. కనాట్ ప్లేస్ నుంచి పటేల్ చౌక్ వైపు, పటేల్ చౌక్ నుంచి జిపిఓ వైపు వెళ్లే వాహనాల రాకపోకల్లో కూడా అవసరాన్ని బట్టి మార్పులు చేసినట్లు ట్రాఫిక్ పోలీసులు తెలిపారు. టాల్స్టాయ్ మార్గ్, పార్లమెంట్ స్ట్రీట్ పరిసరాల్లో కూడా ఆంక్షలు విధించారు. ప్రయాణికులు వీలైనంత వరకు ప్రత్యామ్నాయ మార్గాలను ఎంచుకోవాలని అధికారులు సూచించారు. ప్రత్యేక సమగ్ర పునఃపరిశీలన సర్ ద్వారా ఓటర్ల జాబితాల్లో మార్పులు, ఓటర్ల పేర్ల తొలగింపు జరిగిందని నిరసనకు దిగిన సంగతి తెలిసిందే.

## ముంబయిలో సిజెపి భారీ ఆందోళన

>> బాధ్యుడిని చేయడానికి జైలుకు వెళ్లాల్సి వచ్చినా వెనుకాడబోమని సిజెపి సహ కన్వీనర్ అశుతోష్ రంకా అన్నారు. పెద్ద సంఖ్యలో ఓటర్ల పేర్లను జాబితా నుంచి తొలగించారని ఆయన ఆరోపించారు. గతంలో చేపట్టిన ఆందోళన తరహాలోనే, డిమాండ్లు నెరవేరే వరకు పోరాటం కొనసాగిస్తామని స్పష్టం చేశారు. మరో సహ కన్వీనర్ సౌరవ్ దాస్ మాట్లాడుతూ గతంలో జంతర్‌మంతర్ వద్ద యువత పెద్ద ఎత్తున ఉద్యమంలో పాల్గొన్న విషయాన్ని గుర్తుచేశారు. అదే స్ఫూర్తితో ముంబై నుంచి దేశవ్యాప్త ఆందోళన ప్రారంభించాలని నిర్ణయించినట్లు చెప్పారు. గాంధీ జయంతి సందర్భంగా యువత మరోసారి ఐక్యంగా ఉద్యమంలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఓటు హక్కుకు భంగం కలిగితే దేశంలో మార్పు సాధ్యం కాదని వ్యాఖ్యానించారు. బిజెపికి చెందిన కొందరు కార్యకర్తలు ఆందోళనను అడ్డుకునేందుకు ప్రయత్నించారని దాస్ ఆరోపించారు. ఈ మేరకు సంబంధిత వ్యక్తుల ఫొటోలను కూడా అందించినట్లు చెప్పారు. ఆందోళనకు సంబంధించి ముంబై పోలీసులకు ముందస్తు సమాచారం ఇచ్చామని, వారి సహకారం ఉంటుందని ఆశిస్తున్నామని తెలిపారు. నిరసన శాంతియుతంగా నిర్వహిస్తామని, ఇక్కడి నుంచే దేశవ్యాప్త ఉద్యమానికి శ్రీకారం చుడతామని పేర్కొన్నారు. ఆందోళన ప్రారంభానికి ముందే శివాజీ పార్క్ వద్దకు ప్రజలు చేరుకున్నారని సీజేపీ నేత సిద్ధాంత్ భరద్వాజ్ తెలిపారు. కనీసం 40 వేల నుంచి 50 వేల మంది హాజరవుతారని, ఆ సంఖ్య లక్ష దాటే అవకాశం ఉందని అంచనా వేశారు.

## రాష్ట్రమంతా సెంట్రల్ కిచెన్లు

>> రెడ్డి, హరే కృష్ణ ప్రతినిధి సత్య గౌర చంద్ర దాస్ స్వామీజీతో పాటు ఇతర ప్రతినిధులు, ఉన్నతాధికారులు పాల్గొన్నారు. వచ్చే డిసెంబర్ 9 నాటికి రాష్ట్ర వ్యాప్తంగా ఒకేసారి సెంట్రలైజ్డ్ కిచెన్లను ప్రారంభించేలా అవసరమైన చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి ఒవంత్ రెడ్డి ఆదేశించారు. నవంబర్ 30వ తేదీలోగా ఈ కిచెన్ల ఏర్పాట్లు పూర్తయ్యేలా చూడాలని చెప్పారు. ఆయా ప్రాంతాల్లో ఏర్పాటు చేస్తున్న సెంట్రల్ కిచెన్లను విద్యార్థులు సందర్శించేలా అవసరమైన చర్యలు తీసుకోవాలని అధికారులకు చెప్పారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకునే విద్యార్థుల ట్రాక్ రికార్డును నిర్వహించాలని, విద్యార్థుల శారీరక పెరుగుదల, విద్యా పురోగతి వంటి అంశాలను ఎప్పటికప్పుడు నమోదు చేయాలని ముఖ్యమంత్రి సూచించారు. ఆహారంలో ఇచ్చే పదార్థాల కేలరీలను లెక్కించడానికి యాప్‌లను ఉపయోగించుకోవాలని చెప్పారు. బ్రేక్‌ఫాస్ట్ వల్ల విద్యార్థులు సమయానికి పాఠశాలకు చేరుకుంటారని, విద్యార్థులకు అందించే ఆహార నాణ్యత విషయంలో నిరంతర పర్యవేక్షణ ఉండాలని, అవసరమైన జాగ్రత్తలు పాటించాలని పేర్కొన్నారు. ప్రాంతాల వారీగా అక్కడి అలవాట్లకు అనుగుణంగా బ్రేక్‌ఫాస్ట్‌ను అందించే విధంగా చూడాలని, జీవితకాలం కొనసాగించాల్సిన ఈ కార్యక్రమం కాబట్టి సెంట్రల్ కిచెన్లను కమాండ్ కంట్రోల్ సెంటర్‌కు అనుసంధానం చేయాలని సూచించారు.

## పెరిగిన ఆటో ఛార్జీలు

>> ప్రయాణించే ప్రతి అదనపు కిలోమీటరుకు రూ.14 చొప్పున వసూలు చేయనున్నారు.ఈ ఉత్తర్వుల ప్రకారం, రాత్రి సమయ ఛార్జీలను కూడా సవరించారు.రాత్రి 11 గంటల నుంచి తెల్లవారుజామున 5 గంటల మధ్య సాధారణ ఛార్జీపై ఒకటిన్నర రెట్లు అధికంగా వసూలు చేస్తారు. ప్రయాణికుల కోసం వేచి ఉండే సమయానికి (వెయిటింగ్ ఛార్జీలు) నిమిషానికి 75 పైసలుగా ఖరారు చేశారు.ప్రస్తుతం ఉన్న డిజిటల్ మీటర్లను కొత్త ఛార్జీలకు అనుగుణంగా మార్చుకునేందుకు ఆటో డ్రైవర్లకు మూడు నెలల గడువు ఇచ్చారు. ఈలోగా పాత, కొత్త ఛార్జీల వివరాలతో కూడిన టారిఫ్ కార్డులను ఆటోల్లో తప్పనిసరిగా ప్రదర్శించాలని ప్రభుత్వం ఆదేశించింది. చివరిసారిగా ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ హయాంలో 2014 ఫిబ్రవరిలో ఆటో ఛార్జీలను సవరించారు.అప్పటి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నిర్ణయించిన రేట్లే తెలంగాణలోనూ కొనసాగుతున్నాయి. 2014లో అమల్లోకి వచ్చిన రేట్లలో మొదటి 1.6 కిలోమీటర్లకు రూ.20.. ఆ తర్వాత ప్రతి కిలోమీటర్‌కు రూ.11గా ఉండేది. 12 యేళ్లకు పైగా ఛార్జీల్లో మార్పు లేకపోవడంతో ఇంధనం, వాహన నిర్వహణ, ఇన్సూరెన్స్, టైర్లు, మరమ్మతులు వంటి ఖర్చులు పెరిగిన నేపథ్యంలో తాజాగా రేట్ల సవరణ చేపట్టారు.వాహనాల కొనుగోలు వ్యయం, ఇంధన ధరలు, నిర్వహణ ఖర్చులు, బీమా, డ్రైవర్ల జీవన వ్యయం పెరిగిన నేపథ్యంలో ఛార్జీలు పెంపును సిఫారసు చేస్తూ ప్రభుత్వ నియమించిన కమిటీ నివేదిక సమర్పించింది. ఈ సిఫారసుల మేరకే ప్రభుత్వం తాజా నిర్ణయం తీసుకుంది. హైదరాబాద్ మెట్రో, టీజీఎస్‌ఆర్టీసీ బస్సుల కోసం కామన్ పాస్‌ను ప్రారంభించిన రోజే ఈ ఛార్జీల పెంపు ఉత్తర్వులు వెలువడటం గమనార్హం. ఆటో కార్మికులకు ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేస్తూ, ఆగస్టు 23 నుంచి బంద్ చేయాలని రాష్ట్ర ఆటో, యాప్ ఆధారిత రవాణా సంఘాల జాయింట్ యాక్షన్ కమిటీ గతంలో వెల్లడించింది. దీంతో ఆగస్టు 22వ తేదీన కార్మికులతో ప్రభుత్వం చర్చలు జరిపింది. ప్రభుత్వం తరఫున రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, అధికారులు చర్చల్లో పాల్గొన్నారు. ఆటో కార్మికుల డిమాండ్ల పట్ల ప్రభుత్వం సానుకూలంగా ఉందని మంత్రి వారికి హామీ ఇచ్చారు. ఆర్టీసీ ఎలక్ట్రిక్ ఆటోలను కొనుగోలు చేయనుందనే వార్తల్లో వాస్తవం లేదని స్పష్టం చేశారు. మంత్రి హామీతో బంద్ విరమించిన కార్మికులు, వారి ప్రతిపాదనలను రవాణా శాఖకు పంపారు. దీనిపై ఏర్పాటైన అధికారుల కమిటీ ఛార్జీల పెంపుపై సెప్టెంబర్ నెలలో ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపింది. తాజాగా ఈ ప్రతిపాదనలకు ప్రభుత్వం ఆమోదం తెలపగా, రవాణా శాఖ ఉత్తర్వులు జారీచేసింది.

## వానలొచ్చేనా?

>> కొన్ని ప్రాంతాలు, కేరళ కొండ ప్రాంతాల్లో సాధారణం లేదా అధిక వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉందని వివరించారు. అదే సమయంలో దక్షిణ ద్వీపకల్పంలోని అనేక ప్రాంతాల్లో గరిష్ట, కనిష్ట ఉష్ణోగ్రతలు సాధారణ స్థాయిల కంటే ఎక్కువగా నమోదయ్యే అవకాశం ఉందని ఐఎండి అంచనా వేసింది. ఈ ఏడాది ఎల్‌నినో ప్రభావం బలంగా ఉందని పేర్కొన్నారు. నవంబర్ చివరి వరకు దీని ప్రభావం బలంగా కొనసాగి, ఆ తర్వాత క్రమంగా తగ్గే అవకాశం ఉందన్నారు. అయితే దాని ప్రభావాలు 2027 మార్చి వరకు కొనసాగవచ్చని వివరించారు.

## మూగజీవాల హాహాకారాలు

>> వెలుగు చూడడం గమనార్హం. ఇప్పటికే అరుదైన మూగజీవాలను కొందరు స్మగ్లింగ్ చేస్తూ డబ్బులు సంపాదిస్తున్న ఉదంతాలు వెలుగు చూస్తుండగా దీనికి తోడుగా జింకలను వధిస్తున్న ఘటనలు పెరిగిపోతుండడంపై ఆందోళన వ్యక్తం అవుతోంది.

రాష్ట్రంలో వన్యప్రాణులు, మూగజీవాల స్మగ్లింగ్, వాటిని అన్యాయంగా వధిస్తున్న ఘటనలు అంతకంతకూ పెరిగిపోతున్నాయి. ఇప్పటికే గో వులతో పాటు ఒంటెలు, నెమళ్లు, జింకలు, దుప్పులు, అడవి కుందేళ్లు, దేవాంగ పిల్లులు, అరుదైన కోతుల వంటి వన్య ప్రాణుల స్మగ్లింగ్‌తో పా టు వాటిని వధించి మాంసాన్ని విక్రయిస్తుండడం తరచూ వెలుగు చూస్తుండగా తాజాగా ఇటువంటి ఘటన మరొకటి బహిర్గతమయ్యింది. ప్రజల ఆహారపు అలవాట్లకు, మూఢనమ్మకాలకు మూగజీవులు, వన్యప్రాణులు అన్యాయంగా బలవుతున్నా సర్కారీ విభాగాలు చోద్యం చూస్తుండడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. దేశంలోని ఇతర ప్రాంతాలతో పోలిస్తే వేగంగా అభివృద్ధి చెందుతున్న గ్రేటర్ హైదరాబాద్‌లో మాంసాహార ప్రియుల అలవాట్లు రోజు రోజుకూ మారిపోతుండడం స్మగ్లర్లకు అనుకూలంగా మారిందని చెప్పాలి. నిన్నమొన్నటి వరకు జంట నగరాలలో మాంసాహారం అంటే చికెన్, మటన్ వరకే పరిమితమయ్యేది. పాతబస్తీ వంటి కొన్ని ప్రాంతాలలో గొడ్డు మాంసం వుండడం తెలిసిందే. కొన్ని సందర్భాలలో దొంగచాటుగా కొందరు వ్యాపారులు జింక, దుప్పి, నెమళ్ల మాంసం తీసుకువచ్చి తమ కస్టమర్లకు అమ్ముతున్న ఉదంతాలు వున్నా యి. దీంతో పాటు చాలా మంది వన్య ప్రాణులతో అరుదైన కృష్ణ జింక, తాబేళ్లతో పాటు ఒంటె మాంస ంపైనా మక్కువ చూపుతున్నారు. వన్య ప్రా ణులను చాటుమాటుగా వధిస్తున్న స్మగ్లర్లు ఇదే సమయంలో తాంత్రిక పూజారుల కోసం వీటిని అమావాస్య, పౌర్ణమి రోజుల్లో వధించేందు కు అడవుల నుంచి తీసుకువస్తున్నారు. నాలుగేళ్ల క్రితం కార్తికమాసాన ఈ తరహాలోనే ఓ కృష్ణ జింక కూనను స్మగ్లర్లు హైదరాబాద్‌కు తరలించగా టాస్క్‌ఫోర్స్ పోలీసులు చివరి నిమిషంలో సమాచారం అందుకుని దానిని కాపాడారు. ఇక ఎడారి ఓడగా పిలిచే ఒంటెలను వధించే విష సంస్కృతి రాష్ట్రంలోని అనేక చోట్ల ఎక్కువవుతుండడం పట్ల వన్యప్రాణి ప్రేమికులు ఆవేదన చెందుతున్నారు. ఒంటె పాలను పసిపిల్లలకు తాగిస్తే జీర్ణశక్తి బాగా వుంటుందని ఓ నమ్మకం. ఇదే సమయంలో ఒంటె మాంసం తింటే ఒంట్లో వేడి మరింత పెరిగి ఎక్కువ సమయం ఉత్సాహంగా వుంటుందని, శృంగార సామర్థ్యం పెరుగుతుందని మరికొందరి నమ్మకం. ఈ క్రమంలోనే ఒంటె మాంసానికి డిమాండ్ ఏర్పడిందని చెప్పాలి. ఒంటెల మాంసం విషయం అలావుంచితే జింకలు, దుప్పులను వధించి వాటిమాంసాన్ని నగరంలో విక్రయించడం ఎక్కువవుతోంది. నాలుగేళ్ల క్రితం నిజామాబాద్ అడవుల్లో వన్య ప్రాణులను వధించి వాటి మాంసంతో స్నేహితులతో కలిసి విందు చేసుకుంటున్న ఓ ముఠాను అటవీ శాఖ విజిలెన్స్ విభాగం అధికారులు అరెస్టు చేయడం సంచలనం రేపింది. హైదరాబాద్‌లోని గుడిమల్కాపూర్‌కు చెందిన కొందరు తరచూ నిజామాబాద్ అటవీ ప్రాంతంలో వన్య ప్రాణులుండే చోట జింకలు, దుప్పులు, ఇతర జంతువులను వేటాడుతుంటారు. ఈ సందర్భంగా తాము చంపిన జంతు వుల మాంసంతో అదే ప్రాంతంలో వర్నీ అటవీ డివిజన్‌లో రైస్ మిల్‌లో విందు చేసుకోవడం వీరికి అలవాటు వుంది. ఈ ఘటన తరువాత న లమల అడవుల్లో నీటి పాయలు ఎక్కువగా వుండే అడవి లోపలి భాగంలో నివసించే అరుదైన నల్లటి మచ్చలు కలిగిన గూడ్ల గూబలను పట్టు కుని వాటిని పాతబస్తీ లోని పక్షుల మార్కెట్‌లో బహిరంగంగా అమ్మకానికి పెట్టడం మరింత సంచలనం రేపింది. ఇంటి చుట్టూ గుడ్ల గూబలు తిరిగితే అదృష్టం కలిసి వస్తుందని, ఇంటి వద్ద గల చెట్లపై ఈ పక్షి వుంటే సిరిసంపదలు వచ్చిపడతాయని, ఎవరికైనా ఆరోగ్యం పాడైతే ఈ ప క్షుల చేత దిష్టి తీయిస్తే అనారోగ్యంతో వున్న వారు కోలుకుంటారని కొందరి మూఢ నమ్మకం అడవుల్లో సంచరించే నిశాచర జీవులైన గూడ్ల గూ బలకు శాపంగా మారింది. దీని తరువాత ఆదిలాబాద్ అడవుల్లో సంచరించే కృష్ణ జింకలను వేటాడే ఒక ముఠాను పోలీసులు, అటవీ శాఖ అ ధికారులు సంయుక్తంగా దాడిచేసి పట్టుకున్నారు. ఈ సందర్భంగా ఒక జింక కూనను ప్రాణాలతో వుండగా దానిని కాపాడారు. మరో జింకను వధించగా దాని మాంసాన్ని స్వాధీనం చేసుకున్నారు. ఈ ఘటనలో స్మగ్లర్లను అరెస్టు చేశారు.

**వన్యప్రాణుల స్మగ్లింగ్ మాంసం విక్రయాలపై సర్కారీ విభాగాల పర్యవేక్షణ లోపం**

ఇదిలావుండగా రాష్ట్రంలో వన్యప్రాణుల స్మగ్లింగ్, వాటిని వధిస్తున్న ఘటనలతో పాటు వాటి మాంసం విక్రయాలపై సర్కారీ విభాగాల పర్యవేక్షణ పూర్తిగా లోపించింది. మారుమూల ప్రాంతాలలో వన్యప్రాణులను వధించడం, వాటిని స్మగ్లింగ్ చేస్తున్న ఘటనలు, ఈ సందర్భంగా వేటగాళ్లు పట్టుబడుతున్న ఉదంతాలు తరచూ చూస్తూనే వున్నా ఇప్పుడు ఇవి హైదరాబాద్‌కు కూడా పాకడం సంచలనం రేపుతోంది. అటవీ ప్రా ంతంలో స్మగ్లర్ల హంగామా ఎలావున్నా పోలీసు యంత్రాంగం పటిష్టంగా వున్న హైదరాబాద్‌లోనే స్మగ్లర్లు చెలరేగడం మరింత సంచలన అంశ ంగా చెప్పాలి. తాజా ఘటనల నేపథ్యంలో అయినా సర్కారీ విభాగాలు కళ్లు తెరవాల్సిన అవసరం ఎంతైనా వుంది.

## చైనాపై విజయం సాధించిన భారత్ మహిళల జట్లకు అభినందనలు: సిఎం రేవంత్‌రెడ్డి

**హైదరాబాద్,అక్టోబరు2,ప్రభాతవార్త:** జపాన్‌లో జరుగుతున్న 2026 ఆసియా క్రీడల్లో అద్భుత ప్రదర్శన కనబరిచి హాకీ తుదిపోరులో చైనాపై విజయంతో బంగారు పతకం సాధించిన భారత మహిళల హాకీ జట్టుకు ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి శుభాభినందనలు తెలిపారు. 1982 తర్వాత మహిళల హాకీ జట్టు ఆసియా క్రీడల్లో మళ్లీ అత్యద్భుత ప్రతిభ కనబరిచి బంగారు పతకం కోసం 44 ఏళ్ల నిరీక్షణకు తెరదించడం ఎంతో ప్రశంసనీయమైన విషయమని పేర్కొన్నారు.

భారత్ జట్టులో లాల్‌రెమ్సియామి హ్మార్జోటే 10వ నిమిషంలో చేసిన గోల్‌తో చైనాపై ఆధిక్యం సాధించడమే కాకుండా, రెండో క్వార్టర్‌లో సవితా పూనియా పెనాల్టీ స్ట్రోక్‌ను అడ్డుకుని జట్టు అద్భుత ప్రదర్శన కనబరిచిందని అభినందించారు.

## లాల్ బహదూర్ శాస్త్రి ఆదర్శాలు నేటి తరానికి స్ఫూర్తిదాయకం

### గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా



రహీంపుర లాల్ బహదూర్ ప్లే గ్రౌండ్ వద్ద లాల్ బహదూర్ శాస్త్రి విగ్రహానికి నివాళులు అర్పించిన గవర్నర్ శివ్ ప్రతాప్ శుక్లా

**హైదరాబాద్,అక్టోబరు2,ప్రభాతవార్త:** మాజీ ప్రధాని లాల్ బహదూర్ శాస్త్రి జయంతి సందర్భంగా గవర్నర్ శివప్రతాప్ శుక్లా నివాళులు అర్పించారు. శుక్రవారం హైదరాబాద్ రహీంపూర్‌లోని లాల్ బహదూర్ ప్లే గ్రౌండ్స్ వద్ద ఉన్న లాల్ బహదూర్‌శాస్త్రి విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా గవర్నర్ మాట్లాడుతూ లాల్ బహదూర్ శాస్త్రి జీవితం నిరాడంబరత, నిజాయితీ,క్రమశిక్షణ, దేశభక్తి,నిస్వార్థ సేవకు ప్రతీకగా నిలిచిందన్నారు. అత్యున్నత పదవిలో ఉన్నప్పటికీ సాధారణ జీవన విధానాన్ని కొనసాగిస్తూ ప్రజాసేవకు తన జీవితాన్ని అంకితం చేసిన శాస్త్రి ఆదర్శాలు నేటికి ప్రజలకు మార్గదర్శకంగా నిలుస్తున్నాయని పేర్కొన్నారు. ప్రజా జీవితంలో నైతిక విలువలకు,నిజాయతీకి శాస్త్రి అత్యంత ప్రాధానం ఇచ్చారని గవర్నర్ అన్నారు. దేశ ప్రయోజనాలను వ్యక్తిగత ప్రయోజనాల కంటే ముందుగా ఉంచిన ఆయన నాయకత్వం భారత ప్రజాస్వామ్య చరిత్రలో ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకుందని పేర్కొన్నారు.

## కడప ఎంపి అవినాష్ రెడ్డికి ఇడి నోటీసులు

### 14న విచారణకు రావాలని ఆదేశం

### వివేకా హత్యకేసులో చురుకుగా దర్యాప్తు

**హైదరాబాద్, అక్టోబరు 2, ప్రభాతవార్త:** తెలుగు రాష్ట్రాల్లో సంచలనం రేపిన మాజీ మంత్రి వై.ఎస్ వివేకానంద రెడ్డి హత్య కేసులో కీలక పరి ణామం చోటుచేసుకుంది. ఈ కేసులో నిందితులకు అందిన 40 కోట్ల రూపాయల వ్యవహారంపై లెక్కలు తేల్చేందుకు మనీలాండరింగ్ కోణంలో విచారణ చేస్తున్న కేంద్ర దర్యాప్తు సంస్థ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరక్టరేట్ (ఈడీ) అధికారులు దూకుడు పెంచారు. ఈ కేసులో నిందితులకు అందిన 40 కోట్ల రూపాయల విషయమై నిగ్గు తేల్చేందుకు కడప ఎంపి అవినాష్ రెడ్డికి ఈడీ అధికారులు శుక్రవారం నోటీసులు జారీ చేశారు. ఈ నెల 14వ తేదీన హైదరాబాద్‌లోని ఈడీ కార్యాలయానికి విచారణకు రావాలని అందులో ఆదేశించారు. వివేకానంద రెడ్డి హత్య కేసులో సిబిఐ దాఖ లు చేసిన ఎఫ్ఐఆర్, ఛార్జిషీట్ల ఆధారంగా ఈడీ రంగంలో దిగడం తెలిసిందే. 2025 ఆగస్టు నెలలో మనీలాండరింగ్ చట్టం కింద కేసు నమో దు చేసి విచారణ చేబట్టిన ఈడీ ఈ క్రమంలో 2019 నుంచి నిందితులతో పాటు అనుమానితుల బ్యాంకుల లావాదేవీల వివరాలు సేకరించి, వీ టి ఆధారంగా ఈ కేసులో అప్రూవర్‌గా మారిన దస్తగిరితో పాటు ఎ1గా వున్న ఎర్ర గంగిరెడ్డి, ఎ2గావున్న సునీల్ యాదవ్ మరో నిందితుడు ఉమాశంకర్ రెడ్డిలను విచారించి కీలక సమాచారం సేకరించడం తెలిసిందే. ఇందులో సునీల్ యాదవ్, దస్తగిరిలు వైకాపా నేతల నుంచి తమ కు ప్రాణ భయం వుందని చెప్పడం సంచలనం రేపింది. అంతకు ముందు గత ఆగస్టు 21వ తేదీన హైదరాబాద్, కడప జిల్లాలోని ఆరు ప్రాం తాలలో ఈడీ అధికారులు సోదాలు నిర్వహించారు. ఈ సోదాల్లో ఎంపి అవినాష్ రెడ్డి ఇంట్లో 24 లక్షల రూపాయల నగదును, లాకర్ల తాళా లు, కీలక దస్త్రాలను ఈడీ అధికారులు స్వాధీనం చేసుకున్నారు.

## గుల్బర్గా వెళుతూ హైదరాబాద్‌లో ఆగిన అఖిల భారత కాంగ్రెస్ పార్టీ జాతీయ అధ్యక్షుడు మల్లిఖార్జున ఖర్గే



మల్లికార్జున ఖర్గేకి స్వాగతం పలికిన టిపిసిసి అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, ప్రభుత్వ సలహాదారు హార్కర వేణుగోపాల్ తదితరులు

# దేశ ప్రధాని అయినా సొంత కారు కోసం ఐదువేల రుణం

### లాల్‌బహదూర్ శాస్త్రి నిరాడంబరతకు దర్పణం



**లక్నో, అక్టోబరు 2:** దేశానికి ప్రధానిగా ఉన్నప్పటికీ సొంతంగా కారు కొనేందుకు రుణం తీసుకున్న శాస్త్రి ఆనాటి ప్రధాని నిరాడంబరతకు గుర్తుగా నిలిచారు. తన ఇంటి అవసరాలకు కారు కొనడానికి బ్యాంకు లోన్ తీసుకున్నారు. అప్పటి రోజుల్లో తీసుకున్న ఆ రూ.5 వేల రుణం శాస్త్రి నిరాడంబర జీవనశైలికి మరో ఉదాహరణగా నిలిచింది. స్కూలుకు టాంగా లాల్బహదూర్ శాస్త్రి పిల్లలు సాధారణంగా స్కూలుకు టాంగాలో వెళ్లేవారని ఆయన కుమారుడు అనిల్ శాస్త్రి చెప్పారు. అప్పుడప్పుడు అధికారిక కారును ఉపయోగించే అవకాశం ఉన్నా కుటుంబ సభ్యుల వ్యక్తిగత అవసరాలకు దాన్ని తరచూ వాడేందుకు శాస్త్రి దేశానికి ప్రధానిగా ఉన్నారు అధికారిక కారు అందుబాటులో ఉంది. అయినా కుటుంబ అవసరాల కోసం దాన్ని సొంత పనులకు వాడేందుకు లాల్బహదూర్ శాస్త్రి ఇష్టపడలేదు. చివరకు ఇంట్లో సొంతంగా ఓ కారు ఉండాలని భావించారు. కారు కొనడానికి బ్యాంకు లోన్ తీసుకున్నారు. అప్పటి రోజుల్లో తీసుకున్న ఆ రూ.5 వేల రుణం వెనుక ఉన్న కథశాస్త్రి నిరాడంబర జీవనశైలికి మరో ఉదాహరణగా నిలిచింది. లాల్‌బహదూర్ శాస్త్రి పిల్లలు సాధారణంగా స్కూలుకు టాంగాలో వెళ్లేవారని ఆయన కుమారుడు అనిల్ శాస్త్రి చెప్పారు. అప్పుడప్పుడు అధికారిక కారును ఉపయోగించే అవకాశం ఉన్నా కుటుంబ సభ్యుల వ్యక్తిగత అవసరాలకు దాన్ని తరచూ వాడేందుకుశాస్త్రి అనుమతించేవారు కాదట. దీంతో ఇంట్లో సొంతంగా ఓ కారు ఉంటే బాగుంటుందని కుటుంబం భావించింది. కొత్త ఫియట్ కారు కొనాలని నిర్ణయించారు. కారు ధర రూ.12 వేలు అప్పట్లో కొత్త ఫియట్ కారు ధర సుమారు రూ.12 వేలుగా ఉండేదట.శాస్త్రి బ్యాంకు ఖాతాలో దాదాపు రూ.7 వేలే ఉన్నాయి. దీంతో మరో రూ.5 వేల అవసరం వచ్చింది. ఆ మొత్తాన్ని ప్రభుత్వాన్ని అడిగి సమకూర్చుకోవడం కాకుండాశాస్త్రిబ్యాంకు రుణం తీసుకోవాలని నిర్ణయించుకున్నారు. పంజాబ్ నేషనల్ బ్యాంక్ నుంచి రూ.5 వేల లోన్ తీసుకున్నట్లు ఆయన కుమారుడి జ్ఞాపకాల ఆధారంగా తెలుస్తోంది. అలా 1964లో ఫియట్ కారును కొనుగోలు చేశారు. దాని రిజిస్ట్రేషన్ నంబర్ డీఎల్ఈ 6. 1966 జనవరి 11న తాష్కెంట్లో లాల్బహదూర్‌శాస్త్రి కన్నుమూశారు. అప్పటికి కారు రుణం పూర్తిగా చెల్లించలేదు. ఆ తర్వాత ఆయన భార్య లలితా శాస్త్రితనకు వచ్చిన పెన్షన్ నుంచి మిగిలిన రుణాన్ని చెల్లించినట్లు కుమారుడు అనిల్ శా చెప్పినట్లు కథనాలు పేర్కొంటున్నాయి. నేడు ఆ కారు న్యూఢిల్లీలోని లాల్‌బహదూర్ శా మెమోరియల్లో ప్రదర్శనలో ఉంది. క్రీమ్ రంగులో ఉన్న ఆ పాత ఫియట్ శాస్త్రినిరాడంబర జీవనానికి గుర్తుగా నిలిచింది.

# తెలంగాణ ప్రభుత్వ ప్రతినిధి బృందం జపాన్‌లో పర్యటన

### ఆసియా క్రీడలను వీక్షించిన మంత్రి వాకిటి బృందం

**హైదరాబాద్, అక్టోబర్ 2:** జపాన్‌లోని ఐచి–నాగోయా వేదికగా జరుగుతున్న ఆసియా క్రీడలను తెలంగాణ ప్రభుత్వ ప్రతినిధి బృందం శుక్రవారం వీక్షించింది. రాష్ట్ర క్రీడా శాఖ మంత్రి వాకిటి శ్రీహరి నేతృత్వంలో జపాన్‌లో పర్యటిస్తున్న ఈ బృందం రెండో రోజు క్రీడాకారులలో ఆత్మస్థైర్యం నింపేందుకు కలిసి ముచ్చటించింది.ఈ బృందంలో మంత్రి వాకిటి శ్రీహరితో పాటు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ప్రతినిధి జితేందర్ రెడ్డి, స్పోర్ట్స్ అథారిటీ మాజీ చైర్మన్ శివసేన రెడ్డి, విసి ఎండి సోనీ బాలాదేవి ఉన్నారు. ఆసియా క్రీడల్లో సెపక్ తక్రా విభాగంలో భారత్ కాంస్య పతకం సాధించడంతో భారత జట్టుకు మంత్రి వాకిటి శ్రీహరి, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ప్రతినిధి జితేందర్ రెడ్డి, తెలంగాణ సెపక్ తక్రా అసోసియేషన్ అధ్యక్షుడు పెరిక సురేష్ అభినందనలు తెలిపారు. “భారత్ మాత కీ జై.. జై భీమ్” నినాదాలతో భారత క్రీడాకారులను అభినందిస్తూ ప్రతినిధి బృందం వారిలో ఉత్సాహాన్ని నింపింది. అంతర్జాతీయ క్రీడా వేదికపై భారత జట్టు పతకం సాధించడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. మంత్రి వాకిటి శ్రీహరి మాట్లాడుతూ క్రీడాకారుల కృషి, పట్టుదల యువతకు స్ఫూర్తిదాయకమని పేర్కొంటూ, భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించి దేశానికి కీర్తి ప్రతిష్ఠలు తీసుకురావాలని ఆకాంక్షిం చారు. తెలంగాణలో క్రీడారంగ అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి పెట్టిందని చెప్పారు. తెలంగాణలో క్రీడారంగాన్ని మరింత అభివృద్ధి చేయడం, యువ క్రీడాకారులకు మెరుగైన శిక్షణ సదుపాయాలు కల్పించడం, అంతర్జాతీయ స్థాయిలో రాణించేలా ప్రతిభావంతులైన క్రీడాకారులను ప్రోత్సహించడం లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోందనీ తెలిపారు.ఆసియా క్రీడల పర్యటన ద్వారా అంతర్జాతీయ స్థాయి క్రీడా పోటీలు, క్రీడాకారుల ప్రదర్శనలు, క్రీడా నిర్వహణకు సంబంధించిన అంశాలను ప్రత్యక్షంగా పరిశీలించే అవకాశం తెలంగాణ ప్రభుత్వ ప్రతినిధి బృందానికి లభించిందనీ అన్నారు. ఈ అనుభవాలు రాష్ట్రంలో క్రీడారంగ అభివృద్ధికి దోహదపడ తాయని మంత్రి ఆశాభావం వ్యక్తం చేశారు.

## పోక్సో కేసులో మదర్సా టీచర్‌కు జీవిత ఖైదు

### రంగారెడ్డి జిల్లా కోర్టు సంచలన తీర్పు

**హైదరాబాద్, అక్టోబరు 2, ప్రభాతవార్త:** నగర శివార్లలోని పహాడిషరీఫ్ పరిధిలో మదర్సాలో చదువుతున్న 13 ఏళ్ల బాలుడిపై లైంగికదాడికి పాల్పడిన కేసులో అక్కడి ఉపాధ్యాయుడుకి రంగారెడ్డి జిల్లా కోర్టు ఫోక్సో కేసులో జీవిత ఖైదు శిక్షతో పాటు 25 వేల రూపాయల జరిమానా విధించింది. పహాడిషరీఫ్ పరిధిలో గల మామిడిపల్లిలో వున్న ఇస్లామియా కాపీఫుల్ ఉలూం అనే మదర్సాలో ఉపాధ్యాయుడుగా పనిచేసిన మ హమ్మద్ హాఫీజ్ మునావర్ హుస్సేన్ (32) తన వద్ద విద్యా బుద్ధులు నేర్చుకుంటున్న 13 ఏళ్ల బాలుడిపై 2024 డిసెంబరు 26వ తేదీన అస హజంగా లైంగిక దాడికి పాల్పడి ఈ విషయం ఎవరికైనా చెబితే చంపుతానని బెదిరించాడు. దీంతో ఆ బాలుడు భయపడి అనారోగ్యం పాల య్యాడు. దీని తరువాత బాలుడి తల్లిదండ్రులు తమ పిల్లాడిని ఇంటికి తీసుకుపోయి వైద్యుడికి చూపగా అసలు విషయం వెలుగు చూసింది. దీంతో బాలుడి తల్లిదండ్రులు 2025 జనవరి ఒకటవ తేదీన కామపిశాచిగా మారిన ఉపాధ్యాయుడిపై పహాడిషరీఫ్ పోలీసులకు ఫిర్యాదు చేశా రు. ఈ పిర్యాదు మేరకు నిందితుడిపై పోలీసులు ఫోక్సో కేసు నమోదు చేసి జైలుకు తరలించారు. అనంతరం ఈ కేసుకు సంబంధించి రంగా రెడ్డి జిల్లా కోర్టులో ఛార్జిషీట్ దాఖలు చేశారు. ఈ కేసుకు సంబంధించిన విచారణ 20 నెలల పాటు సాగింది. దీనిపై గురువారం నాడు జిల్లా కోర్టు తీర్పు వెలువరిస్తూ నిందితుడు మునావర్ హుస్సేన్‌కు జీవిత ఖైదు శిక్షతో పాటు 25 వేల రూపాయల జరి మానా విధించింది.

## కాంగ్రెస్ పోరాటంతో ఇంటింటికి బిఎల్‌ఓల సందర్శన

### - గ్రాడ్యుయేట్ ఎలక్షన్‌లో ఓటరు కొత్తగా ఎన్‌రోల్ చేసుకోవాల్సిందే :పరిగి ఎమ్మెల్యే డాక్టర్ టి. రామ్మోహన్ రెడ్డి

**హైదరాబాద్, అక్టోబరు 2,ప్రభాతవార్త:** కాంగ్రెస్ పోరాటంతోనే ఇంటింటికి బిఎల్‌ఓలు సందర్శించే ఏర్పాటు చేస్తూ ఎన్నికల సంఘం ఆదేశాలు ఇచ్చిందని ఇప్పుడు ప్రతి అర్హుడైన వయోజనుల ఓటు జాబితాలో పొందుపరిచేలా కాంగ్రెస్ కార్యకర్తలు పూనుకోవాని పరిగి ఎమ్మెల్యే డాక్టర్ టి.రామోహ్మన్‌రెడ్డి కోరారు. శుక్రవారం సీఎల్పీ మీడియా సెంటర్‌లో విలేఖరులతో మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలోనే 92 లక్షలకు పైగా ఓటర్లకు ఎన్నికల సంఘం నోటీసుల జారీ చేయగా,ఇప్పటికే 85 లక్షల మందికి నోటీసులు అందాయి మరో 5 లక్షలకు పైగా ఓటర్లకు ఇంకా నోటీసులు అందాల్సి ఉంటుందనీ చెప్పారు. ఎస్ఐఆర్ ప్రక్రియలో కాంగ్రెస్ నాయకులంతా పాల్గొనాలనీ,ఫారం 6ను సమర్పించడానికి అక్టోబర్ 7 చివరి తేదీ అని ఆయన గుర్తుచేశారు. ఫారం 7 ద్వారా డిలీషన్‌కు దరఖాస్తు చేసు కోవడానికి, ఫారం 8 ద్వారా మార్పులు, చేర్పు లకు దరఖాస్తు చేసుకోవడానికి ఉద్దేశించిందని దానిపై అవగాహన పెంచుకోవాలని కోరారు. కాంగ్రెస్ పార్టీ పోరాటం వల్ల బిఎల్‌ఓలు ఓటర్ల ఇంటికి వెళ్లేలా ఇసి చర్యలు తీసుకుందనీ అన్నా రు. బిఎల్‌ఓకు తగిన డాక్యుమెంట్లు ఇవ్వాలనీ 2.60 కోట్ల మంది ఓటర్ల నుంచి ఎన్యు మరేషన్ ఫారాలు తీసుకున్నారనీ తెలిపారు.60 లక్షల మంది ఓటర్ల పేర్లు తప్పుగా నమోదయ్యా యనీ ఆవేదన చెందారు.ఎస్ఐఆర్ ప్రక్రియపై బిఎల్‌ఎలు అప్రమత్తంగా ఉండాలనీ కోరారు. నోటీసులు జారీ అయిన ఓటర్లను సంప్రదించి, డాక్యుమెంట్లు అందించేలా చూడాలనీ ఆయన సూచించారు. అక్టోబర్ 17లోపు డాక్యుమెంట్లు అందించేలా బిఎల్‌ఏలు చర్యలు తీసుకోవాలనీ కోరారు.ఎమ్మెల్సీ ఎన్నికల కోసం ఓటర్ల ఎన్‌రోల్‌మెంట్‌కు

పార్టీ సిద్ధం కావాలనీ గతంలో ఎమ్మెల్సీ ఎన్నికల కోసం ఓటర్లుగా నమోదు చేసు కున్నవారు కూడా మళ్లీ ఎన్‌రోల్ చేసుకోవాల్సి ఉంటుందనీ తెలిపారు.

## ఒబిసి సభతో మోడీకి వణుకు పుట్టిస్తాం : ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య

### మోడీ మెడలు వంచేలా బిసి గర్జన సభలు షురూ

#### టిపిసిసి ఒబిసి సెల్ చైర్మన్ వీర్లపల్లి శంకరయ్య

**హైదరాబాద్,అక్టోబర్ 2,ప్రభాతవార్త:** మోడీకి వణుకు పుట్టేవిధంగా శంషాబాద్ గొల్లపల్లి వద్ద పెద్ద ఎత్తున సభను ఏర్పాటు చేస్తామని ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య తెలిపారు. గాంధీభవన్‌లో శుక్రవారం విలేఖరులతో మాట్లాడుతూ ఉద్యోగ,ఉపాధి లో ఒబిసి లకు వాటా దక్కాలంటే కేంద్రం కులగణ లో ఒబిసి చేర్చాలనీ డిమాండ్ చేశారు. బిసి అని చెప్పుకునే మోడీ బిసిలను ను అనగదొక్కుతుండు అని ఆరోపించారు. దేశంలో కులగణ చేసిన ఏకైక నాయకుడు రేవంత్ రెడ్డి అని కీర్తించారు. ఒబిసి రిజర్వేషన్ కోటా పెంచే చట్టాన్ని చేసికేంద్రం ఒబిసి లకు ప్రత్యేక బడ్జెట్ ప్రత్యేక శాఖ పెట్టాలనీ డిమాండ్ చేశారు. జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే నవీన్ యాదవ్ మాట్లాడతూ కేంద్రం కులగణనలో బిసిల కాలం చేర్చలేదనీఆవేన చెదారు.దేశంలో ఒబిసిలను కులగణన లో చేర్చకపోవడం తో అగమ్యగోచరంగా మారిందనీ అన్నారు. టిపిసిసి ఒబిసి సెల్ చైర్మన్ వీర్లపల్లి శంకరయ్య మాట్లాడతూ బిసిలు దేశ వ్యాప్తంగా తమ హక్కులు కోల్పోతున్నారనీ మోడీ వెనుకబడిన కులాల జీవితాలతో చెలగాటం అడుతున్నారని ఆరోపించారు. బిసి అని చెప్పుకొనే మోడీ బిసిలను అనగదొక్కుతుండు అని విమర్శించారు. జాతీయ జనాగణ లో బిసి కులగణ న చేయాలనీ బిసిలకు మంత్రిత్వ శాఖ ను కేటాయించాలనే మా డిమాండ్‌కు స్పందించని బిజెపి మొండి వైఖరికి నిరసన గా శంషాబాద్ దగ్గర కొల్లూరు లో ఒబిసి సభ ఈనెల 4వ తేదీ న రంగారెడ్డి జిల్లాలో జరుపుతామనీ తెలిపారు. 25వేల మంది తో సభ ఆదివారం నిర్వహిస్తామన్నారు.

## ప్రజాస్వామ్యానికి ‘సర్’తో పెనుముప్పు

### తెలంగాణ జన సమితి అధ్యక్షుడు కోదండరాం మౌనదీక్ష



గాంధీజయంతి సందర్భంగా తెలంగాణ జన సమితి ఆధ్వర్యంలో నాంపల్లిలోని పార్టీ రాష్ట్ర కార్యాలయంలో శాసనమండలి సభ్యుడు టిజెఎస్ కోదండరాం మౌనదీక్ష జరిపిన దృశ్యం

**హైదరాబాద్,అక్టోబరు2,ప్రభాతవార్త:** ప్రజాస్వామ్య మనుగడకు “సర్”తో పెనుముప్పు ఏర్పడబోతుందని తెలంగాణ జన సమితి అధ్యక్షుడు ఎమ్మెల్సీ ప్రొఫెసర్ ఎం. కోదండరాంరెడ్డి ఆరోపించారు. టిజెఎస్‌పార్టీ ప్రధాన కార్యాలయంలో ఎమ్మెల్సీ ప్రొఫెసర్ ఎం. కోదండరాంరెడ్డి శుక్రవారం మౌనదీక్ష చేశారు. ఎన్నికల సంఘం అవలంబిస్తున్న కొన్ని విధానాలు, నిబంధనలను నిరసిస్తూ కోదండరామ్ మౌనదీక్షకు దిగారు. కంచే చేను మేసినట్టు ఎన్నికల కమిషన్ వ్యవహరిస్తోందని టిజెఎస్ అధ్యక్షుడు ప్రొఫెసర్ కోదండరామ్‌రెడ్డి విమర్శంచారు. ఎన్నికల కమీషన్ అక్రమవిధానాలతో అవకతవకలకు పాల్పడుతున్న “సర్” ప్రక్రియను ఆపేయాలని ఆయన డిమాండ్ చేశారు.రాజ్యాంగం ఎన్నికల సంఘానికి స్వతంత్ర్య ప్రతిపత్తి కల్పించిందని కానీ కమిషన్ మాత్రం అధికారంలో ఉన్నవారు చెప్పినట్టు చేస్తోందని ఆరోపించారు. ఎన్నికల కమీషన్ సమావేశాలు నిర్వహించకుండా, రాజ్యాంగ విరుద్ధంగా ఏకపక్ష నిర్ణయాలు తీసుకుంటోందని రెడ్డి మండిపడ్డారు. ఇలా చేస్తే ప్రజాస్వామ్య విలువలు దెబ్బతింటాయనీ ఆవేదన చెందారు. ఓటు హక్కు ద్వారానే పౌరుల హక్కులను కాపాడగలమని ఆయన ఆశాభావం వ్యక్తంచేశారు.

ప్రజాస్వామ్యంకు ఆయువుపట్టు వంటిదైన ఓటుహక్కును ఎన్నికల కమిషన్ ఇష్టానుసారంగా తొలగిస్తోందని విమర్శించారు. అవకతవకలతో జరుగుతున్న సర్ ప్రక్రియపై నమ్మకంలేదని ఆయన చెప్పారు.సుప్రీంకోర్టు మార్గదర్శకాలతో పని విధానం ఉండాలన్నారు. ప్రజల హక్కులకు భంగం కలిగితే రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలు చేస్తామని ఆయన హెచ్చరించారు.

## సహనంతో కూడిన ప్రజాస్వామిక పోరాటాల ద్వారా సామాజిక మార్పు సాధించడమే గాంధీజీ ఆశయం : కెసిఆర్

**హైదరాబాద్,అక్టోబరు2,ప్రభాతవార్త:** మహాత్మా గాంధీ అనుసరించిన ప్రజాస్వామిక శాంతియుత పోరాట కార్యాచరణ తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమంలో తనకు స్ఫూర్తిగా నిలిచిందని బిఆర్ఎస్ అధినేత,మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ తెలిపారు. ప్రజాస్వామిక హక్కుల సాధనకోసం గాంధీజీ అనుసరించిన సత్యాగ్రహ పంథా నేటి యువతరానికీ ఆచరణీ యమన్నారు. గాంధీ జయంతి సందర్భంగా దేశ స్వాతంత్రం కోసం వారి త్యాగనిరతని స్మరించు కుంటూ ఆ మహనీయునికి ఘన నివాళులు అర్పించారు. న్యాయమైన ప్రజల ఆకాంక్షల కోసం, నిరంకుశ ప్రభుత్వాల మీద పోరాడే నాయకత్వం, విశాల దృక్పథంతో తమ పోరాట కార్యాచరణను రూపొందించుకోవాలనే తాత్వి కతను గాంధీజీ జీవితం నుంచి నేర్చుకోవాల్సి వున్నదన్నారు.పీడితులందరినీ సమన్వయం చేసుకుంటూ, భావజాల వ్యాప్తిని చేస్తూ, శాంతియుత పోరాటంలో భిన్న వర్గాలను ఐక్యసంఘటన శక్తిగా తీర్చిదిద్దుకోవాలనే గాంధీజీ ఆశయాలను ప్రతీవొక్కరు అనుసరించాలన్నారు. తెలంగాణ సాధన కోసం తాను వొంటరిగా ముందడుగు వేసిన నాటినుంచి నేటి వరకు ఎన్ని కష్టాలొచ్చినా తాను స్థిత ప్రజ్ఞతతో అనుసరిస్తున్న కార్యాచరణలో గాంధీజీ స్పూర్తి ఇమిడి వున్నదని కేసీఆర్ స్పష్టం చేశారు. విద్వేష పూరిత ప్రసంగాలను, కక్షపూరిత వైఖరులను విడనాడి, ప్రజల నడుమ శాంతి సౌభ్రాతృత్వం పరిఢవిల్లేలా పాలనను కొనసాగించడం ద్వారా మాత్రమే జాతిపిత మహాత్మాగాంధీకి మనం నిజమైన నివాళులు అర్పించిన వారమోతామని కేసీఆర్ పునరుద్ఘాటించారు.

## ఫారం7ను దుర్వినియోగంచేస్తున్నారంటూ కర్ణాటక సిఎం, మంత్రుల ఆందోళన

### - పెద్దసంఖ్యలో ఓట్ల తొలగింపులకు ఫారమ్ 7 దుర్వినియోగం

### - సిఇఒ కార్యాలయం ముందు సిఎం డికె, మంత్రులు, ఎమ్మెల్యేల ధర్నా

**బెంగళూరు, అక్టోబరు 2:** ఓటర్ల జాబితా నుంచి ఓటర్లను తొలగించాలని కోరుతూ ఫారం7 దరఖాస్తులను పెద్ద సంఖ్యలో దాఖలు చేశారన్న ఆరోపణలపై కర్ణాటక సీఎం డీకే శివకుమార్ ఆందోళన వ్యక్తం చేశారు. మంత్రులతో కలిసి ఈసీ కార్యాలయం వద్ద ధర్నా చేశారు. ఫారం 7 దుర్వినియోగంపై దర్యాప్తు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. బెంగళూరు: ఓటర్ల జాబితా నుంచి ఓటర్లను తొలగించాలని కోరుతూ ఫారం7 దరఖాస్తులను పెద్ద సంఖ్యలో దాఖలు చేశారన్న ఆరోపణలపై కర్ణాటక సీఎం డీకే శివకుమార్ ఆందోళన వ్యక్తం చేశారు. మంత్రులతో కలిసి ఈసీ కార్యాలయం వద్ద ధర్నా చేశారు. ఫారం 7 దుర్వినియోగంపై దర్యాప్తు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ముందుగా నిర్ణయించిన మంత్రివర్గ సమావేశాన్ని సీఎం డీకే శివకుమార్ వాయిదా వేశారు. మంత్రులు, అధికార కాంగ్రెస్ ఎమ్మెల్యేలతో కలిసి ఆ రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి (సీఈవో) కార్యాలయానికి వెళ్లారు. అర్హులైన ఓటర్ల పేర్లను తొలగించడానికి ఫారం 7 దరఖాస్తులను పెద్ద సంఖ్యలో దాఖలు చేస్తున్నట్లు వస్తున్న ఆరోపణలపై ధర్నా చేశారు. ఫారం 7 దుర్వినియోగంపై దర్యాప్తు చేయాలని, తప్పుడు వాంగ్మూలాలు ఇచ్చిన దరఖాస్తుదారులపై చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఓటరు జాబితాల ప్రత్యేక సవరణ ప్రక్రియ (సర్)లో భాగంగా క్లెయిమ్‌లు, అభ్యంతరాల గడువు ముగిసే చివరి రోజుల్లో, ముఖ్యంగా సెప్టెంబర్ 22 నుంచి 24 తేదీల్లో పెద్ద సంఖ్యలో ఫారం 7 అభ్యంతరాలు దాఖలైనట్లు తనకు సమాచారం అందిందని సీఎం డీకే శివకుమార్ తెలిపారు. బెళగావి నార్త్‌లో సుమారు 3,000, ముడిగెరెలో 6,259, బాబలేశ్వర్‌లో 1,373, నరసింహరాజాలో 1,200, భాల్కి నియోజకవర్గాలలో 2,285 దరఖాస్తులు దాఖలైనట్లుగా నివేదికలు వచ్చాయని చెప్పారు. ముఖ్యంగా మైనారిటీ వర్గాలు, షెడ్యూల్డ్ కులాలు, షెడ్యూల్డ్ తెగలు, ఇతర వెనుకబడిన తరగతులకు చెందిన అర్హులైన ఓటర్ల తొలగింపు కోసం ఆయా వర్గాలను లక్ష్యంగా చేసుకునేందుకు బీజేపీ, జేడీ(ఎస్) కుట్ర పన్నాయని ఆయన ఆరోపించారు. మరోవైపు ఫారం7 దుర్వినియోగాన్ని ఎన్నికల మోసంగా సీఎం డీకే శివకుమార్ ఆరోపించారు. దీనిపై నిష్పాక్షిక, కాలపరిమితితో కూడిన విచారణ జరపాలని



కోరుతూ రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి (సీఈవో)అన్బుకుమార్‌కు ఒక వినతిపత్రాన్ని ఆయన అందజేశారు. ప్రతి అర్హతగల ఓటరు హక్కులను పరిరక్షించడం, పునఃసమీక్ష ప్రక్రియ స్వేచ్ఛగా, నిష్పక్షపాతంగా, పారదర్శకంగా, చట్టబద్ధంగా జరిగేలా చూడటం ముఖ్యమంత్రిగా తన విధి అని ఆ లేఖలో పేర్కొన్నారు. తప్పుడు ప్రకటనలు లేదా వాంగ్మూలాలు ఇచ్చినట్లు తేలిన దరఖాస్తుదారులపై చర్యలు ప్రారంభించాలని ఎన్నికల అధికారులను ఆదేశించారు. దీంతో మంత్రులు, ఎమ్మెల్యేలతో కలిసి సుమారు ఐదు గంటల పాటు సీఈవో కార్యాలయం వద్ద చేపట్టిన ధర్నాను సీఎం డీకే శివకుమార్ ముగించారు.

## ఆందోళనకరంగా భూగర్భ జలాలు

### ఈ నెలలో 6 మీటర్లకు పడిపోయే ప్రమాదం

**హైదరాబాద్, అక్టోబరు 2, ప్రభాతవార్త** రాబోయే నెలల్లో తెలంగాణ నీటి లభ్యత విషయంలో ఆందోళన నెలకొంది. రాష్ట్రంలో భూగర్భ జలమట్టాలు భారీగా పడిపోయే అవకాశం ఉండటంతో, ఇప్పటికే రాష్ట్రంలోని జలాశయాలలో తక్కువగా ఉన్న ఉపరితల నీటి నిల్వలపై మరింత నీటి ఒత్తిడి పెరుగుతుంది. ఇటీవల ముగిసిన నైరుతి రుతుపవన కాలం రాష్ట్రంలో నికరంగా 17 శాతం వర్షపాత లోటును మిగిల్చింది. ఇదే పరిస్థితి కనీసం ఈ ఏడాది చివరి వరకు కొనసాగుతుందని భారత వాతావరణ శాఖ అంచనా వేస్తుండటంతో, ఖరీఫ్ పంటల సాగు తోపాటు, తాగునీటికి సంబంధించి భూగర్భ జలాలకు మరింత డిమాండ్ పెరిగే అవకాశం ఉందని భూగర్భ జల వనరుల శాఖ వెల్లడిస్తోంది. దానికి తోడు మరింత వర్షపాతం లోటు ఏర్పడటంతో తెలంగాణలోని భూగర్భ జల నిల్వలపై తీవ్రమైన ఒత్తిడి పడుతుందని అధికారులు భావిస్తున్నారు. ఈ నెలలో తెలంగాణలో 30 శాతం వరకు వర్షపాతం లోటు ఉండవచ్చనే అంచనాలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో పంటల సరళి, స్థానిక భూగర్భ పరిస్థితుల ఆధారంగా, రాష్ట్రంలోని వివిధ జిల్లాల్లో సెప్టెంబర్ నెలాఖరు నాటి స్థాయిల నుంచి భూగర్భ జలమట్టాలు ఏకంగా ఆరు మీటర్ల మేర పడిపోవచ్చున్నారు.

## అమ్రావతిలో దుర్గామాత విగ్రహం ఉన్న టెంపోకు ప్రమాదం

### ఏడుగురు మృతి, 18 మందికిపైగా గాయాలు

**అమ్రావతి, అక్టోబరు 2:** మహారాష్ట్రలోని అమరావతి జిల్లాలో శుక్రవారం తెల్లవారుజామున ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. దుర్గామాత విగ్రహంతో వెళ్తున్న భక్తుల టెంపోను వెనుక నుంచి వేగంగా వచ్చిన ఒక ట్రక్కు ఢీకొట్టింది. ఈ దుర్ఘటనలో ఏడుగురు అక్కడికక్కడే మరణించగా, 18 మందికి పైగా గాయపడ్డారు. షేగావ్ నుంచి వార్ధాకు దుర్గాదేవి విగ్రహాన్ని తరలించేందుకు భక్తులు ఒక టెంపో పికప్‌లో ప్రయాణిస్తున్నారు. సమృద్ధి హైవేపై ధమన్‌గావ్ రైల్వే సమీపంలోని ఛానల్ 97 వద్దకు రాగానే ఈ ప్రమాదం జరిగింది. టెంపోకు వెనుక ట్రాలీ అమర్చి ఉండటం, వాహనం నెమ్మదిగా వెళ్తుండటంతో.. వెనుక నుంచి వేగంగా వచ్చిన ట్రక్కు డ్రైవర్ అదుపుతప్పి ఢీకొట్టాడు. ప్రమాద తీవ్రతకు టెంపో వెనుక భాగం, ట్రాలీ పూర్తిగా నుజ్జునుజ్జయ్యాయి. సమాచారం అందుకున్న వెంటనే పోలీసులు, సహాయక బృందాలు ఘటనా స్థలానికి చేరుకున్నాయి. క్షతగాత్రులను వెంటనే వార్ధాలోని ఆసుపత్రులకు తరలించారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. గాయపడిన వారిలో 12 మందికి తీవ్ర గాయాలు కాగా, ఆరుగురికి స్వల్ప గాయాలైనట్లు తెలుస్తోంది. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి, ప్రమాదానికి కారణమైన ట్రక్కు డ్రైవర్‌ను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. ప్రమాదానికి గల కచ్చితమైన కారణాలపై దర్యాప్తు కొనసాగుతోంది.

## మిలటరీ ఆయుధాల చోరీ కేసులో సంచలన విషయాలు

### ఆయుధాలు చోరీ చేశాక వాటిని అమ్మేందుకు ఆయుధ డీలర్లలో మల్లేష్ మంతనాలు

### గతంలో పనిచేసిన ప్రాంతాలలో ఆయుధాల లెక్కలు తేలుస్తున్న మిలటరీ అధికారులు

**హైదరాబాద్, అక్టోబరు 2, ప్రభాతవార్త:** దేశ వ్యాప్తంగా సంచలనం రేపిన బొల్లారంలోని మిలటరీ కేంద్రంలో ఆయుధాలు, మందుగుండు సా మాగ్రి చోరీ కేసులో సంచలన విషయాలు వెలుగు చూస్తున్నాయి. గత ఆగస్టు నెల 30వ తేదీ రాత్రి ఈ చోరీ జరగడం తెలిసిందే. ఈ చోరీ తా లూకు నిందితుడు ఇదే రిజిమెంట్‌లో పనిచేసిన మాజీ సైనికుడు, బలవంతంగా పదవీ విరమణ పొందన హవల్దార్ మల్లేష్ అలియాస్ రాజుగా తేలడం తెలిసిందే. పక్కా వ్యూహంతో ఉన్నతాధికారులపై కక్షగట్టిన మల్లేష్ ఈ నేరానికి పాల్పడినట్లు పోలీసులు తేల్చగా ఈ కేసులో మరిన్ని వి షయాలను నిగ్గు తేల్చేందుకు పది రోజుల పాటు కస్టడీలోకి తీసుకుని విచారించగా అశ్చర్యకరమైన విషయాలు వెలుగు చూశాయి. తనను బల వంతంగా పదవీ విరమణ చేయించినందుకు రెండు నెలల ముందుగానే ఈ చోరీకి ఇతను స్కెచ్ వేసినట్లు అంగీకరించిన మల్లేష్ ఇందులో భాగ ంగా ఆయుధగారం వద్ద పనిచేసిన వినోద్, శేషుల సహకారంతో ఆయుధాలను దొంగిలించినట్లు తెలిపాడు. ఉన్నతాధికారులపై కక్షతో ఆయుధా లను దొంగిలించిన తరువాత వాటిని ఆయుధ డీలర్లకు దొంగచాటుగా విక్రయించేందుకు ప్రయత్నించినట్లు మల్లేష్ చెప్పడం పోలీసులను షాక్‌కు గురిచేసింది. మల్లేష్ దొంగిలించిన ఎకె 47, ఇన్సాస్ వంటి ఆయుధాలు ఆయుధ డీలర్ల వద్ద లభించవు. ఇవి కేవలం పోలీసు, రక్షణ బలగాల వద్ద మాత్రమే వుండడంతో ఎవరైనా కొనుగోలు చేస్తారేమోనని తాను ప్రయత్నించానని అతను తెలిపాడు. ఇందుకోసం వెబ్‌సైట్లలో సమాచారం కోసం ప్రయత్నించానని, అయితే ఆశించిన విధంగా ఏదీ దొరకలేదని మల్లేష్ తెలిపాడు. మొదట ఆయుధాలను ఏం చేయాలనే దానిపై తనకు స్పష్టత లేకున్నా ఆ తరువాత వీటిని దొంగచాటుగా ఎవరికైనా అమ్మాలని చూశానని అతను తెలిపాడు. ఎకె 47, ఇన్సాస్ తుపాకులను వదిలి పిస్టోళ్లను విక్రయించడం సులభం.

CHURCH OF SOUTH INDIA - MEDAK DIOCESE
CSI INSTITUTE OF TECHNOLOGY
School of Architecture & Planning
(Approved by Council of Architecture, New Delhi.)
(Affiliated to Jawaharlal Nehru Architecture & Fine Arts University - Hyderabad)
145 McIntyre Road, Sec'bad-03, TS - India.
e-mail : csiit.ts02@gmail.com
Ph.:040-27817548
9849508489, 9440540988
M.Arch. (ID&CM)
Spot Admissions- Under 'A' Category
on 08-10-2026 (at 11.00 am)
For Vacancy Position and Spot Admission Guidelines, visit https://pgecetadm.tgche.ac.in or Contact: CSIIT
PRINCIPAL / MANAGER

వార్త

చెడు నుంచి మంచికైనా సరే అసౌకర్యం కలిగించకుండా మార్పు సాధ్యం కాదు.

- రిచర్డ్ హూకర్

# 'కొసరు' తంత్రం!

దేశం సుభిక్షంగా ఉండాలంటే అన్నదాత సంతృప్తిగా ఊపిరి పీల్చుకోవాలి. తాము ఆరుగాలం శ్రమపడిన కష్టానికి ప్రతిఫలం దక్కాలని మాత్రమే రైతు కోరుకుంటాడు. అందుకోసం ప్రభుత్వాలు చేయని ప్రయత్నమంటూ ఏదీలేదు. ఎప్పటిలానే కేంద్ర ప్రభుత్వం వ్యవసాయ ఉత్పత్తులకు మద్దతు ధర ప్రకటించింది. ఎల్‌నినో ప్రభావంతో తీవ్ర వర్షాభావ పరిస్థితులు చుట్టుముట్టిన తరుణంలో ప్రభుత్వాలిచ్చే భరోసా కోసం ఎదురు చూడడం రైతుకు తప్పనిసరి అయింది. 2027-2028 రబీ పంటల మార్కెటింగ్ కోసం కేంద్ర ప్రభుత్వం కనీస మద్దతు ధరలను పెంచింది. సాంప్రదాయ గొలుసుకట్టు పంటల నుండి ప్రత్యామ్నాయ పంటల వైపు రైతు దృష్టి సారించేందుకు వీలుగా ప్రభుత్వం ఈసారి మద్దతుధరల పెంపు ప్రణాళికను సిద్ధం చేసింది. మన దేశంలో ఒక్క వరి, గోధుమలకు మాత్రమే సరైన సేకరణ యంత్రాంగం నిర్విఘ్నంగా ఉత్పత్తులు సేకరించగలుగుతోంది. దాదాపు మిగిలిన అన్ని రకాల సాగు ఉత్పత్తులకు సరైన మార్కెటింగ్ సదుపాయం లేదు. తమ సాగుఉత్పత్తులు అమ్ముకునేందుకు రైతు నానా తంటాలు పడుతున్నాడు. తృణ ధాన్యాల మార్కెటింగ్‌కైతే మరీ ఇబ్బంది. వాటికి కూడా సరైన మార్కెటింగ్ వ్యవస్థను ఏర్పాటు చేసుకోవాలి. ఈ అంశాల రీత్యా మద్దతు ధర ప్రకటనలో ప్రభుత్వం పలు జాగ్రత్తలను తీసుకుంది. 2027-28 రబీ మార్కెటింగ్ సీజన్ కోసం ఆరు పంటలకు మద్దతు ధర పెంచింది. గోధుమను గత క్వింటాల్‌కి రూ. 2585 ఉండగాఈసారి 25 రూపాయలు పెంచి 2610కి పెంచింది. బార్లీగింజల సాగు ఉత్పత్తులకు గతంలో రూ. 2150 ఉండగా రూ. 2286కి పెంచింది. శెనగలు రూ.5875 నుండి5958కి పెంచింది. ఎర్ర కందులు రూ. 7వేల రూపాయలనుండి రూ. 7390కి పెంచింది. కుసుమ పంటకు అత్యధిక విస్తీర్ణంలో వేయించాలనే ప్రయత్నాన్ని ముమ్మరం చేసింది. అందులో భాగంగానే కుసుమకు 6540నుండి అత్యధిక పెంపు రూ. 675తో కలిపి రూ. 7215 చేసింది. ఆవాలు క్వింటాల్ ఒకటికి రూ. 413 పెంచడంతో రూ. 6200 నుండి రూ. 6613కి చేరుకుంది. మొత్తం 324 లక్షల టన్నుల మేరకు రబీ సేకరణకు అన్ని వనరులూ కొనసాగిస్తూనే రైతు ఎల్‌నినో ప్రభావిత నష్టాలకు గురవకుండా 90,962 కోట్ల రూపాయలకు వ్యయ ప్రణాళికకు సిద్ధం చేసింది. గోధుమసాగును బాగా ప్రోత్సహించేందుకు వీలుగా ఉత్పత్తి వ్యయం రూ. 1264 కాగా ఉత్పత్తికి లభించే ధరను రెట్టింపు చేసినట్లు పేర్కొంది. దేశంలో నూనెగింజలు, అపరాల దిగుమతులకు ఉద్దేశంతోనే పలు నిర్ణయాలు తీసుకుంది. ఉత్పత్తి వ్యయం, వాతావరణ క్లిష్ట పరిస్థితులు ప్రపంచ మార్కెట్ ధోరణులను దృష్టిలో ఉంచుకుని నిర్ణయాలు తీసుకుంటోంది. తెలంగాణలో రబీలో శనగ, ఆవాలు పండించే రైతుల ప్రోత్సాహానికి ఇదొక వ్యూహంగా భావించాలి. గోధుమకు సరైన ప్రోత్సాహం ఇవ్వాలనుకుంటే అతి తక్కువగా ధర పెంచింది. దేశ ఆహార భద్రతకు వెన్నెముకగా భావిస్తున్న గోధుమకు పెంపు సరైన ప్రోత్సాహంగా పరిణమించదు. ఎరువులు,డీజిల్ కూలీల ఖర్చు 10శాతం వరకు పెరిగిన సందర్భంలో అందుకు తగినట్లుగా మద్దతు ధర పెంచినట్లుగా లేదు. ఈ యేడాది రబీలో 121 మిలియన్ టన్నుల గోధుమ ఉత్పత్తి సాధించాలంటే మరిన్ని ప్రోత్సహకాలు ఇవ్వడం అవసరం. నిజానికి కనీస మద్దతు ధర ప్రకటించినా దానిని గిట్టుబాటు ధరకు అమ్ముకోలేకపోతున్నాడు. మధ్యలో దళారీలు లాలూచీ కారణంగా రైతుకి సరైన ధర అందడం లేదు. రైతును పంటల వైవిధ్యీకరణలో భాగస్వామిని చేసి సాగురాబడులను పెంచాలన్న సదుద్దేశ్యంతోనే చేపడుతున్న మద్దతుధరలన్నీ అతి తక్కువగానే ఉన్నాయి. కనీస మద్దతుధరకు ఆయామార్కెట్లలో రైతు నుండి ఉత్పత్తుల విక్రయం జరుగుతోందా లేదా అనే పర్యవేక్షణ బహు తక్కువ దాంతో రైతు పండించిన ఉత్పత్తులకు అయినకాడికి అమ్మేసుకోవాల్సి వస్తోంది. మిల్లర్లకు తదితర మార్కెటింగ్ ఏజెన్సీలకు పంట ఉత్పత్తులను అందుకునే సమయంలో వాతావరణ పరిస్థితులను తట్టుకోలేక, తమ ఉత్పత్తులను అప్పటికప్పుడులభించే ధరఎంత తక్కువైనా అమ్మేసుకోవాల్సి వస్తోంది.ఎన్నిసార్లు మద్దతు ధరలు ప్రకటించినా అసలు ధరకు'కొసరు' ధరగా ఉంటోందే తప్ప రైతు ఆదాయ వ్యయాలను పట్టికను చూసి లాభదాయకంగా ఉండే పరిస్థితులు కానరావడం లేదు. సాగు ఎలాంటి పరిస్థితుల్లో జరిగినా పెరిగిన డీజిల్, ఎరువులు,కూలీల వ్యయం క్రిమిసంహారకమందుల ధరలతో పోలిస్తే పెంపుచేసిన ధరలు ఏమూలకీరావు. కనీస మద్దతు ధర లభించక దళారులను ఆశ్రయించి నష్టపోతున్నారు. సాగు వ్యయాన్ని బట్టిచూస్తే ఈపెంపు ఉత్పత్తి వ్యయంపై 50 శాతం లాభం ఉండాలన్నస్వామినాథన్ కమిషన్ సిఫార్సులను ఏమాత్రం ప్రభుత్వం చిత్తగించినట్లు కనపడదు. పెరిగిన నిత్యావసరాలను దృష్టిలో ఉంచుకుని రైతు ఉత్పత్తుల నిల్వలకు శీతలగిడ్డంగులు మార్కెట్ సౌకర్యాలను పెంచగలిగితే, సకాలంలో అందుబాటులోకి వచ్చేకొనుగోలు ప్రక్రియలను అమలు చేయించడం ద్వారా రైతును కొద్దిలో కొద్దిగా గట్టెక్కించినట్లే అవుతుంది. ఇలా కేంద్రప్రభుత్వం రైతు పండించే వ్యవసాయ ఉత్పత్తులకు కనీసమద్దతు ధరలు ప్రకటించినప్పుడల్లా ఉత్పత్తి వ్యయంపై సగటున 50శాతం పెంచామనే చెప్పుకుంటోంది. ఏ రీత్యా లెక్కలు వేసుకున్నా వ్యవసాయం లాభసాటి కాదని రైతు పదే పదే గగ్గోలు పెట్టే పరిస్థితినుంచి ప్రభుత్వాలు గట్టెక్కించే స్థాయికి చేరలేదు. తృణధాన్యాలకు బదులుగా పప్పుధాన్యాలు,నూనెగింజల సాగు చేసినా ప్రభుత్వ ప్రోత్సాహకాలు అందిస్తోంది. అయినా మద్దతు ధర పెంచడం ఎప్పటికైనా అవసరమే!

మంచి పనిని మించిన పూజ లేదు, మానవతను మించిన మతం లేదు.



అంబేద్కర్

నాలుక నుండి జారిన ఒక దురదృష్టకరమైన మాటను ఆరు గుర్రాలతోనైనా వెనక్కు రాబట్టలేము.



గోల్డ్‌స్మిత్

## ప్రజావాక్కు



### సాహసానికి సలాం

విపత్కర పరిస్థితిలో తెగువ చూపి, తనతో సహా 174 మంది ప్రాణాలుకాపాడిన భారతీయ పైలట్స్మిత్ మచ్చర్ సాహసానికి ప్రపంచమంతాఅభినందనలు తెలుపుతోంది. నిన్నదుబాయ్ నుండి ఇజ్రాయెల్‌లో టెల్అవీవ్‌కు వెళ్తున్న ఫ్లైట్‌దుబాయ్ విమానాన్నిఆయన నడుపుతుండగా, సహచర పైలట్ కలబడి, దాడి చేసి ,విమానాన్ని అదుపులోకి తీసుకుని అమాంతంక్రిందికిఉరికించాడు.ఒక్క నిమిషంలో 15వేల అడుగులు క్రిందికి జారిన విమానాన్ని ఒక వైపు కత్తి పోట్లకు గురవుతూనే మచ్చర్ కాపాడడానికి ప్రయత్నించారు. తాము ప్రమాదంలో ఉన్నట్లు,హైజాక్‌కు గురయినట్లు సంబంధిత అధికారులకు అలెర్ట్ చేస్తూనే కాక్‌పిట్ తెరిచారు. అలాంటి అనూహ్య ఉత్కంఠ భరిత పరిస్థితిలో, తీవ్రంగా గాయపడిన ఆయన కాక్ పిట్ తెరవగలగడమే కీలకం. తోటి ప్రయాణీకులుగా ఉన్న ఇద్దరు ఆఫ్ డ్యూటీ పైలట్‌లు విమానం నడిపే బాధ్యత తీసుకున్నారు. సౌదీ అరేబియాలో సురక్షి తంగా ఎమర్జెన్సీ లాండింగ్ చేసి,అందరి ప్రాణాలూ కాపాడారు.అందరి మన్ననలు పొందడానికి ఆయన అన్ని విధాలా అర్హుడు.

- డా.డి. వి. జి. శంకర రావు, విజయనగరం

### అతి వినయం ధూర్త లక్షణం

అవసరానికి మించి అతిగా వంగి నమస్కరిస్తూ,వినయం ప్రదర్శించేవారిని అసలునమ్మకూడదు. వాళ్ళ నిజస్వరూపాన్ని, స్వార్థాన్ని కప్పిపుచ్చుకోవడానికి పైకి నకిలీ వినయాన్ని ప్రదర్శిస్తారు. ఎప్పుడూ తానేప్రత్యేకంగా కనిపించాలని భావిస్తారు. ఇలాంటి వారు మనకు అక్కడక్కడా కనిపిస్తూ ఉంటారు. ఎవరైనా మనపై అతిగా పొగడ్తలు కురిపించినా, విపరీతమైన మర్యాద చూపించినా, వారి పట్ల అప్రమత్తంగా ఉండాలి.పొగడ్తలు అవసరమేగానీ వాటి పైనే ఆధారపడకూడదు. వినయ విధేయతలతో మెలగాలేగానీ, అతి వినయం అసలు పనికిరాదు.

- కె. నాగేంద్ర, హైదరాబాద్

### ఖనిజాల తవ్వకం

ఒడిస్సాలోని ఒక ప్రాంతంలో ఉన్నఖనిజాలు తవ్వకూడదని సుప్రీం కోర్టు తలుపు తట్టి ఒక గ్రీన్ రిఫరెండమ్ నిర్వహించి అక్కడి 12జిల్లాలో ఆ ఖనిజాల తవ్వకం అనే నిర్ణయానికి వ్యతిరేకంగా ఓటు వేసిన చైతన్యం అక్కడి గిరిజనులది.మరి అక్కడ ఏమిఉంది అంటే 115 చదరపు కిలోమీటర్లుల్లో విస్తరించి ఉన్న బాక్సయిట్ ఖనిజం దాని ద్వారా వచ్చే అల్యూమినియం.

- భారత అవినాష్, జనగామ

### 'స్వేచ్ఛ'ను కాపాడటం ఉమ్మడి బాధ్యత

ఇటీవల బీహార్, ఢిల్లీలలో వెలుగుచూసిన లైంగిక దాడుల ఘటనలు దేశవ్యాప్తంగా తీవ్ర ఆందోళనకు దారితీశాయి. ఇటువంటి సంఘటనలు కేవలం ఒక వ్యక్తిపై జరిగిన నేరాలుగా మాత్రమే కాకుండా,సమాజం మొత్తాన్ని కుదిపివేసే విషాదాలుగా నిలుస్తాయి. లైంగిక దాడి అనేది ఒక క్షణంలో జరిగే నేరం కావచ్చు, కానీ దాని ప్రభావం బాధితురాలి మనసులో జీవితాంతం నిలిచిపోతుంది.ఎంత కఠినమైన శిక్ష విధించినా, ఎంత వేగంగా న్యాయం జరిగినా, ఆమె అనుభవించిన మానసిక వేదనను పూర్తిగా తొలగించడం సాధ్యంకాదు. ప్రతి మహిళ భయంలేకుండా జీవించే హక్కు కలిగి ఉంది. ఆమె ఎక్కడచదవాలి,ఎక్కడ పనిచేయాలి,ఎప్పుడు ప్రయాణించాలి, ఎలా జీవించాలి అనే నిర్ణయాలు ఆమె స్వేచ్ఛకు సంబంధించినవి. ఆ స్వేచ్ఛను కాపాడటం కుటుంబం, సమాజం, ప్రభుత్వం, చట్టవ్యవస్థల ఉమ్మడి బాధ్యత. మహిళలు తమ హక్కులను వినియోగిస్తున్నందుకే హింసకు గురవుతున్నారని సూచించే ఏ వాదనకూ సమాజంలో స్థానం ఉండకూడదు.

- సి. సాయిరుత్విక్, శ్రీకాకుళం

### కొండపై వాహనాల నియంత్రణ!

తిరుమలలో కార్లు, జీపులు, ప్రైవేట్ వాహనాల ఇష్టారాజ్యం కనిపిస్తోంది. భక్తుల నుంచి వారికి ఇష్టం వచ్చినట్లుగా అధిక మొత్తాలను వసూలు చేస్తున్నారు. అందినకాడికి దోచుకునే ఈ విధానాన్ని నియంత్రించాలి. కార్లు, జీపులు ఎక్కడపడితే అక్కడనిలపకుండా చూడాలి.వాహనాలను రోడ్లపై ఇష్టానుసారంగా నిలపడం వల్ల పాదచారులకు, భక్తులకు ఇబ్బందులు కలుగుతున్నాయి. టీటీడీ బస్‌స్టాప్‌లలో కేవలం టీటీడీ ఉచిత బస్సులే ఉండేలాచూడాలి.ప్రైవేట్ వాహనాలను ఎక్కడపడితే అక్కడనిలపకుండా, భక్తులకు ఇబ్బంది కలగకుండా చూడాలి. తిరుమలలో వాహనాల విషయంలో క్రమశిక్షణ, నియంత్రణ తప్పనిసరిగా ఉండాలి. భక్తుల సౌకర్యం కోసం ఈ అంశాలపై టీటీడీ ప్రత్యేక దృష్టి పెట్టాలి.

- ఎన్. కృష్ణ, హైదరాబాద్

### క్రీడలతో మానసికంగా దృఢత్వం

నేటికాలంలో యువత మారుతున్న విధానాల ఒకేచోట స్థిరంగా అవసరం ఉంటే తప్ప బయటికి వెళ్లడానికి ఇష్టపడడం లేదు.యువత బలంగా ఉండాలనుకుంటే కచ్చితంగా ఆటలు ఆడితేనే మానసికంగా దృఢంగాఉండే అవకాశం. కావున వీలైనంత వరకు పౌష్టికాహారం తీసుకోవాలి. యువత బలంగా ఉంటే దేశం బలంగా ఉంటుంది. అభివృద్ధి చెందుతుంది.

-మోతె శివకుమార్, రంగారెడ్డిజిల్లా

గమనిక: ఎడిటోరియల్ పేజీలో ప్రచురితమయ్యే వ్యాసాలలోని అంశాలు, విశ్లేషణలు వ్యాసకర్త సొంత అభిప్రాయాలు. వాటితో పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. -ఎడిటర్

మనవి | ఎడిట్ పేజీకి.. ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్ (e-mail: editpage@vaartha.com)

# 'ఇసి'ని ఉత్సవ విగ్రహం చేయొద్దు

**రాజకీయ ఒత్తిడిలకు లొంగకుండా నితీనిజాయితీతో వ్యవహరిస్తే ఉన్న చట్టాలతో ఎంతమేరకు చేయవచ్చో ఆయన చేతల్లో చూపించారు. 1990 డిసెంబరు నుంచి 1996 డిసెంబరు వరకు సిఇసి పదవులో ఉన్న టి.ఎన్ శేషన్ ఎన్నికల నిర్వహణలో పెను మార్పులు తీసుకువచ్చారు. ఇసి స్వయం ప్రతిపత్తి, సమగ్రతను నిలబెట్టారు. కొమ్ములు తిరిగిన నాయకులకు కూడా చెమటలు పట్టించారు. కొందరు నాయకులకు అయితే పగటి పూటే కలలు తెప్పించారు. చివరకు కరెంటు స్తంభాలకు జెండాలు కట్టాలన్నా, గోడల మీద రాయాలన్నా వెనుకాముందు ఆలోచించే పరిస్థితి అయితే తెప్పించారు. తప్పు చేస్తే ఏ మూల నుంచి కనిపెట్టి చర్యలకు ఒడిగడతారోననే భయం అభ్యర్థుల్లోనే కాదు వారిని బలపరుస్తున్న అనుచరుల్లో కూడా నెలకొనే పరిస్థితులు తీసుకువచ్చారు. నిబంధనలకు విరుద్ధంగా ఎక్కడ ఏమాత్రం ఎవరు వ్యవహరించినా చర్యలు తీసుకోవడానికి ఆనాడు ఇదే అధికారగణం ఏమాత్రం వెనుకంజవేయలేదు. అందుకే ఏకసభ్య కమిషన్‌గా ఉన్న ఇసి త్రిసభ్యకమిషన్‌గా మారిందనే వాస్తవాన్ని తోసిపుచ్చలేం.**

దామెర్ల సాయిబాబ

ప్రజాస్వామ్య మనుగడకు ఎన్నికలు ప్రాణం వంటివి. ఆ ఎన్నికలకు ఎన్నికల కమిషనే ఊపిరి. ఎన్నికల నిర్వహణలో అత్యంత కీలకమైన పాత్ర పోషించి ప్రజాస్వామ్యాన్ని కాపాడాల్సిన గురుతర బాధ్యత మన రాజ్యాంగ నిర్మాతలు ఎన్నికల కమిషన్‌పై ఉంచారు. ఎలక్షన్ కమిషన్ అంటే కేవలం పోలింగ్ జరిపించి, ఓట్లు లెక్కించే సంస్థ కాదు. చట్టప్రకారం అర్హత కలిగిన వారందరి పేర్లతో కూడిన ఓటర్ల జాబితాలు తయారు చేసి, ఓటు హక్కు వినియోగంలో అర్హులైన ప్రజలందరికి సమాన అవకాశాలు కల్పించాల్సిన బాధ్యత కూడా ఇసిపై పెట్టారు. ఇలాంటి కీలక బాధ్యతలు నిర్వర్తించడంలో విఫలమైతే ఇసి విశ్వసనీయత ఒక్కటే దెబ్బతినదు, ప్రజాస్వామ్యంపైనే నమ్మకం సడలిపోతుంది. అరాచకం ప్రబలుతుంది. అధికారపక్షం ఒత్తిడిలకు లొంగకుండా తలవంచని వారిని ఎన్నికల సంఘానికే సారథ్యం వహించాలంటూ రాజ్యాంగ నిర్మాతలు కూడా నిర్దేశించారు. ఒక వ్యూహం ప్రకారం ఇసిని నిర్వీర్యం చేసేందుకు, తమ చెప్పుచేతల్లో ఉంచుకునేందుకు కొందరు అధికార పెద్దలు ప్రయత్నం చేస్తున్నారనే ఆరోపణలకు ఇటీవల జరుగుతున్న సంఘటనలు బలం చేకూరుస్తున్నాయి. కేంద్ర ఎన్నికల కమిషనర్ల నియామకాల ఎంపిక కమిటీలో భారత ప్రధాన న్యాయమూర్తి (సిజెఐ) స్థానంలో కేంద్ర మంత్రితో భర్తీ చేస్తూ చట్టం చేసిన తర్వాత పరిస్థితి మరింతగా దిగజారింది. ఎన్నికల సంఘం నియామకాల్లో ప్రభుత్వ జోక్యం, పెత్తనాన్ని పెంచి ఇసిని కీలుబొమ్మగా చేసేందుకు ఈ చట్టాన్ని చేశారనే ఆరోపణలు అప్పట్లోనే వెల్లువెత్తాయి. ఈ చట్టానికి ముందు ప్రధాన మంత్రి నేతృత్వంలో లోక్‌సభలో విపక్షనేత, సిజెఐ కలిసి ఈ నియామకాలు చేసేవారు. కొత్త చట్టం ప్రకారం ప్రధానితోపాటు లోక్‌సభలో విపక్షనేత, ప్రధాని నియమించే ఒక కేబినెట్ మంత్రి సభ్యులుగా ఉంటారు. వాస్తవంగా చీఫ్ ఎలక్షన్ కమిషనర్‌గా చట్టప్రకారం ప్రత్యేక అధికారాలేమీ ఉండవు. మిగిలిన ఇద్దరితో సమానమే. అయితే ఏక గ్రీవంగా తీసుకోవాలి. అలా వీలు కానప్పుడు మెజారిటీ అభిప్రాయాల ప్రకారం నిర్ణయించి అమలు చేయాలి. అలా జరిగినట్లు కన్పించడం లేదు. అన్నింటికంటే 'సర్' అంటూ ఓటర్ల జాబితాను తయారు చేయడం ప్రారంభించిన తర్వాత దేశవ్యాప్తంగా లక్షలాది ఓట్లు గల్లంతయ్యాయి. పశ్చిమ బెంగాల్, బీహార్, హర్యానా తదితర రాష్ట్రాల్లో ఎన్నికలు అలాగానే జరిగిపోయాయి. తమ ఓట్లు ఎందుకు తొలగించారో తెలుసుకోలేని అయోమయ పరిస్థితి ఓటర్లకు కల్పించారు. ఓటర్ల జాబితా తయారు చేయడం అనేది ఇప్పుడు కొత్తగా వచ్చింది కాదు. గతంలో కూడా జరిగాయి. కానీ ఇలా లక్షలాది ఓట్లు గల్లంతయిన సందర్భాలు లేవు. ఇప్పటికే భారత్‌లో ఎన్నికలు ఒక ప్రహసనంగా మారిపోయాయి. బడితగలవాడిదే బర్రె అన్నట్లు ఎన్ని అడ్డదారులు తొక్కైనా అధికారం చేజిక్కించుకోవాలనే ఆరాటపడే వారి సంఖ్య అంతకంతకు పెరిగిపోతున్నది.ఫలితంగా అధికారం, పదవులు డబ్బున్నవారి గుత్తసొత్తుగా మారిపోతున్నాయి. దీంతో ఎన్నికల్లో అక్రమాలకు అదుపు లేకుండాపోతున్నది. డబ్బులు వెదజల్లో, మద్యం ఏరులా పారించో, అవీఇవి కాకపోతే భయపెట్టో, బతిమాలో, ప్రలోభపెట్టో ఏదోరకంగా ఓటర్లను తమవైపు తిప్పుకునేందుకు సకల ప్రయత్నాలు చేస్తున్నారు. ఈ పార్టీ ఆ పార్టీ అనికాదు. దాదాపు అన్ని పార్టీలు అదే పంథాలో నడుస్తున్నాయి. అసలు రాజకీయమే

### ఒక్క మాట

జీవనంగా సాగించే నాయకులు కరవైపోయారు. తమతమ ఆస్తులను కాపాడుకునేందుకు కొందరు,విస్తరించేందుకు ఇంకొందరు, సంఘంలో గౌరవప్రతిష్టలు ఉంటాయనే భావనతో మరికొందరు రాజకీయాల్లోకి ప్రవేశిస్తున్నారు. పదవుల కొనుగోళ్లకు కోట్లాది రూపాయలు వెచ్చించడానికి వెనుకాడడం లేదు. కప్పదాట్లకు అదుపులేకుండాపోతున్నది. అధికారం పదవులే లక్ష్యంగా ఫిరాయింపులు జరిగిపోతున్నాయి.మొత్తం మీద రాజకీయాల రూపురేఖలు మారిపోతున్నాయి. పెట్టుబడి, రాబడి, తిరిగి పెట్టుబడి ఒక విషవలయంగా మారిపోయింది. ఈ ఆరాటపోరాటాలలో కొందరు నేతలు చేయని అక్రమాలంటూ ఉండడం లేదు. తొక్కని అడ్డదారులు లేవు. ఇదేమీ కొత్త విషయం కాదు. అందరికి తెలిసిందే. అయితే ప్రజాస్వామ్యానికి ప్రాణపదమైన ఎన్నికల్లో అక్రమాలు జరగకుండా ఓటర్ల జాబితా నుంచి ఓట్లు గల్లంతుకాకుండా ఆపలేరా? స్వేచ్ఛగా ఎన్నికల్లో ఓటు వేసే వాతావరణం ప్రజలకు కల్పించలేరా? మద్యం, డబ్బు, పంపిణీ చేయకుండా చట్టాలు లేవా? అధికారులు లేరా? అయినా ఇంత బాహాటంగా ఎందుకు జరుగుతున్నాయి? తదితర ప్రశ్నలన్నీ జవాబులేనివిగా మిగిలిపోతున్నాయి. ఎన్నికల విధానంలో సంస్కరణలు తీసుకురావాలని, చట్టాలకు మరింత పదును పెట్టాలని డిమాండ్ చాలాకాలంగా ఉన్నది. ఉన్న చట్టాలను ఏమేరకు త్రికరణశుద్ధిగా అమలు చేస్తున్నారు. వాస్తవంగా చూస్తే భవిష్యత్‌ను దృష్టిలో ఉంచుకొని రాజకీయాల ఒత్తిడికి లొంగకుండా రాగద్వేషాలకు అతీతంగా వ్యవహరించగలిగే స్వతంత్ర ప్రతిపత్తి హోదాతో దేశంలోని చట్టసభలకు ఎన్నికలు నిర్వహించేందుకు మన రాజ్యాంగ నిర్మాతలు 1950 ప్రాంతంలో ఎన్నికల సంఘాన్ని ఏర్పాటు చేశారు. ఎన్నికల్లో ఎలా ప్రచారం చేయాలి?ఎంత డబ్బు ఖర్చు పెట్టాలి? సభలు, సమావేశాలు ఏ సమయం వరకు నిర్వహించుకోవచ్చు? ఎన్ని వాహనాలు వాడాలి? తదితర విషయాల్లో స్పష్టమైన నిబంధనలతో ఎన్నికల నియమావళిని రూపొందించారు. అయితే ఆ నియమావళి చాలా కాలంపాటు ఫైళ్లలోనే నిద్రపుచ్చారు. ఆదిలో ఏకసభ్య కమిషన్‌గా ఏర్పడింది. కానీ ఒక వ్యూహం ప్రకారం దాన్ని త్రిసభ్య కమిషన్‌గా ఆనాటి కాంగ్రెస్ పార్టీ మార్చింది. ఇలా మార్చడానికి కారణాలు ఎన్నో ఉన్నాయి. అప్పటి కమిషన్‌గా ఉన్న శేషన్ ఆనాటి కేంద్ర పెద్దల మాటలు వినకపోవడం, ఇతర సమస్యలు ఉండటంతో త్రిసభ్య కమిషన్‌గా మార్చారు. వాస్తవంగా చెప్పాలంటే చంద్రశేఖర్ ప్రధాన మంత్రిగా ఉన్నప్పుడు టి.ఎన్ శేషన్ నియామకం జరిగిన తర్వాత ఎలక్షన్ కమిషన్‌కు అంతకుముందు ఎప్పుడూలేని ప్రాధాన్యత, గుర్తింపు లభించింది. ఒక్కమాటలో చెప్పాలంటే ఎన్నికల కమిషన్ ఒకటుందని, దానికి నియమావళి ఉన్నదని సాధారణ పౌరులకు అప్పుడే తెలిసింది. రాజకీయ ఒత్తిడిలకు లొంగకుండా నీతి నిజాయితీతో వ్యవహరిస్తే ఉన్న చట్టాలతో ఎంతమేరకు చేయవచ్చో ఆయన చేతల్లో చూపించారు.1990 డిసెంబరు నుంచి 1996 డిసెంబరు వరకు సిఇసి పదవులో ఉన్న టి.ఎన్ శేషన్ ఎన్నికల నిర్వహణలో పెనుమార్పులు తీసుకువచ్చారు. ఇసి స్వయం ప్రతిపత్తి,సమగ్రతను నిలబెట్టారు. కొమ్ములు తిరిగిన నాయకులకు కూడా చెమటలు పట్టించారు. కొందరు నాయకులకు అయితే పగటి పూటే కలలు తెప్పించారు.చివరకు కరెంటు స్తంభాలకు జెండాలు కట్టాలన్నా, గోడలమీద రాయాలన్నా వెనుకాముందు ఆలోచించే పరిస్థితి అయితే తెప్పించారు. తప్పు చేస్తే ఏ మూలనుంచి కనిపెట్టి చర్యలకు ఒడిగడతారోననే భయం అభ్యర్థుల్లోనే కాదు వారిని బలపరుస్తున్న అనుచరుల్లో కూడా నెలకొనే పరిస్థితులు తీసుకువచ్చారు. నిబంధనలకు విరుద్ధంగా ఎక్కడ ఏమాత్రం ఎవరు వ్యవహరించినా చర్యలు తీసుకోవడానికి ఆనాడు ఇదే అధికారగణం ఏమాత్రం వెనుకంజ వేయలేదు. అందుకే ఏకసభ్య కమిషన్‌గా ఉన్న ఇసి త్రిసభ్యకమిషన్‌గా మారిందనే వాస్తవాన్ని తోసిపుచ్చలేం. ఆ మధ్య ఎన్నికల కమిషన్‌కు సంబంధించి దాఖలైన ప్రజాహిత వ్యాజ్యాలను విచారిస్తూ శేషన్ నిజాయితీని, నిర్భయత్వాన్ని సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ కె.ఎన్, జోసెఫ్ ప్రస్తావించారు. రాజకీయ ఒత్తిడిలకు లొంగకుండా నిబంధనలకు అనుగుణంగా శేషన్ ఎంతో నిర్భయంగా నడుచుకున్నారని, అటువంటి ప్రధాన ఎన్నికల కమిషన్ మళ్లీ రావాలని వ్యాఖ్యానించారు. ఇప్పటికైనా కేంద్ర పెద్దలు మనసుపెట్టి ఆలోచించాలి. సర్వోన్నత న్యాయమూర్తిని తప్పించి తమకు ఇష్టమైన మంత్రికి అందులో సభ్యత్వం కల్పించడం ప్రజాస్వామ్యవాదులు జీర్ణించుకోలేకపోతున్నారు. ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించడంలో కీలకపాత్ర వహించాల్సిన ఇసి విశ్వసనీయత, నిష్పాక్షికతలపై నీలినీడలు కమ్ముకోవడం ప్రజాస్వామ్యానికే అత్యంత ప్రమాదకరం. ●

# సముద్ర 'మథనం'తోనే ఇంధన భద్రత

సి.హెచ్. ప్రతాప్

దేశ ఆర్థికాభివృద్ధికి ఇంధన భద్రత అత్యంత కీలకం. ముడి చమురు, సహజవాయువు అవసరాల్లో భారత్ ఇప్పటికీ విదేశీ దిగుమతులపై భారీగా ఆధారపడుతోంది. అంతర్జాతీయ మార్కెట్లో ధరలు పెరిగినా, భౌగోళిక ఉద్రిక్తతలు తలెత్తినా ఆ ప్రభావం నేరుగా దేశ ఆర్థిక వ్యవస్థపై పడుతోంది. ఈ నేపథ్యంలో సముద్ర గర్భంలో దాగి ఉన్న చమురు, సహజవాయువు వనరులను వెలికితీసేందుకు కేంద్రంచేపట్టిన సముద్ర మంథన్ జాతీయ ఆఫ్‌షోర్ అన్వేషణ పథకం వ్యూహాత్మకంగా ప్రాధాన్యం సంతరించుకుంది. 2026 జూలై 31న కేంద్ర మంత్రివర్గం ఆమోదించిన ఈ పథకానికి 2030-31 వరకు తొలి దశలో రూ. 84,084 కోట్లు కేటాయించారు. భారత తూర్పు, పశ్చిమ తీరాల్లో 3,000 మీటర్లలోతు వరకు విస్తరించిన సముద్ర బేసిన్లలో సుమారు 5,600 మిలియన్ మెట్రిక్ టన్నుల ఆయిల్ ఈక్వివలెంట్ హైడ్రోకార్బన్ సామర్థ్యం ఉన్నట్లు ప్రభుత్వ అంచనా. ఈ కార్యక్రమం ద్వారా కనీసం 600 మిలియన్ మెట్రిక్ టన్నుల ఆయిల్ ఈక్వివలెంట్ కొత్త నిల్వలను గుర్తించాలన్నది లక్ష్యం. భారత్ ప్రపంచంలో ముడి చమురు వినియోగంలో మూడో స్థానంలో ఉంది. చమురు దిగుమతుల కోసం ఏటా సుమారు 144బిలియన్ డాలర్లు, అంటే దాదాపు రూ.13లక్షల కోట్లు, వెచ్చించాల్సి వస్తోంది. దేశీయ ఉత్పత్తి కొద్దిగా పెరిగినా విదేశీ మారక ద్రవ్యంపై ఒత్తిడి తగ్గుతుంది.అంతర్జాతీయ సరఫరా అంతరాయాలు, యుద్ధాలు, ఆంక్షలు, చమురు ధరల ఆకస్మిక పెరుగుదల వంటి పరిణామాలను ఎదుర్కొనే శక్తి కూడా దేశానికి పెరుగుతుంది. సముద్ర మంథన్ కేవలం సముద్రంలో బావులుతవ్వే కార్యక్రమంగా మిగలకూడదు. అత్యాధునిక భూకంప తరంగ సర్వేలు, లోతైన-అతి లోతైన సముద్ర ప్రాంతాల్లో అన్వేషణ బావులు, కొత్త బేసిన్లలో శాస్త్రీయ డ్రిల్లింగ్, ఉత్పత్తి-రవాణా మౌలిక వసతులు, ఆఫ్‌షోర్ పరికరాల దేశీయ తయారీ, సేవా కేంద్రాల అభివృద్ధిని ఒకే ప్రణాళిక కింద ముందుకు తీసుకెళ్లాలి. దీనివల్ల దేశీయ పరిశ్రమలకు అవకాశాలు పెరగడంతో పాటు సాంకేతిక పరిజ్ఞానం, నైపుణ్యాభివృద్ధి, ఉపాధికి కొత్త మార్గాలు తెరుచుకుంటాయి. అయితే భారీ పెట్టుబడే విజయానికి హామీ కాదు. లోతైన సముద్రఅన్వేషణ అత్యంత ఖరీదైనది. ప్రతి బావిలో వాణిజ్యపరంగా ఉపయోగపడే చమురు లేదా గ్యాస్ లభిస్తుందన్న భరోసాఉండదు.అందువల్లప్రతిదశకు స్పష్టమైన కాలపట్టిక, కొలిచేలక్ష్యాలు,ఖర్చు, ఫలితాల సమీక్షఉండాలి.అన్వేషణ ఫలితాలు, వ్యయం, పురోగతిని క్రమం తప్పకుండా వెల్లడించడం ద్వారా జవాబుదారీతనం పెంచాలి. పర్యావరణ పరిరక్షణ విషయంలో మాత్రం రాజీకి తావుండకూడదు.చమురు లీకేజీలు, సముద్ర జీవవైవిధ్యంపై ప్రభావం, తీరప్రాంత జీవనోపాధిపై ముప్పును ముందుగానే అంచనా వేసే స్వతంత్ర పర్యవేక్షణ వ్యవస్థ అవసరం. అదే సమయంలో విదేశీ సాంకేతికతపై శాశ్వతంగా ఆధారపడకుండా ప్రభుత్వ, ప్రైవేటు పరిశ్రమల సాంకేతిక భాగస్వామ్యాన్ని పెంచాలి.పెట్టుబడికి లక్ష్యం, అన్వేషణకు వేగం, వ్యయానికి జవాబుదారీతనం, పర్యావరణానికి రక్షణ, సాంకేతికతలో స్వావలంబన ఈ ఐదు అంశాలను కచ్చితంగా అమలు చేసినప్పుడే సముద్ర మంథన్ నిజమైన ఫలితాన్ని ఇస్తుంది. ●

# డాలర్‌కు అడ్డుచక్రం సాధ్యమేనా?

వనకళ్ళ వీరప్ప

అంతర్జాతీయ ఆర్థిక వ్యవస్థను అనుసంధానిస్తున్న అమెరికా డాలర్ ఆధిపత్యానికి అడ్డుకట్ట వేసేందుకు బ్రిక్స్ కూటమి సన్నద్ధమవుతోంది. దశాబ్దాలుగా విశ్వవిపణిపై పట్టుబిగించిన అగ్రరాజ్యం తాజా భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతల నేపథ్యంలో తన ప్రాబల్యాన్ని క్రమంగా కోల్పోతోంది. ప్రపంచ చమురు మార్కెట్‌ను అమెరికా డాలర్ శాసిస్తోంది. అణ్వస్త్ర తూణీరాలను పోగుచేసుకుని ప్రపంచాన్ని శ్వేత సౌధానికి ఇప్పుడు పెద్ద కష్టమే వచ్చిపడింది. తన మనుగడకు ఆయుపట్టుగా ఉన్న డాలర్ పునాదుల్లో డైనమెట్లు పెట్టేందుకు ఒక్కొక్కరూ సిద్ధమవుతున్నారు. ప్రచ్ఛన్నయుద్ధ కాలపు ప్రత్యర్థి అయిన రష్యా, వాణిజ్య వైరి చైనా, దక్షిణాసియా మార్కెట్‌లో అగ్రగామిగా ఉన్న భారత్‌లు తమ ప్రాపకాన్ని పెంచుకుంటున్నాయి. అంతర్జాతీయ ఇస్లామిక్ ఉగ్రవాదానికీ, పశ్చిమాసియా మృత్యుహేళకు, ప్రపంచ భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతలకు డాలర్‌ను పెట్టుబడిగా మార్చింది. భూగోళంపై విస్తరిస్తున్న అనేక మారణహోమాలకు అమెరికా మదుపరి. ఆంక్షల పేరిట దేశాల ఆర్థిక వ్యవస్థలను స్తంభింప చేసేందుకు డాలర్‌ను దుడ్డుకర్రగా ఉపయోగిస్తుంది. బహుళ ధ్రువ ప్రపంచంవైపు అడుగులు వేస్తున్న వేళ ఆర్థిక స్వయం ప్రతిపత్తి సాధించడమే పెను సవాల్. డీ డాలరైజేషర్ అనే మహత్తర లక్ష్యాన్ని సాధించినప్పుడే బ్రిక్స్ దేశాల స్వావలంబన సాధ్యమవుతుంది. అపార చమురు నిక్షేపాలున్న అరబ్బు దేశాల భయమే డాలర్ ఆధిపత్యానికి మూలం. 1971లో అప్పటి అమెరికా అధ్యక్షుడు రిచర్డ్ నిక్సన్ గోల్డ్ స్టాండర్డ్‌ను రద్దు చేయాలని నిర్ణయించారు. డాలర్లను ముద్రించడానికి ఇకపై బంగారం మద్దతు అవసరం లేకుండా చేయడమే దీని ఉద్దేశం. దీంతో ప్రపంచ చమురు మార్కెట్‌పై అమెరికా ఆధిపత్యం మొదలైంది. ఆ తర్వాత, 1974లో సౌదీ అరేబియాతో అమెరికా ఒక వ్యూహాత్మక ఒప్పందంపై సంతకం చేసింది. దీని ప్రకారం సౌదీ అరేబియా చమురు ధరను అమెరికా డాలర్ల ఆధారంగా నిర్ణయించి, దానిని డాలర్లలోనే విక్రయించాలి. బదులుగా సౌదీ అరేబియాకు భద్రత కల్పిస్తామని అమెరికా హామీ ఇచ్చింది. అపార చమురు నిక్షేపాలున్న అరబ్బు దేశాల భయమే అమెరికా డాలర్ ఆధిపత్యానికి మూలం. ఆకలీ వ్యాపారమూ తలపడే చోటబీభత్సం ఉంటుంది. బెదిరింపూ భయమూ తారసపడే చోట భద్రత వ్యూహాత్మక అవసరమవుతుంది. రెండో ప్రపంచ యుద్ధ సమయంలో తీవ్రమైన ఆర్థిక అస్థిర పరిస్థితులు ఏర్పడినప్పుడు అమెరికా సహా 44 మిత్ర దేశాల ప్రతినిధులు కరెన్సీ కోసం ఒక కొత్త వ్యవస్థను ఆమోదించారు. అది 'బ్రెటన్ ఉడ్స్ సిస్టమ్'గా ప్రసిద్ధి చెందింది. దీనిప్రకారం అమెరికా డాలర్ ధరను బంగారం ఆధారంగా నిర్ణయించారు.ఒక ఔన్సు బంగారం ధరను 35డాలర్లుగా నిర్ణయించారు. బంగారం మద్దతున్న ఏకైక కరెన్సీ అమెరికా డాలర్ మాత్రమే. మిగతా దేశాలన్నీ బంగారానికి బదులుగా అమెరికా డాలర్లను నిల్వచేసుకునేవి. దీంతో డాలర్ ప్రపంచ కరెన్సీగా మారింది. ఈ వ్యవస్థ 1971



వరకు అమలులో ఉంది. ఒకానొక సమయంలో అమెరికా విపరీతంగా డాలర్లను ముద్రించడంతో బ్యాంకింగ్ కోసం దాని వద్ద తగినంత బంగారం లేకుండా పోయింది. దీంతో ఈ వ్యవస్థ 1971లో ముగిసింది. అమెరికా కుంభాకారకటం కావడానికి, డాలర్ ఆంప్లిఫయర్ కావడానికీ వెనుక అనేక దేశాల రక్తసిక్తమైన చరిత్ర ఉంది. పెట్రో డాలర్ వ్యవస్థను అమలు చేయడంతో అమెరికాకు పెద్ద ప్రయోజనం కలిగింది. ఎందుకంటే, ప్రపంచంలో అత్యంత ముఖ్యమైన, అత్యధికంగా కొని, అమ్మే వస్తువు చమురు. ఏ దేశమైనా ముడి చమురు కొనాలనుకుంటే దానికి అమెరికా డాలర్లు అవసరమయ్యేవి. చమురు ఎగుమతి చేసే దేశాలు చమురు అమ్మకం ద్వారా పొందిన డాలర్లను అమెరికా ట్రెజరీ బాండ్లలో పెట్టుబడి పెట్టేవి. దీనినే పెట్రోడాలర్ రీసైక్లింగ్ అంటారు. సులభంగా చెప్పాలంటే, గల్ఫ్ దేశాలకు అమెరికాసైనిక రక్షణ కల్పించింది. దానికి ప్రతిఫలంగా అమెరికా ఇంధన భద్రతను పొందింది. చమురు వ్యాపారం డాలర్లలో జరిగింది. బిలియన్ల డాలర్లు అమెరికా ఆయుధాలు, సాంకేతికతను కొనుగోలు చేయడానికి, అలాగే అమెరికా స్టాక్‌లు, బాండ్లలో పెట్టుబడి పెట్టడానికి తిరిగి అమెరికాకే మళ్లాయి. సౌదీ అరేబియా, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్, ఖతార్, ఒమన్, బహ్రెయిన్‌లు తమ కరెన్సీలను డాలర్‌కు అనుసంధానించాయి. ప్రపంచ దేశాలన్నీ ఎగుమతి,దిగుమతి వ్యాపారాలకు డాలర్లలో చెల్లింపులు జరిపేందుకు అమెరికా, యూరప్, జపాన్‌లు ప్రస్తుతం స్విఫ్ట్ వ్యవస్థను ఆశ్రయిస్తున్నాయి. భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతలు తీవ్రమవుతున్న నేపథ్యంలో ఒక్కో దేశానికీ అమెరికా ఆంక్షల సంకెళ్లు పడటం మొదలైంది. దీంతో ప్రత్యామ్నాయాల వెతుకులాట తీవ్రమైంది. ఇటీవలి కాలంలో రష్యా, ఇరాన్‌లు స్విఫ్ట్‌కు ప్రత్యామ్నాయం వెతుక్కున్నాయి. చైనా తన ఎగుమతి వ్యాపారాల్లో ఆయా దేశాల కరెన్సీని స్వీకరిస్తూ దిగుమతుల్లో యువన్‌లలో చెల్లింపులు చేస్తోంది. బ్రిక్స్ దేశాలు సైతం ఇదే తరహాలో తమ సొంత కరెన్సీతో వాణిజ్యం చేయాలనే తలంపుతో ఉన్నాయి. ఆంక్షల కారణంగా డాలర్లు దొరకని స్థితిలో ప్రత్యామ్నాయ ప్రయత్నాలు ముమ్మరమయ్యాయి. రాబోయే రోజుల్లో అమెరికా మరింత సంక్షోభం ఎదుర్కొనే అవకాశం ఉండటంతో మరిన్ని ఆంక్షలు విధించే అవకాశం ఉంది. ఈ భయమే బ్రిక్స్ కూటమి కొత్త ప్రయత్నాలకు ఊపిరిపోసింది. భారత్ సైతం ఇటీవలి కాలంలో సొంత కరెన్సీలో చెల్లింపుల కోసం సిద్ధపడుతోంది. సౌదీ అరేబియా, రష్యా, ఇరాన్, బ్రెజిల్, యూఏఈలు బ్రిక్స్‌లో అతి పెద్ద ఇంధన ఉత్పత్తి దేశాలైతే చైనా, భారత్‌లు అతిపెద్ద ఇంధన వినియోగదారు దేశాలు. వర్తమాన భౌగోళిక ఉద్రిక్తతలు, అమెరికా ఆధిపత్య ధోరణి నేపథ్యంలో ఐకరాజ్యసమితి తన ప్రాబల్యాన్ని, ప్రాముఖ్యతను, ప్రతిపత్తిని కోల్పోతూ వస్తుండటంతో బ్రిక్స్ కూటమికి ఆదరణ పెరిగింది. బ్రిక్స్ సభ్య దేశాల వాణిజ్యంలో 65శాతం స్థానిక కరెన్సీలో జరుగుతోంది. హస్తిన కేంద్రంగా జరిగిన బ్రిక్స్ శిఖరాగ్ర సమావేశాలు చైనా భారత్‌ల మధ్య వాణిజ్య బంధాన్ని మరింత దృఢతరం చేయవచ్చనే అంచనాలున్నాయి. అమెరికాను ఎదుర్కొనేందుకు వర్తమాన దేశాలను ఏకం చేయాలనేది చైనా ప్రయత్నం. మొత్తంగా ఢిల్లీ బ్రిక్స్ సమావేశాల అంతిమసారం అమెరికాను సవాలు చేయడంగానే చూడాలి. అయితే అది అంత సులభంగా సాధ్యమవుతుందా? భారత్, అమెరికా ద్వైపాక్షిక బంధం ఎలాంటి మలుపు తీసుకుంటుంది అనేది భవిష్యత్తుకు సంబంధించిన అంశం. ●

# గాంధీజీకి 'శాంతి' అల్లంత దూరంలోనే!

## ఐదుసార్లు నామినేట్ అయినా లభించని ఫలితం

### వైఫల్యాన్ని చారిత్రక తప్పిదంగా అంగీకరించిన కమిటీ



**న్యూఢిల్లీ, అక్టోబరు 2:** అహింసా మార్గంలో ప్రపంచానికి స్ఫూర్తినిచ్చిన మహనీయుడు మహాత్మా గాంధీ. శాంతికి ప్రతీకగా నిలిచిన ఆయన పేరు నోబెల్ శాంతి బహుమతికి ఏకంగా ఐదుసార్లు నామినేట్ అయింది. కానీ, ఒక్కసారి కూడా ఆ అత్యున్నత పురస్కారం ఆయనకు దక్కలేదు. 1937, 1938, 1939, 1947, 1948 సంవత్సరాల్లో ఆయన పేరు పలుమార్లు షార్ట్‌లిస్ట్ వరకు వెళ్లినా, చివరికి తిరస్కరణకు గురైంది. దీని వెనుక అనేక కారణాలు ఉన్నాయి. గాంధీజీ పేరును 1937లో తొలిసారిగా నార్వే పార్లమెంటు సభ్యుడు ఒలే కోల్బ్జోర్న్‌సెన్ నోబెల్ శాంతి బహుమతికి నామినేట్ చేశారు. ఆ సమయంలో కమిటీ సలహాదారు జాకబ్ వార్మ్‌ముల్లర్, గాంధీ గొప్పతనాన్ని అంగీకరిస్తూనే కొన్ని సందేహాలు వ్యక్తం చేశారు. గాంధీ విధానాల్లో ఆకస్మిక మార్పులు వస్తున్నాయని, ఆయన ఒకేసారి స్వాతంత్ర్య సమరయోధుడిగా, అదే సమయంలో జాతీయవాదిగా కనిపిస్తున్నారని నివేదిక ఇచ్చారు. దీంతో ఆ ఏడాది బహుమతి లార్డ్ సెసిల్ ఆఫ్ చెల్‌వుడ్‌కు దక్కింది. ఇదే తరహా కారణాలతో 1938, 1939 నామినేషన్లు కూడా ముందుకు సాగలేదు. భారతదేశానికి స్వాతంత్రం వచ్చిన 1947లో గాంధీజీ పేరు మరోసారి షార్ట్‌లిస్ట్‌కు చేరింది. ఈసారి కమిటీ ఆయన అహింసా సిద్ధాంతాలపై సానుకూలంగా స్పందించింది. దేశ విభజన సమయంలో చెలరేగిన హింస, భారత్ పాకిస్థాన్ మధ్య ఉద్రిక్త పరిస్థితులు కమిటీ నిర్ణయాన్ని ప్రభావితం చేశాయి. గాంధీజీ ఒక పక్షానికే ఎక్కువగా కట్టుబడి ఉన్నారనే భావన కొందరు సభ్యుల్లో వ్యక్తమైంది. అదే సమయంలో ఆయన ప్రార్థనా సమావేశంలో చేసిన ఒక వ్యాఖ్యపై అసంపూర్ణ వార్తా కథనం కూడా సందేహాలకు తావిచ్చింది. దీంతో ఆ ఏడాది పురస్కారాన్ని క్వేకర్స్ సంస్థకు ప్రకటించారు. 1948 జనవరి 30న గాంధీజీ హత్యకు గురయ్యారు. నోబెల్ నామినేషన్ల గడువుకు కేవలం రెండు రోజుల ముందు ఈ ఘోరం జరిగింది. ఆ ఏడాది ఆయన పేరు మీద ఆరు నామినేషన్లు రాగా, కమిటీ మరోసారి ఆయన పేరును షార్ట్‌లిస్ట్ చేసింది. మరణానంతరం పురస్కారం ఇవ్వాలా వద్దా అని కమిటీ తీవ్రంగా చర్చించింది. ఆల్ఫ్రెడ్ నోబెల్ ఉద్దేశాలకు ఇది విరుద్ధమని భావించి, మరణానంతర పురస్కారాన్ని నిరాకరించింది. విశేషమేమిటంటే, ఆ ఏడాది అర్హులైన సజీవ అభ్యర్థి ఎవరూ లేరు అని ప్రకటిస్తూ నోబెల్ శాంతి బహుమతిని ఎవరికీ ఇవ్వలేదు. ఇది పరోక్షంగా ఆ పురస్కారం గాంధీకే దక్కాల్సిందనే విషయాన్ని తెలియజేసింది. తర్వాతి కాలంలో నోబెల్ కమిటీ సభ్యులు ఈ చారిత్రక తప్పిదాన్ని బహిరంగంగా అంగీకరించారు. 1989లో దలైలామాకు నోబెల్ శాంతి బహుమతి ప్రకటించినప్పుడు, కమిటీ ఛైర్మన్ మాట్లాడుతూ ఈ పురస్కారం కొంతవరకు మహాత్మాగాంధీ స్మృతికి నివాళి అని వ్యాఖ్యానించారు. ఇది గాంధీ విషయంలో జరిగిన పొరపాటుకు పశ్చాత్తాపంగా చరిత్రలో నిలిచిపోయింది.

# ఫ్లైదుబాయి కెప్టెన్‌కు ప్రధాని మోడీ పరామర్శ

## యోగక్షేమాలపై ఆరా

### కష్ట సమయంలో హనుమాన్ చాలీసా పఠించానన్న కెప్టెన్ స్మిత్



**న్యూఢిల్లీ, అక్టోబరు 2:** విమానంలో తోటి పైలట్ దాడిని ఎదుర్కొని, 174 మందికి పైగా ప్రయాణికుల ప్రాణాలను కాపాడిన ఫ్లైదుబాయ్ విమాన కెప్టెన్ స్మిత్ మచ్చర్‌తో భారత ప్రధాని నరేంద్ర మోడీ శుక్రవారం ఫోన్‌లో మాట్లాడారు. ప్రస్తుతం యూఏఈలోని ఓ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న స్మిత్ యోగక్షేమాలను ప్రధాని అడిగి తెలుసుకున్నారు. ఆయన ధైర్యసాహసాలను కొనియాడుతూ, త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ప్రధాని నుంచి ఫోన్ కాల్ రావడంతో స్మిత్ తీవ్ర భావోద్వేగానికి గురయ్యారు. తనకు అతిపెద్ద ఆరాధ్య దైవం, ఆదర్శప్రాయుడు ప్రధాని మోడీయేనని, ఆయనతో మాట్లాడే అవకాశం వస్తుందని కలలో కూడా ఊహించలేదని ఆనందం వ్యక్తం చేశారు. దుబాయ్ నుంచి టెల్ అవీవ్‌కు వెళ్తున్న ఫ్లైదుబాయ్ విమానంలో ఈ ఘటన చోటుచేసుకుంది. కాక్‌పిట్‌లో ఉన్న కెప్టెన్ స్మిత్ మచ్చర్‌పై తోటి పైలట్ కత్తితో దాడికి పాల్పడ్డాడు. ఈ దాడిలో తీవ్రంగా గాయపడి కుప్పకూలినప్పటికీ, స్మిత్ అసామాన్యమైన ధైర్యాన్ని ప్రదర్శించారు. చివరి క్షణంలో కాక్‌పిట్ డోర్ లాచ్‌ను నొక్కి తలుపు తెరిచారు. దీంతో ప్రయాణికులు వెంటనే లోపలికి ప్రవేశించి, దాడి చేస్తున్న పైలట్‌ను అదుపులోకి తీసుకున్నారు. స్మిత్ సమయస్ఫూర్తి వల్ల 9/11 తరహా పెను ప్రమాదం తప్పిందని, 174 మందికి పైగా సురక్షితంగా బయటపడ్డారని ప్రపంచవ్యాప్తంగా ప్రశంసలు వెల్లువెత్తుతున్నాయి. ప్రధానితో సంభాషణ సందర్భంగా స్మిత్ ఒక ఆసక్తికర విషయాన్ని పంచుకున్నారు. తాను కష్ట సమయాల్లో ఉన్నప్పుడు హనుమాన్ చాలీసా పఠిస్తానని, విమానంలో దాడి జరిగినప్పుడు కూడా ప్రాణాలతో పోరాడుతూ హనుమాన్ చాలీసానే చదువుకున్నానని వివరించారు.

అనంతరం ప్రధాని మోడీ, స్మిత్ తల్లి గీతా బెన్‌తో కూడా మాట్లాడారు. భగవద్గీత విలువలు, బోధనలతో కుమారుడిని పెంచినందుకు ఆమెను అభినందించారు. స్మిత్ త్వరగా కోలుకోవడానికి అవసరమైన వైద్య సహాయంతో పాటు అన్ని విధాలుగా కేంద్ర ప్రభుత్వం అండగా ఉంటుందని ప్రధాని మోడీ వారి కుటుంబానికి భరోసా ఇచ్చారు.

# కలినిన్‌గ్రాడ్‌పై దాడిచేస్తే అణ్వాయుధ దాడి తప్పదు

## యూరోప్ దేశాలకు పుతిన్ హెచ్చరిక



**మాస్కో, అక్టోబరు 2:** రష్యా భూభాగమైన కలినిన్‌గ్రాడ్‌పై నేరుగా దాడి జరిగితే అణ్వాయుధాలను ప్రయోగించేందుకు కూడా వెనుకాడబోమని అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ హెచ్చరించారు. తమ దేశంపై దాడి జరిగితే అందుబాటులో ఉన్న అన్ని రకాల ఆయుధాలను ఉపయోగించే అంశాన్ని తక్షణమే పరిశీలిస్తామని స్పష్టం చేశారు. ఉక్రెయిన్ యుద్ధం నేపథ్యంలో పశ్చిమ దేశాలు ఉద్రిక్తతలను మరింత పెంచితే పరిణామాలు తీవ్రంగా ఉంటాయని హెచ్చరించారు. మాస్కోలో జరిగిన వాల్డాయ్ ఫోరమ్‌లో గురువారం ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. రష్యాకు యూరప్‌లోని ఏ దేశంపైనా దాడి చేసే ఉద్దేశం లేదని పుతిన్ తెలిపారు. ఐరోపా దేశాలతో శాంతియుతంగా కలిసి జీవించాలన్నదే తమ ఆకాంక్షగా పేర్కొన్నారు. అయితే రష్యా భూభాగంపై ప్రత్యక్ష దాడి జరిగితే మాత్రం తీవ్రంగా ప్రతిస్పందిస్తామని స్పష్టం చేశారు. ముఖ్యంగా నాటో సభ్యదేశాలైన పోలండ్, లిథువేనియా మధ్య ఉన్న కలినిన్‌గ్రాడ్ ప్రాంతం తమకు వ్యూహాత్మకంగా కీలకమని పేర్కొన్నారు. ఈ ప్రాంతంపై దాడి జరిగితే అణ్వాయుధాల వినియోగం అనివార్యమయ్యే పరిస్థితి రావచ్చని హెచ్చరించారు. నాటో సైనికంగా రష్యా కంటే రెండింతలు పెద్దదని పుతిన్ వ్యాఖ్యానించారు. ఫ్రాన్స్, బ్రిటన్ అణ్వాయుధ సామర్థ్యంపై తమకు పూర్తి అవగాహన ఉందన్నారు. అయితే తమ వద్ద కూడా ప్రత్యర్థులపై ఆధిక్యం సాధించగల ఆయుధాలు ఉన్నాయని పేర్కొన్నారు. కలినిన్‌గ్రాడ్‌ను దిగ్బంధించేందుకు నాటో ప్రయత్నిస్తే అణ్వాయుధాలు ఉపయోగించేందుకు సిద్ధమని రష్యా దౌత్యపరమైన హెచ్చరిక పంపినట్లు నాటో వెల్లడించిన నేపథ్యంలో పుతిన్ వ్యాఖ్యలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి. అణ్వాయుధ బెదిరింపులు సరికాదని నాటో ప్రధాన కార్యదర్శి మార్క్ రుట్టే స్పష్టం చేశారు. 2022లో ఉక్రెయిన్‌పై రష్యా పూర్తిస్థాయి సైనిక చర్య ప్రారంభించినప్పటి నుంచి పశ్చిమ దేశాలతో మాస్కో సంబంధాలు తీవ్ర ఉద్రిక్తతల మధ్య కొనసాగుతున్నాయి. రష్యా తమపై విధ్వంసక చర్యలకు పాల్పడుతోందని ఐరోపా దేశాలు ఆరోపిస్తుండగా మాస్కో వాటిని ఖండిస్తోంది. ఇదే సమయంలో ఉద్రిక్తతలు మరింత పెరిగితే వెనక్కి తగ్గలేని పరిస్థితి తలెత్తవచ్చని పుతిన్ ఆందోళన వ్యక్తం చేశారు.

అణ్వాయుధాల వినియోగం ప్రపంచానికి పెను ప్రమాదాన్ని తెచ్చిపెడుతుందని, అటువంటి పరిస్థితి రాకుండా దేశాలు జాగ్రత్తగా వ్యవహరించాలని సూచించారు. ఉక్రెయిన్‌పై నల్లసముద్ర ప్రాంతంలో రష్యా దాడులను నిలిపివేసే ప్రసక్తే లేదని పుతిన్ స్పష్టం చేశారు. రష్యా చమురు శుద్ధి కేంద్రాలపై ఉక్రెయిన్ దాడుల వల్ల తమ స్థూల దేశీయో త్పత్తిలో ఒక శాతం మేర నష్టం వాటిల్లిందని వెల్లడించారు. ఉక్రెయిన్‌కు ఆయుధాలు సరఫరా చేస్తున్న ఐరోపా కర్మాగారాలపై తక్షణమే దాడులు చేసే ఆలోచన తమకు లేదని తెలిపారు. సరైన అజెండా ఖరారైతే చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్, అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌తో కలిసి త్రైపాక్షిక సమావేశంలో పాల్గొనేందుకు సిద్ధమని కూడా పుతిన్ ప్రకటించారు.

# ధర్మం, దేశం వేర్వేరు కానేకాదు

## ఆర్ఎస్ఎస్-చీఫ్ భగవత్



**నాగ్‌పూర్, అక్టోబరు 2:** భారతదేశంలో ధర్మం, దేశం వేర్వేరు కావని, ప్రపంచం ఎదుర్కొంటున్న అనేక సవాళ్లకు భారతీయ ఆధ్యాత్మిక జ్ఞానమే పరిష్కారం చూపగలదని రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ (ఆర్ఎస్ఎస్) సర్ సంఘచాలక్ మోహన్ భగవత్ పేర్కొన్నారు. శుక్రవారం నిర్వహించిన అఖిల భారత విహార్ సేవా గ్రూప్ 14వ మహాసభలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా భగవత్ మాటాడుతూ, మన దేశం, ధర్మం పరస్పర భిన్నమైనవి కావు. దేశానికి ధర్మమే ప్రాణాధారం, ధర్మమే దేశాన్ని సుస్థిరపరుస్తుంది. ఈ రెండూ ఒకదానిపై ఒకటి ఆధారపడి ఉన్నాయని స్పష్టం చేశారు. నేడు ప్రపంచం అభివృద్ధిపర్యావరణ పరిరక్షణ, వ్యక్తిగత స్వేచ్ఛకుటుంబ వ్యవస్థ, మత విశ్వాసం సంఘర్షణ వంటి అనేక వైరుధ్యాలతో సతమతమవుతోందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. ప్రపంచం ప్రస్తుతం అస్తవ్యస్తంగా ఉంది. ఏ ఆనందమూ పరిపూర్ణంగా లభించడం లేదు. ఎక్కడా సమతుల్యత కనిపించడం లేదు, అతివాదం పెచ్చరిల్లుతోందని ఆయన విశ్లేషించారు. ఇలాంటి సంక్లిష్ట పరిస్థితులకు పరిష్కారం కోసం ప్రపంచం భారతదేశం వైపు ఆశగా చూస్తోందని భగవత్ అన్నారు.

ఈ సమస్యల నుంచి గట్టెక్కించే మార్గం భారత్ నుంచే వస్తుందని ప్రపంచ దేశాలకు తెలుసని ఆయన వ్యాఖ్యానించారు. వేదాలు, ఉపనిషత్తులు, రామాయణం, భారతాలు, భగవద్గీతతో పాటు జైన ఆగమాలు, త్రిపిటకాలు, గురు గ్రంథ్ సాహిబ్ వంటి అత్యున్నత జ్ఞాన సంపద మన దేశానికి ఉందని గుర్తుచేశారు. ఈ జ్ఞానాన్ని పుణికిపుచ్చుకున్న వారిని, వారి సంప్రదాయాలను కాపాడటం కేవలం ఒక మతపరమైన బాధ్యత మాత్రమే కాదని, అది సమస్త మానవాళికి చేసే సేవ అని కొనియాడారు. "మీరు కేవలం ఒకరి ప్రాణాన్ని కాపాడటం లేదు, మొత్తం మానవజాతి సురక్షిత భవిష్యత్తును రక్షిస్తున్నారని భగవత్ ఉద్ఘాటించారు.

# హెచ్1బి వీసాఫీజులపై భారతీయ నిపుణులకు మరింత ఊరట

**వాషింగ్టన్, అక్టోబరు 2:** అమెరికాలో హెచ్1బి వీసాలపై ట్రంప్ సర్కార్ విధించిన లక్ష డాలర్ల భారీ ఫీజు విధానానికి మరోసారి చుక్కెదురైంది. ఈ వివాదాస్పద ఫీజు వసూలును తక్షణమే నిలిపివేయాలని రెండో ఫెడరల్ కోర్టు ఆదేశాలు జారీ చేసింది. ఈ తీర్పుతో, హెచ్1బి వీసాలపై ఎక్కువగా ఆధారపడిన భారతీయ నిపుణులకు భారీ ఊరట లభించినట్లయింది. నార్తర్న్ డిస్ట్రిక్ట్ ఆఫ్ కాలిఫోర్నియాకు చెందిన యూఎస్ డిస్ట్రిక్ట్ జడ్జి హేవుడ్ ఎస్.గిలియమ్ జూనియర్ ఈ కీలక తీర్పును వెలువరించారు. ఈ ఫీజును అమలు చేసే క్రమంలో ఫెడరల్ ఏజెన్సీలు అడ్మినిస్ట్రేటివ్ ప్రొసీజర్ యాక్ట్ కింద పాటించాల్సిన నియమ నిబంధనలను విస్మరించాయని కోర్టు స్పష్టం చేసింది. ఆరోగ్య సంరక్షణ సంస్థలు, విద్యాసంస్థలు, తయారీ కంపెనీలు, కార్మిక సంఘాలు కలిసి దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణ జరిపిన కోర్టు ఈ ఆదేశాలిచ్చింది. సెప్టెంబర్ 2025లో అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ జారీ చేసిన ఆదేశాలు, దానిని గత నెలలో పొడిగిస్తూ తీసుకున్న నిర్ణయాలను అమలు చేయకుండా ఈ తీర్పు అడ్డుకుంటుంది. హెచ్1బి వీసాల్లో 71 శాతంతో భారతీయులే అగ్రస్థానంలో ఉన్నందున, ఈ ఫీజు విధానం వారిపై తీవ్ర ప్రభావం చూపింది. ఈ లక్ష డాలర్ల ఫీజు వల్ల భారతీయ పౌరులు తీవ్రంగా నష్టపోయారు. ఇది ఉపాధి అవకాశాలను, కుటుంబాల భవిష్యత్తును ప్రమాదంలో పడేసిందని ఈ కేసులో భాగస్వామి అయిన సౌత్ ఏషియన్ అమెరికన్ జస్టిస్ కొలాబరేటివ్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కల్పనా వి.పెద్దిభొట్ల అన్నారు. అమెరికన్ ఉద్యోగులను రక్షించడానికే ఈ ఆంక్షలు విధించామని ట్రంప్ ప్రభుత్వం వాదిస్తున్నప్పటికీ, కోర్టులు మాత్రం ప్రభుత్వ వాదనతో ఏకీభవించడం లేదు. కాగా, ఈ ఫీజును నిలిపివేయడం ఇది రెండోసారి. గత జూన్‌లో కూడా మసాచుసెట్స్ రాష్ట్రంలోని ఫెడరల్ కోర్టు ఇదే విధమైన తీర్పు ఇచ్చింది. ప్రభుత్వం దానిపై అప్పీల్ చేసినప్పటికీ, ఆ తీర్పుపై స్టే ఇచ్చేందుకు కూడా కోర్టు నిరాకరించింది. తాజా తీర్పుతో ట్రంప్ సర్కార్ విధానానికి మరో న్యాయ పరమైన ఎదురుదెబ్బ తగిలినట్లయింది.

# అమెరికన్ల ఉద్యోగాలు కొల్లగొడుతున్న హెచ్1బి వీసాలు

## వీటిని రద్దుచేస్తే మద్దతిస్తా: ఉపాధ్యక్షుడు జెడివాన్స్



**వాషింగ్టన్, అక్టోబరు 2:** అమెరికాలో ఉద్యోగాలు చేయాలనుకుంటున్న వేలాది మంది భారతీయ నిపుణులకు ఆందోళన కలిగించే పరిణామం చోటుచేసుకుంది. అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ హెచ్1బీ వీసా విధానంపై సంచలన వ్యాఖ్యలు చేశారు. ఈ విధానం పూర్తిగా విఫలమైందని పేర్కొన్న ఆయన, దానిని పూర్తిగా రద్దు చేయడానికి తాను మద్దతిస్తానని స్పష్టం చేశారు. ఈ వ్యాఖ్యలు అమెరికాలో పనిచేస్తున్న, పనిచేయాలని ఆశిస్తున్న భారతీయ టెక్కీలలో తీవ్ర చర్చకు దారితీశాయి. ఎయిర్ ఫోర్స్ టూ విమానంలో ప్రముఖ వ్యాఖ్యాత జాక్ పోసోబిక్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో జేడీ వాన్స్ ఈ కీలక వ్యాఖ్యలు చేశారు. టెక్నాలజీ కంపెనీలు, అకౌంటింగ్ సంస్థలతో పాటు ఇతర యాజమాన్యాలు ఈ వీసా విధానాన్ని పూర్తిగా దుర్వినియోగం చేస్తున్నాయని ఆయన ఆరోపించారు. అమెరికన్ ఉద్యోగుల స్థానంలో తక్కువ జీతాలకు విదేశీ కార్మికులను నియమించుకోవడానికి హెచ్1బీ వీసాలను ఒక సాధనంగా వాడుకుంటున్నారని మండిపడ్డారు. ఈ సందర్భంగా ఆయన ఒక ఉదాహరణను కూడా ప్రస్తావించారు. ఒక అమెరికన్ అకౌంటెంట్ ఏడాదికి 60,000 డాలర్ల జీతం తీసుకుంటుంటే, అతని స్థానంలో హెచ్1బీ వీసాపై వచ్చిన విదేశీయుడిని 45,000 డాలర్లకే నియమించుకుంటున్నారు. ఇది అమెరికన్ ఉద్యోగాలను నాశనం చేయడమే కాకుండా, అమెరికా ప్రజలను మోసం చేయడమే అవుతుందని వాన్స్ వ్యాఖ్యానించారు. అత్యంత నైపుణ్యం కలిగిన నిపుణులను దేశంలోకి తీసుకురావాలనే అసలు ఉద్దేశం దెబ్బతింటోందని ఆయన అన్నారు. ఈ విధానం అమల్లో ఉన్నంత వరకు అమెరికన్ ఉద్యోగుల ప్రయోజనాలను కాపాడటమే తమ ప్రభుత్వ ప్రథమ ప్రాధాన్యత అని వాన్స్ స్పష్టం చేశారు. కాంగ్రెస్ ఈ వ్యవస్థలో సంస్కరణలు తీసుకురావడం అసాధ్యమని భావించిన తర్వాత, గతంలో ట్రంప్ ప్రభుత్వం కొన్ని కొత్త హెచ్1బీ పిటిషన్లపై అధిక ఫీజులు విధించే చర్యలు చేపట్టిందని [illegible] న్యాయపరమైన సవాళ్లను ఎదుర్కొంది.

**భారతీయ టెక్కీలకు షాక్:** అమెరికాలో ప్రత్యేక నైపుణ్యం కలిగిన వృత్తులలో విదేశీయులను నియమించుకోవడానికి హెచ్1బీ వీసాలు అనుమతిస్తాయి. ముఖ్యంగా భారతీయ ఐటీ నిపుణులు ఈ వీసాలపైనే అధికంగా ఆధారపడి ఉన్నారు. ఇప్పుడు ఉపాధ్యక్షుడి స్థాయి నుంచి దీనిని రద్దు చేయాలనే వ్యాఖ్యలు రావడం ప్రాధాన్యం సంతరించుకుంది. వాన్స్ వ్యాఖ్యలకు డొనాల్డ్ ట్రంప్ జూనియర్ బహిరంగంగా మద్దతు తెలపడం ఈ అంశానికి రాజకీయ ప్రాధాన్యతను మరింత పెంచింది. ఈ పరిణామాల నేపథ్యంలో హెచ్1బీ వీసా భవిష్యత్తుపై నీలినీడలు కమ్ముకున్నాయి.

# ఫ్లైదుబాయి కెప్టెన్‌పై దాడి ఇరాన్ పనే..

## అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అనుమానం




**వాషింగ్టన్, అక్టోబరు 2:** ఫ్లైదుబాయ్ విమానంలో భారత సంతతి కెప్టెన్‌పై జరిగిన కత్తిదాడి ఘటనలో ఇరాన్ హస్తం ఉండొచ్చని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సంచలన వ్యాఖ్యలు చేశారు. ఈ విషయంపై దర్యాప్తు ఇంకా కొనసాగుతోందని, అయితే తనకు అందుతున్న ప్రాథమిక సమాచారం ప్రకారం దాడి వెనుక ఇరాన్ ఉండే అవకాశాలు స్పష్టంగా కనిపిస్తున్నాయని ఆయన పేర్కొన్నారు. ఈ ఘటన అంతర్జాతీయంగా తీవ్ర కలకలం రేపడంతో పాటు పశ్చిమాసియా కొత్త ఉద్రిక్తతలకు దారితీసే సూచనలు కనిపిస్తున్నాయి. దుబాయ్ నుంచి టెల్ అవీవ్‌కు వెళుతున్న విమానంలో జరిగిన ఈ దాడికి, ఇరాన్‌కు మధ్య సంబంధంపై విలేకరులు ప్రశ్నించగా ట్రంప్ స్పందించారు. "నాకు అందుతున్న సమాచారాన్ని బట్టి చూస్తే, సమాధానం అవుననే చెబుతాను. కానీ మేము ప్రస్తుతం దానిపై పూర్తిస్థాయిలో పనిచేస్తున్నాం" అని ఆయన అన్నారు. ఇరాన్‌కు చెందిన ఇస్లామిక్ రివల్యూషనరీ గార్డ్ కార్ప్స్ (ఐఆర్‌జీసీ) ఈ కో పైలట్‌ను విమానంలోకి పంపించిందా లేక మరేదైనా మార్గంలో రాడికలైజ్ చేసిందా అని అడగ్గా, "అలా జరిగి ఉండవచ్చు, అవును" అని ట్రంప్ బదులిచ్చారు. ఒకవేళ ఈ దాడి వెనుక ఇరాన్ హస్తం ఉన్నట్లు తేలితే ఆ దేశం తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి ఉంటుందని ఆయన పరోక్షంగా హెచ్చరించారు. అయితే, ఇదే అంశంపై ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహును ప్రశ్నించగా, ఆయన ఆచితూచి స్పందించారు. ఇప్పుడే ఇరాన్ ప్రమేయంపై ఒక నిర్ధారణకు రావడం తొందరపాటు అవుతుందని, దర్యాప్తు పూర్తయ్యే వరకు వేచి చూడాలని అన్నారు. అయితే, దాడికి పాల్పడిన కోపైలట్ ఇస్లామిస్ట్ రాడికలైజేషన్‌కు గురైనట్లు తమ వద్ద ఉన్న ప్రాథమిక ఆధారాలు సూచిస్తున్నాయని ఆయన తెలిపారు. కోపైలట్ వ్యక్తిగత సమాచారాన్ని, అతని నేపథ్యాన్ని లోతుగా పరిశీలిస్తున్నామని, కొన్ని రోజుల్లో ఈ ఘటనపై మరింత స్పష్టత వచ్చే అవకాశం ఉందని నెతన్యాహు వివరించారు. సెప్టెంబర్ 30న ఫ్లైదుబాయ్ విమానందుబాయ్ నుంచి టెల్ అవీవ్‌కు బయలుదేరిన సమయంలో ఈ దారుణ ఘటన చోటుచేసుకుంది. విమానం గాల్లో ఉండగా, ఒమన్ జాతీయుడిగా గుర్తించిన కోపైలట్, కెప్టెన్ స్మిత్ మచ్చర్‌పై అకస్మాత్తుగా కత్తితో దాడికి పాల్పడ్డాడు. ప్రాణాపాయ స్థితిలోనూ కెప్టెన్ స్మిత్ ధైర్యంగా ప్రతిఘటించారు. ఆయన ప్రతిఘటనతో అప్రమత్తమైన ప్రయాణికులు, ఇతర విమాన సిబ్బంది వెంటనే స్పందించి దాడి చేసిన కోపైలట్‌ను పట్టుకుని బంధించారు. అనంతరం విమానాన్ని అత్యవసరంగా సౌదీ అరేబియాలోని తబూక్ నగరంలో సురక్షితంగా ల్యాండ్ చేశారు. ప్రస్తుతం ఈ ఘటనపై పలు దేశాల అధికారులు దర్యాప్తు కొనసాగిస్తున్నారు. దాడికి పాల్పడిన కోపైలట్‌కు ఇరాన్‌తో సంబంధాలు ఉన్నట్లు ఇంతవరకు అధికారికంగా ఎలాంటి ఆధారాలు లభించలేదు. అయితే, అమెరికా అధ్యక్షుడి తాజా వ్యాఖ్యలతో ఈ ఘటనపై దర్యాప్తు మరింత వేగవంతం అయ్యే అవకాశం ఉంది. అబ్రహాం ఒప్పందాల్లో భాగంగా ఇజ్రాయెల్, యూఏఈ మధ్య సంబంధాలు బలపడుతున్న తరుణంలో ఈ దాడి జరగడం అనేక అనుమానాలకు తావిస్తోంది.

# మధ్యప్రాచ్యంలో మరోసారి భీకరపోరుకు అమెరికా సమాయత్తం

**వాషింగ్టన్, అక్టోబరు 2:** మధ్యప్రాచ్యంలో మరోసారి యుద్ధ మేఘాలు దట్టంగా అలుముకుంటున్నాయి. ఇరాన్‌పై మరింత కఠినంగా వ్యవహరించేందుకు అమెరికా వేగంగా పావులు కదుపుతోంది. ఈ క్రమంలోనే ఏకంగా 9,000 మందికి పైగా సైనికులను యుద్ధనౌకల్లో మిడిల్ ఈస్ట్‌కు తరలిస్తున్నట్లు ఒక అమెరికా అధికారి తెలిపారు. యుఎస్ఎస్ థియోడోర్ రూజ్‌వెల్ట్ క్యారియర్ స్ట్రైక్ గ్రూప్, యుఎస్ఎస్ మేకిన్ ఐలాండ్ యాంఫిబియస్ రెడీనెస్ గ్రూప్‌లతో పాటు యుఎస్ఎస్ చోసిన్, యుఎస్ఎస్ జాన్ పి.ముర్తా, యుఎస్ఎస్ యాంకోరేజ్ వంటి కీలక యుద్ధనౌకలు ఈ కేటాయింపుల్లో ఉన్నాయి. ఇప్పటికే ఆ ప్రాంతంలో యుఎస్ఎస్ జార్జ్ హెచ్.డబ్ల్యూ. బుష్, యుఎస్ఎస్ జార్జ్ వాషింగ్టన్ విమాన వాహక నౌకలతో పాటు యుఎస్ఎస్ బాక్సర్ గ్రూప్ ఉన్నాయి. గతంలో సుదీర్ఘకాలం మోహరించిన విమాన వాహక నౌక యుఎస్ఎస్ అబ్రహాం లింకన్ స్థానంలో, పసిఫిక్ మహాసముద్రం నుంచి జార్జ్ వాషింగ్టన్‌ను ఇక్కడికి తరలించారు.

# మెట్రో, ఎక్స్‌ప్రెస్ సర్వీసులకు విస్తరించిన ఉచిత ప్రయాణం

## తమిళనాట సిఎం విజయ్ స్వయంగా టికెట్లు జారీ చేసిన వైనం



**చెన్నై,అక్టోబరు 2:** తమిళనాడు ముఖ్యమంత్రి సి. జోసెఫ్ విజయ్ మహిళల కోసం ఉచిత బస్సు ప్రయాణ పథకాన్ని మరింత విస్తరించారు. గాంధీ జయంతిని పురస్కరించుకుని నేడు వెట్రి పయనం పేరుతో ఈ విస్తృత పథకాన్ని ఆయన ప్రారంభించారు. చెన్నైలోని కోయంబేడు బస్ టెర్మినస్‌లో జరిగిన కార్యక్రమంలో సీఎం స్వయంగా మహిళా ప్రయాణికులకు ఉచిత టికెట్లు అందజేసి పథకాన్ని లాంఛనంగా ప్రారంభించారు. ఇప్పటివరకు సాధారణ సిటీ, టౌన్ బస్సులకే పరిమితమైన ఈ పథకాన్ని ఇప్పుడు మరిన్ని సర్వీసులకు వర్తింపజేశారు. దీని ప్రకారం, ఇకపై మెట్రోపాలిటన్, పట్టణ ప్రాంతాల్లో నడిచే ఎక్స్‌ప్రెస్, లిమిటెడ్ స్టాప్ సర్వీస్ (ఎల్ఎస్ఎస్), డీలక్స్ బస్సుల్లో కూడా మహిళలు ఉచితంగా ప్రయాణించవచ్చు. అలాగే 40 కిలోమీటర్లు దాటిన మొఫుసిల్ ఆర్డినరీ, కొండ ప్రాంతాల్లోని ఆర్డినరీ బస్సులకు కూడా ఈ పథకం వర్తిస్తుంది. ఈ విస్తరణతో రాష్ట్రంలోని ఏడు ప్రభుత్వ రవాణా సంస్థలకు చెందిన మొత్తం 12,692 బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యం అందుబాటులోకి వచ్చింది. ఇది మొత్తం బస్సుల్లో సుమారు 69 శాతం. ఈ పథకం ద్వారా ప్రతిరోజూ సుమారు 84.32 లక్షల మంది మహిళలు లబ్ధి పొందుతారని అంచనా వేస్తున్నారు. ఉద్యోగాలు, కళాశాలలు, ఇతర పనుల కోసం ప్రయాణించే మహిళల ఖర్చులను తగ్గించడమే ఈ పథకం ముఖ్య ఉద్దేశం. దీనికి ఎలాంటి ఆదాయ పరిమితి గానీ, ప్రయాణాలపై పరిమితి గానీ లేదు. మహిళలతో పాటు ట్రాన్స్‌జెండర్లకు కూడా ఈ సౌకర్యం వర్తిస్తుంది. అయితే, స్టేట్ ఎక్స్‌ప్రెస్ ట్రాన్స్‌పోర్ట్ కార్పొరేషన్ (ఎస్ఈటీసీ) బస్సులకు ఈ పథకం నుంచి మినహాయింపు ఇచ్చారు.

# సంక్షిప్త వార్తలు

## ఇడి మనీలాండరింగ్ కేసులో మమత పేరు

**కోల్‌కత్తా, అక్టోబరు 2:** మనీలాండరింగ్ కేసుకు సంబంధించి ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) విడుదల చేసిన ఒక ప్రకటనలో బెంగాల్ మాజీ సిఎం మమతా బెనర్జీ, మాజీమంత్రి ఇంద్రనీల్ సేన్ పేర్లను ప్రస్తావించింది. ఇంద్రనీల్ సేన్‌కు చెందిన ఆక్టేవ్ రికార్డ్ అనే సంస్థ ఖాతా నుంచి మమత బెనర్జీ బ్యాంకుఖాతాలోకి దాదాపు రూ.30లక్షలు బదిలీ అయినట్లు ఈడీ తన ప్రకటనలో పేర్కొనడం తీవ్ర చర్చనీయాంశంగా మారింది. ఈ నగదు బదిలీపై ఇంద్రనీల్ సేన్‌ను ప్రశ్నించగా, ఆ మొత్తాన్ని రాయల్టీ రూపంలోనే మమతకు చెల్లించానని ఆయన చెప్పినట్లు ఈడీ వెల్లడించింది.

## టిఎంసిని కాంగ్రెస్ పార్టీలో విలీనం చేయాలి: అధిర్‌రంజన్ చౌదరి




**కోల్‌కతా, అక్టోబరు 2:** పశ్చిమ బెంగాల్ రాజకీయాల్లో ఆసక్తికర పరిణామం చోటుచేసుకుంది. తృణమూల్ కాంగ్రెస్ (టీఎంసీ) అధినేత్రి,మాజీ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ తన పార్టీని కాంగ్రెస్‌లో విలీనం చేయాలని కాంగ్రెస్ సీనియర్ నేత అధీర్ రంజన్ చౌదరి బహిరంగంగా పిలుపునిచ్చారు. పార్టీలో చేరే ముందు ఆమె తనకున్న భారాన్ని వదిలించుకోవాలని షరతు పెట్టడం రాజకీయ వర్గాల్లో తీవ్ర చర్చనీయాంశమైంది. కోల్‌కతాలో మీడియాతో మాట్లాడిన అధీర్ రంజన్ చౌదరి.. మమతకు ఈ ఆఫర్ ఇచ్చారు.

## బంకాట్ చెరువులో మునిగి నలుగురు బాలికలు మృతి



**బంకాట్, అక్టోబరు 2:** బిహార్‌లో విషాదం జరిగింది. ఒక బిహార్, ఈస్ట్ చంపారన్ జిల్లా, ఇనర్వ భార్ పంచాయత్ పరిధిలోని బంకాట్ గ్రామంలో చెరువులో మునిగిన నలుగురు బాలికలు ప్రాణాలు కోల్పోయారు. శుక్రవారం జరిగిన ఈ ఘటనకు సంబంధించిన వివరాల్ని పహర్‌పూర్ పోలీస్ స్టేషన్ పోలీసులు వెల్లడించారు. బంకాట్ గ్రామానికి చెందిన ఐదుగురు బాలికలు స్థానిక చెరువుకు ఉదయం 9.30 గంటల సమయంలో స్నానం చేసేందుకు వెళ్లారు. ఐదుగురు బాలికలలో నలుగురు నీటిలోకి వెళ్లగా ఒక బాలిక ఒడ్డునే ఉండిపోయింది. లోపలికి వెళ్లిన బాలికలు లోతును అంచనా వేయలేకపోయారు. అలా ఇంకా నీటిలోకి వెళ్లి మునిగిపోయారు.

## భారత్ మిషన్‌శక్తితో యుఎస్ నిఘా వ్యవస్థ అప్రమత్తం



**వాషింగ్టన్, అక్టోబరు 2:** భారత్ 2019లో చేపట్టిన మిషన్ శక్తి యాంటీ శాటిలైట్ టెస్ట్ అమెరికాలో కంగారు పెట్టించిందని, ఈ టెస్టుతో యూఎస్ ఇంటెలిజెన్స్ వర్గాలు ఊహించని విధంగా అప్రమత్తమయ్యాయని మాజీ యూఎస్ ఎయిర్‌ఫోర్స్ ఇంటెలిజెన్స్ అధికారి డేవిడ్ గ్రుష్ వెల్లడించారు. జోరోగన్ పాడ్‌కాస్ట్‌లో మాట్లాడినగ్రుష్ తాను ఆ సమయంలో అమెరికా నేషనల్ రీకనైసెన్స్ ఆఫీస్‌లో ఆపరేషన్ సెంటర్‌లో డ్యూటీలోఉన్నానని తెలిపారు. 2019లో భారత్ ఊహించని విధంగా మిసైల్ టెస్ట్‌చేసింది.తన శాటిలైట్‌లలో ఒకదాన్ని లక్ష్యంగా చేసుకుని కూల్చేసింది.

## ఉక్రెయిన్ శాంతి కోసం మోడీ ప్రయత్నాలను ప్రశంసించిన పుతిన్

**మాస్కో, అక్టోబరు 2:** ఉక్రెయిన్ వివాదానికి శాంతియుత పరిష్కారం కోసం ప్రధాని నరేంద్ర మోడీ చేస్తున్న ప్రయత్నాలను రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ ప్రశంసించారు. మోడీకి చాలా మంచి ఆలోచనలు ఉన్నాయని పేర్కొన్న పుతిన్, ఇరుపక్షాలకు ఆమోదయోగ్యమైన పరిష్కారాలను కనుగొనేందుకు ఆయన ఆసక్తి చూపుతున్నారన్నారు. రష్యాభారత్ మధ్య మంచి, స్నేహ పూర్వక సంబంధాలు ఉన్నప్పటికీ ప్రధాని మోడీ ప్రతి సందర్భంలోనూ ఉక్రెయిన్‌లో కొనసాగుతున్న సంఘర్షణకు ముగింపు పలకాల్సిన అవసరాన్ని ప్రస్తావిస్తున్నారని పుతిన్ చెప్పారు.

## రూ.50వేలు కట్నం తెస్తేనే టాయిలెట్ వాడుకో..



**భదోహి, యుపి, అక్టోబరు 2:** పుట్టింటి నుంచి రూ.50 వేలు కట్నం తెచ్చేవరకూ ఇంట్లో టాయిలెట్ వాడకూడదని అత్తింటి వేధింపులు ఓకోడలిని భరించలేకుండా చేసాయి. ఉత్తరప్రదేశ్‌లోని భదోహిలో వెలుగుచూసిన ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేశారు. భదోహిలోని రోషన్ తారా ప్రాంతానికి చెందిన షబ్నమ్ (20) తన అత్తింటి వారిపై పోలీసులకు ఫిర్యాదు చేసింది. సెప్టెంబరు మొదటి వారంలో తన తండ్రి నుంచి రూ.50 వేలు తీసుకురావాలని అత్తింటివారు డిమాండ్ చేశారని తాను నిరాకరించడంతో వేధింపులు మొదలయ్యాయని ఆమె ఆరోపించింది.



గాంధీజయంతి, లాల్‌బహదూర్‌శాస్త్రి జయంతి సందర్భంగా శుక్రవారం వారి చిత్రపటాల వద్ద ఘనంగా నివాళులర్పిస్తున్న గవర్నర్ శివ్ ప్రతాప్ శుక్లా

# గ్రామసభ తీర్మానాలు ప్రణాళికా బద్ధంగా అమలు

## గాంధీజయంతి సందర్భంగా రాష్ట్రవ్యాప్తంగా గ్రామసభలు సక్సెస్ : మంత్రి సీతక్క



**హైదరాబాద్,అక్టోబరు2,ప్రభాతవార్త:** మహాత్మా గాంధీ జయంతి సందర్భంగా రాష్ట్రంలోని అన్ని గ్రామ పంచాయతీల్లో శుక్రవారం ప్రత్యేక గ్రామసభలను నిర్వహించారు. గ్రామాభివృద్ధిలో ప్రజల భాగస్వామ్యాన్ని పెంచడం, గ్రామాల అవసరాలు, అందుబాటులో ఉన్న వనరులను గుర్తించడం, రాబోయే కాలానికి సమగ్ర అభివృద్ధి ప్రణాళికను రూపొందించడం లక్ష్యంగా గ్రామసభలను నిర్వహించారు. గాంధీజీ కలలుగన్న గ్రామ స్వరాజ్య స్ఫూర్తితో పల్లెల్లో ప్రత్యేక గ్రామసభలను పండగ వాతావరణంలో నిర్వహించారు. గ్రామాల్లో రంగురంగుల ముగ్గులు వేసి వాటిపై గ్రామ పటాలను రూపొందించారు. గ్రామంలోని రహదారులు, తాగునీటి వనరులు, పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలు, పారిశుధ్య సదుపాయాలు, సాగునీటి వనరులు, ఇతర మౌలిక వసతులతో పాటు అవసరమైన అభివృద్ధి పనులను ఈ గ్రామ పటాల్లో పొందుపరిచారు. ప్రత్యేక గ్రామసభల్లో గ్రామ ప్రజల అవసరాలు, సమస్యలు, ప్రాధాన్య తలను గుర్తించి వాటి పై విస్తృ తంగా చర్చించారు. రాబోయే ఆర్థిక సంవ త్సరానికి గ్రామ పంచాయతీ అభివృద్ధి ప్రణాళిక (జిపిడిపి) రూపకల్పనలో ప్రజల సూచనలను పరిగణనలోకి తీసుకున్నారు. అందుబాటులో ఉన్న వన రులు, వివిధ శాఖల పథకాలను సమన్వయం చేసుకుని గ్రామానికి అవసరమైన పనులకు ప్రాధాన్యత ఇవ్వాలని నిర్ణయించారు. గ్రామసభల్లో తాగునీరు, పారిశుధ్యం, రోడ్లు, డ్రైనేజీ, వర్షపు నీటి సంరక్షణ, ఉపాధి, జీవనోపాధి, మహిళా స్వయం సహాయక సంఘాల బలోపేతం, వ్యవసాయం తదితర అంశాలపై చర్చించారు. గ్రామ అవసరాలకు అనుగుణంగా వివిధ శాఖల పథకాలను సమన్వయం చేసి అభివృద్ధి ప్రణాళి కలో చేర్చేలా చర్యలు చేపట్టారు. ప్రత్యేక గ్రామసభలకు ఎమ్మె ల్యేలు, ఉన్నతాధికారులు, జిల్లా అధికారులు, ప్రజాప్రతి నిధులు, పంచాయతీ కార్యదర్శులు, సంబంధిత శాఖల అధికారులు హాజరై ప్రజల నుంచి సూచనలు, అభిప్రాయాలను స్వీకరించారు. గ్రామాభివృద్ధిలో ప్రజలను భాగస్వా ములను చేస్తూ పారదర్శకంగా ప్రణాళికలు రూపొందించాల్సిన అవసరాన్ని అధికారులు వివరించారు. ప్రత్యేక గ్రామసభల్లో ప్రజలు చేసిన సూచనలు, తీసుకున్న తీర్మానాలను కేవలం కాగితాలకే పరిమితం చేయకుండా ప్రణాళికా బద్ధంగా అమలు చేయాలని మంత్రి సీతక్క అధికారులను ఆదేశించారు. గ్రామసభలో గుర్తిం చిన అవసరాలను ప్రతిబింబించాలని, అందు బాటులో ఉన్న నిధులు, ప్రభుత్వ పథకాలు, శాఖల సమన్వయంతో ప్రాధాన్యతా పనులను పూర్తి చేయాలని సూచించారు. గ్రామ సభల్లో తీసుకున్న నిర్ణయాల అమలులో పార దర్శకత, జవాబుదారీతనం పాటించాలని, ప్రజలకు సమాచారం అందు బాటులో ఉండేలా చూడాలని మంత్రి సీతక్క స్పష్టం చేశారు. ప్రజల భాగస్వామ్యంతో గ్రామాల అవసరాలను గుర్తించి, స్థానిక వనరులను సద్వినియోగం చేసుకుంటూ రూపొందించే గ్రామాభివృద్ధి ప్రణాళికలు అభివృద్ధికి దోహదం.

# గాంధీ భవన్‌లో మహాత్మా గాంధీ, లాల్ బహదూర్ శాస్త్రి జయంతి వేడుకలు

**హైదరాబాద్,అక్టోబరు 2,ప్రభాతవార్త:** సత్యాగ్రహం అహింసా సహాయనిరాకరణ అనే ఆయుధంతో భారత దేశానికి మహాత్మాగాంధీ స్వేచ్ఛను ప్రసాదించి మతోన్మాదుల ఉన్మాదంకు బలైనారని టిపిసిసి చీఫ్ మహేష్‌కుమార్ గౌడ్ గుర్తుచేసుకొంటూ నివాళులు అర్పించారు. హైదరాబాద్ గాంధీభవన్‌లో జాతిపిత మహాత్మ గాంధీ మాజీ ప్రధాని లాల్ బహదూర్ శాస్త్రీ జన్మదిన వేడుకలు ఘనంగా శుక్రవారం నిర్వహించారు. మహాత్మాగాంధీ,లాల్‌బహదూర్ చిత్రపటాలకు టిపిసిసి చీఫ్ ఎమ్మెల్సీ మహేష్ కుమార్‌గౌడ్, డిప్యూటి సిఎం భట్టివిక్రమార్క, హైదరాబాద్ ఇంచార్జ్ మంత్రి పొన్నం ప్రభాకర్ మంత్రులు వివేక్ వెంకటస్వామి, అజారుద్దీన్ తదితరులు పుష్పాంజలి సమర్పించారు. మహేష్ కుమార్ మాట్లాడుతూ మహాత్మాగాంధీతోపాటు ఇదేరోజు భారత రెండవ ప్రధానమంత్రి లాల్ బహదూర్ శ్రాస్తీ కూడా జన్మించారని ఆయన పాకిస్తాన్‌తో వీరోచితంగా పోరాటం చేసి జై జెవాన్,జైకిసాన్ అంటూ దేశాన్ని రక్షణగా ఉండే సైనికుడికి ప్రజలకు పట్టెడు అన్నం పెట్టే రైతును గౌరవించాలని ప్రజలకు నేర్పారని అన్నారు. గాంధీ కోరిన సామాజిక సమానత్వం, శాంతి, సౌభ్రాతృత్వం, అహింసా మార్గాలు మనదేశంలో ప్రజలు ఆచరించాలని దీనితో ప్రపంచశాంతి జరుగుతుందని ఉద్బోదించారు. ఇద్దరు మహనీయులు ఆదర్శమూర్తులని వారి ఆశయాలను ఆచరణ చేయడమే మనం వారికి ఇచ్చే నిజమైన నివాళి అని పిలుపునిచ్చారు. ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మాట్లాడుతూ గాంధీజీ చూపిన మార్గంలో ప్రజాస్వామ్య విలువలను కాపాడుతూ సమాజ అభివృద్ధికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని అన్నారు. మహాత్మా గాంధీ సత్యనిష్ఠతో సామాజిక సమానత్వం కోసం చేసిన కృషిని స్మరించుకున్నారు. అలాగే దేశ సేవకు అంకితమైన లాల్ బహదూర్ శాస్త్రీ దేశప్రాదేశిక సమగ్రత కోసం అవసరమైతే యుద్ధం చేస్తామని శత్రువుకు బలమైన సంకేతం పంపారని గుర్తుచేసుకొన్నారు. ఈ కార్యక్రమంలో టిపిసిసి వైస్ ప్రెసిడెంట్లు, జనరల్ సెక్రటరీలు, పలువురు డిసిసి అధ్యక్షులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# చైనా క్యాంపస్ పేరుతో జరుగుతున్న తప్పుడు ప్రచారాన్ని నమ్మవద్దు, శ్రీ చైతన్య విద్యా సంస్థల స్పష్టీకరణ

**హైదరాబాద్,అక్టోబరు2,ప్రభాతవార్త:**శ్రీచైతన్య విద్యాసంస్థలు నారాయణ విద్యాసంస్థల మధ్య చైనా క్యాంపస్ పేరుతో భాగస్వామ్యం, ఒప్పందం కుదిరిందంటూ సామాజిక మాధ్యమాల్లో జరుగుతున్న ప్రచారం పూర్తిగా తప్పుడు, నిరాధారమైనదని శ్రీచైతన్య విద్యాసంస్థలు స్పష్టం చేశాయి. ఈ మేరకు శ్రీచైతన్య విద్యాసంస్థల డైరెక్టర్ శ్రీధర్ ఒక ప్రకటనలో పేర్కొంటూ సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న పోస్టర్లు, సందేశాలు, ఇతర ప్రచార సమాచారానికి శ్రీచైతన్య విద్యాసంస్థలకు ఎలాంటి సంబంధం లేదని తెలిపారు. "శ్రీచైతన్య విద్యాసంస్థలు చైనా క్యాంపస్ పేరుతో ఎటువంటి సంస్థతోనూ భాగస్వామ్యం లేదా ఒప్పందం కుదుర్చుకోలేదు. ప్రస్తుతం అలాంటి ఒప్పందానికి సంబంధించిన ఎలాంటి ప్రతిపాదన కూడా మా పరిశీలనలో లేదు" అని ఆయన స్పష్టం చేశారు. అలాగే, శ్రీచైతన్య విద్యాసంస్థల పేరు, లోగో, బ్రాండ్ గుర్తింపు లేదా అధికారిక సమాచారాన్ని అనుమతి లేకుండా ఉపయోగించి తప్పుడు ప్రచారం చేయడం తీవ్రంగా పరిగణించాల్సిన అంశమని ఆయన పేర్కొన్నారు. విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉద్యోగులు,ప్రజలు సోషల్ మీడియాలో ప్రసారం అవుతున్న ఇలాంటి ధృవీకరించని సమాచారాన్ని నమ్మకుండా, అప్రమత్తంగా ఉండాలని శ్రీధర్ విజ్ఞప్తి చేశారు.శ్రీచైతన్య విద్యాసంస్థలకు సంబంధించిన ఏదైనా కొత్త కార్యక్రమం, భాగస్వామ్యం, ఒప్పందం లేదా అధికారిక ప్రకటనను సంస్థ తన అధికారిక కమ్యూనికేషన్ ఛానళ్ల ద్వారా మాత్రమే ప్రకటిస్తుందని ఆయన స్పష్టం చేశారు. ప్రజలు, తల్లిదండ్రులు అధికారిక సమాచారం కోసం శ్రీచైతన్య విద్యాసంస్థల అధికారిక మాధ్యమాలను మాత్రమే అనుసరించాలని ఆయన సూచించారు.

# కులగణనతోనే దేశంలోని అన్నివర్గాలకు న్యాయం

## - టిపిసిసి చీఫ్ మహేష్‌కుమార్‌గౌడ్

### కులగణన సాధనకై భారీ బహిరంగ సభ పోస్టర్ ఆవిష్కరణ



శుక్రవారం భారీ బహిరంగ సభ పోస్టర్‌ను టిపిసిసి అధ్యక్షుడు, మహేష్ కుమార్ గౌడ్ ఆవిష్కరించిన దృశ్యం

**హైదరాబాద్,అక్టోబరు2,ప్రభాతవార్త:** కులగణనతోనే దేశంలోని అణగారిన వర్గాల నుంచి మొదలు కొని అన్ని వర్గాలకు సమన్యాయం జరుగు తోందని టిపిసిసిచీఫ్ మహేష్‌కుమార్ గౌడ్ అన్నారు. టిపిసిసి ఒబిసి డిపార్ట్‌మెంట్ ఆధ్వర్యంలో జాతీయ జనగణనలో ఒబిసి కులాల గణనను చేపట్టాలని డిమాండ్ చేస్తూ నిర్వహించనున్న భారీ బహిరంగ సభ పోస్టర్‌ను టిపిసిసి అధ్యక్షులు, ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్ తన నివాసంలో శుక్రవారం ఆవిష్కరించారు. ఒబిసి వర్గాలకు జనాభా ప్రాతిపదికన న్యాయం, సమాన అవకాశాలు, హక్కులు కల్పించేందుకు కులగణన అత్యంత కీలకమని ఈ సందర్భంగా ఆయన పేర్కొన్నారు. దేశవ్యాప్తంగా ఒబిసి ల సామాజిక, ఆర్థిక, విద్యా పరిస్థితులపై సమగ్ర సమాచారం అందుబాటులోకి రావాలంటే జనగణనలో కులాల వివరాలను సేకరించాల్సిన అవసరం ఉందన్నారు. ఒబిసి కులగణన సాధన కోసం నిర్వహించనున్న భారీ బహిరంగ సభను విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు.

ప్రజలు,కాంగ్రెస్ కార్యకర్తలు, ప్రజాసంఘాలు వెనుకబడిన తరగతులు, దళిత బహుజనుల హక్కుల కోసం ఐక్యంగా ఉద్యమించాలని కోరారు. ఈ కార్యక్రమంలో టిపిసిసి ఒబిసి డిపార్ట్‌మెంట్ నాయకులు, కాంగ్రెస్ పార్టీ ప్రజా ప్రతినిధులు, ముఖ్య నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# టిబిపై పోరాటం ప్రజా ఉద్యమంగా మారాలి

## వ్యాధితో పోరాడాలి.. రోగితో కాదు: గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా

**హైదరాబాద్,అక్టోబరు2,ప్రభాతవార్త:**టీబీ నిర్మూలనకు ప్రజల భాగస్వామ్యం అవసరమని రాష్ట్ర గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా అన్నారు. వ్యాధితో పోరాడాలి తప్ప.. రోగితో కాదని, టీబీపై ఉన్న అపోహలు, సామాజిక వివక్షను తొలగించాలని పిలుపునిచ్చారు.గాంధీ జయంతి సందర్భంగా తెలంగాణ టీబీ అసోసియేషన్ నిర్వహించిన క్షయ రోగ సంఘం నిర్వహించిన 77వ టీబీ సీల్,సేల్ ప్రచారాన్ని ఆయన లోక్ భవన్ వేదికగా ప్రారంభించారు. టీబీ సీల్ సేల్ బాధితుల పట్ల మనకున్న మానవత్వానికి, సామాజిక బాధ్యతకు నిదర్శనమని పేర్కొన్నారు.ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలో టీబీ నిర్మూలనను ప్రజా ఉద్యమంగా మార్చారని, నిక్షయ్ మిత్ర ద్వారా టీబీ బాధితులకు పోషకాహారం, సహకారం అందిస్తున్నారని తెలిపారు. తెలంగాణలో 2025లో సుమారు 90 శాతం చికిత్స విజయవంతమైనప్పటికీ, వంద శాతం విజయాన్ని లక్ష్యంగా పెట్టుకోవాలని గవర్నర్ సూచించారు. తన జిల్లా పర్యటనల్లో కలెక్టర్లు, వైద్యాధికారులతో టీబీ నిర్మూలనపై సమీక్షలు నిర్వహించినట్లు తెలిపారు. లోక్‌భవన్ ప్రజా సంక్షేమ కార్యక్రమాలకు ఉత్ప్రేరకంగా, సమన్వయ కేంద్రంగా పనిచేస్తుందని చెప్పారు. మారుమూల, గిరిజన ప్రాంతాల్లో మొబైల్ వాహనాల ద్వారా డిజిటల్ ఎక్స్ రే, యాక్టివ్ కేస్ ఫైండింగ్ కార్యక్రమాలు నిర్వహిస్తున్న తెలంగాణ క్షయ రోగ సంఘం సేవలను గవర్నర్ అభినందించారు. టీబీ చికిత్సలో మందులతో పాటు పోషకాహారం, సామాజిక గౌరవం కూడా కీలకమని పేర్కొన్నారు. ప్రజలు 77వ టీబీ సీల్ ప్రచారానికి విరివిగా విరాళాలు అందించాలని, నిక్షయ్ మిత్రలుగా చేరి కనీసం ఒక రోగికి ఆరు నెలల పాటు పోషకాహారం అందించాలని కోరారు. యువత, విద్యార్థులు ఆరోగ్య దూతలుగా మారి టీబీ లక్షణాలపై అవగాహన కల్పించాలని సూచించారు.టీబీ హారేగా.. తెలంగాణ జీతేగా! టీబీ హారేగా.. దేశ్ జీతేగా అని గవర్నర్ పిలుపునిచ్చారు కార్యక్రమంలో తెలంగాణ క్షయ రోగ సంఘం ఉపాధ్యక్షుడు డా. సి.ఎన్. ప్రసాద్, ప్రధాన కార్యదర్శి డి. బాలచంద్ర, సంయుక్త సంచాలకులు డా. సి. సుమలత, గవర్నర్ సంయుక్త కార్యదర్శి శశి కిరణాచారి తదితరులు పాల్గొన్నారు.

# అక్రమాస్తులను తెలంగాణ ఉద్యమకారుల కుటుంబాలకు పంపిణీ చేయాలి

## కెటిఆర్‌కు దమ్ముంటే తానే ముఖ్యమంత్రి అభ్యర్థిగా ప్రకటించుకోవాలి

### - ప్రభుత్వ విప్‌లు అద్దంకి దయాకర్, బీర్ల ఐలయ్య

**హైదరాబాద్,అక్టోబరు2,ప్రభాతవార్త:** కల్వకుంట్ల కుటుంబం అంటేనే తెలంగాణ కబ్జాదారులు,దోపిడిదారులనీ వారి పాలనలో దురాక్రమణ చేసిన అక్రమాస్తులను తెలంగాణ ఉద్యమకారుల కుటుంబాలకు పంపిణీ చేయాలని ప్రభుత్వ విప్ అద్దంకి దయాకర్, బీర్ల ఐలయ్యలు డిమాండ్ చేశారు.సిఎల్‌పి కార్యాలయంలో విలేఖరులతో మాట్లాడుతూ కెటిఆర్ కు దమ్ముంటే తానే ముఖ్యమంత్రి అభ్యర్థి అని ప్రకటించుకోవాలనీ సవాల్ చేశారు. కెటిఆర్ ముఖ్యమంత్రి అని ప్రకటించిన మరుక్షణం హరీష్ రావు తిరుగుబాటు చేస్తడు బిఆర్‌ఎస్ పార్టీ కుప్పకూలిపోతుందనీ ఆశాభావం వ్యక్తంచేశారు.అద్దంకి దయాకర్ మాట్లాడుతూ ఆస్తుల అంశం నుంచి తప్పించుకోవడానికి బిఆర్ఎస్ నాయకులు ప్రయత్నం చేస్తున్నారనీ కల్వకుంట్ల కుటుంబానికి ఆస్తులు ఎలా వచ్చాయన్న ప్రశ్నకు సమాధానం చెప్పడం లేదనీ ఆగ్రహం వ్యక్తంచేశారు. అసైన్డ్ భూములు, ప్రభుత్వ భూములను ఎలా తీసుకున్నారన్న ప్రశ్నలకు సమాధానం లేదని ఆవేదన చెందారు. జన్వాడ ఫామ్ హౌస్ లో కెటిఆర్ భార్య, అత్తకు భూములున్నాయనీ చెప్పారు. జన్వాడ ఫామ్ హౌస్ నా ఫ్రెండ్ ది అని కెటిఆర్ బుకాయిస్తున్నారని అన్నారు. బిఆర్ఎస్ నాయకులు అధికార దుర్వినియోగం చేసి అక్రమ ఆస్తులను సంపాదించారనీ ఆరోపించారు.ఉండటానికి ఇళ్లు లేదని చెప్పిన వారికి 190 గదులున్న ఫైవ్ స్టార్ హోటల్స్ ఎలా వచ్చాయనీ అడిగారు. బతకడానికి వ్యాపారాలు చేయొద్దా అని కెటిఆర్ బుకాయిస్తున్నాడనీ చెప్పారు. కేవలం కల్వకుంట్ల కుటుంబం ఆస్తులు మాత్రమే వేల శాతం ఎలా పెరిగాయి..? మిగిలిన రాజకీయ పార్టీల నాయకుల ఆస్తులు ఎందుకు పెరగలేదు.. ? కల్వకుంట్ల కుటుంబం సుద్దపూసల్లా మాట్లాడుతోందనీ ఆయన ఎద్దేవా చేశారు. మీ సుద్దులను తెలంగాణ ప్రజలు వినరు..నమ్మరు..అని అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సంపాదించలేదా అని పిచ్చి మాటలు బిఆర్ఎస్ నాయకులు మాట్లాడుతున్నారనీ ఆవేదన చెందారు రేవంత్ రెడ్డి తన ఇరవై ఏళ్ల రాజకీయ జీవితంలో 17 ఏళ్ల పాటు ప్రతిపక్షంలోనే ఉన్నారనీ. ఆయన ఇంట్లో ఆదాయ పన్ను శాఖ అధికారులు ఆ నాడు సోదాలు చేయలేదా..?అని ప్రశ్నించారు. మీ ఆస్తులను స్వచ్ఛందంగా కల్వకుంట్ల కుటుంబం ప్రకటించాలనీ వాటి ఆదాయ వనరులు కూడా చూపాలని కోరారు. ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య మాట్లాడుతూ తెలంగాణ వ్యాప్తంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రభుత్వానికి ప్రజల నుంచి వస్తున్న ఆదరణను చూసి ఓర్వలేక కెటిఆర్ హరీష్ రావు తప్పుడు ప్రచారం చేస్తున్నారనీ ఆవేదన చెందారు.ప్రజాప్రభుత్వం ఏర్పడిన వారం రోజుల నుంచి దుష్ప్రచారం చేస్తున్నారనీ ఆగ్రహం చెందారు.. ముఖ్యమంత్రి పదవి కోసం హరీష్ రావు, కెటిఆర్ పగటి కలలు కంటున్నారనీ ఎద్దేవా చేశారు. కల్వకుంట్ల కుటుంబ దోపిడిని అసెంబ్లీ సాక్షిగా మా సిఎం రేవంత్ రెడ్డి బయటపెట్టారనీ మా రేవంత్‌రెడ్డి ప్రశ్నలకు సమాధానం చెప్పలేక చిల్లర మల్లర మాటలు మాట్లాడుతున్నారనీ విమర్శించారు.. సిరిసిల్ల సభ విజయవంతం కావడంతో భరించలేకపోతున్నారనీ అన్నారు. కెసిఆర్ ను ఫామ్ హౌస్ కు పంపించింది నల్లమల్ల పులి రేవంత్ రెడ్డినే అని గుర్తుచేశారు. 2014 కు ముందు మీ ఆస్తులెంత..? అధికారంలోకి వచ్చాక వచ్చిన ఆస్తులెన్ని..అని అడిగారు. పేద కెటిఆర్‌కు ఉండటానికి ఇళ్లు లేదంట.. హైదరాబాద్ నడి బొడ్డులో 5 వేల కోట్ల విలువ చేసే ఫైవ్ స్టార్ హోటళ్లు ఉన్నాయనీ ఎకసెక్కాలు చేశారు. 410 గదులుంటే నేను, మా అయ్య ఉండటానికి ఇళ్లు లేదని సిగ్గులేకుండా కెటిఆర్ చెపుతున్నాడనీ తేలుకుంట్ల శ్రీధర్, పట్టాభిరామారావును బెదిరించి హోటల్‌లో 25 శాతం వాటా తీసుకున్నారని ఆరోపించారు..గత ప్రభుత్వంలో గొర్రెలు, బర్రెలు, చేపల స్కాంలు చేశారనీ.. తెలంగాణ ఏ గ్రామం పోయినా బిఆర్ఎస్ నాయకులను రాళ్లతో కొడతారనీ అన్నారు. ఎల్ నీనో తో వచ్చిన కరువును కూడా కాంగ్రెస్ పేరుతో దుష్ప్రచారం చేస్తున్నారనీ విమర్శించారు.. మంత్రిగా ఉన్నప్పుడు కెటిఆర్ అంగన్ వాడీ కార్యకర్తలతో వంగి వంగి దండాలు పెట్టించుకున్నాడనీ గుర్తుచేశారు. ముఖ్యమంత్రి సభ పెడితే పోలీసులు ఉండటం సహజమనీ సిద్దిపేట, గజ్వేల్ లో కూడా లక్షలాది మంది సభ పెట్టి మిమ్మల్నీ ఛీ కొట్టిస్తామనీ హెచ్చరించారు.

# యువ వైద్యులకు గవర్నర్ ప్రశంస

**హైదరాబాద్,అక్టోబరు2,ప్రభాతవార్త:**మహాత్మాగాంధీ జయంతి సందర్భంగా వైద్యులు డాక్టర్ వై. శ్రవణ్‌కుమార్, డాక్టర్ వై. ఆకాంక్షను గవర్నర్ శివప్రతాప్ శుక్లా అభినందించారు. వైద్య రంగంలో ప్రతిభ కనబరుస్తూ, సేవలందిస్తున్నందుకు ప్రశంసించారు.ఎంఛ్ యూరాలజీలో గోల్డ్ మెడలిస్ట్ డాక్టర్ శ్రవణ్‌కుమార్, డీఎం కార్డియాలజీలో గోల్డ్ మెడలిస్ట్ డాక్టర్ ఆకాంక్షకు లోక్‌భవన్‌లో గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా ప్రశంసాపత్రాలు అందజేశారు. భవిష్యత్తులోనూ మానవతా దృక్పథంతో సేవలందించాలని ఆకాంక్షి ంచారు.

## జై జవాన్-జై కిసాన్ నినాదాన్ని చాటి చెప్పిన దార్శనికుడు లాల్ బహదూర్ శాస్త్రి: సిఎం రేవంత్‌రెడ్డి

**హైదరాబాద్,అక్టోబరు2,ప్రభాతవార్త:** భారత రత్న,మాజీ ప్రధానమంత్రి లాల్ బహదూర్ శాస్త్రి జయంతి సందర్భంగా ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి ఆ మహనీయునికి ఘనంగా నివాళులు అర్పించారు. దేశం కోసం నిస్వార్థంగా సేవలందించిన మహోన్నత నాయకుడిగా స్మరించుకున్నారు. జై జవాన్-జై కిసాన్ అన్న నినాదంతో సైనికుడి ధైర్యాన్ని రైతు శ్రమను దేశ ప్రగతికి రెండు బలమైన స్తంభాలుగా వాటి చెప్పిన దార్శనికుడని కొనియాడారు. నిజాయితీ, నిరాడంబరత,కర్తవ్యనిష్ట, దేశభక్తికి ప్రతి రూపంగా నిలిచిన వారి జీవితం ఆదర్శంపేర్కొన్నారు.

# కెప్టెన్ స్మిత్ మచ్చర్ తెగువకు గవర్నర్ ప్రశంసలు

**అతని ధైర్య సాహసాలు దేశానికి గర్వకారణం, త్వరగా కోలుకోవాలని ఆకాంక్ష**

**హైదరాబాద్,అక్టోబరు2,ప్రభాతవార్త:** ప్రమాదకర పరిస్థితుల్లో ప్రాణాలను లెక్కచేయకుండా 174 మంది ప్రయాణికుల ప్రాణాలను కాపాడిన కెప్టెన్ స్మిత్ మచ్చర్ ధైర్యసాహసాలను తెలంగాణ గవర్నర్ శివప్రతాప్ శుక్లా అభినందించారు.శుక్రవారం లోక్ భవన్ లో మాట్లాడుతూ విమానం ప్రమాదానికి గురయ్యే అవకాశం ఉన్న క్షణాల్లోనూ కెప్టెన్ అప్రమత్తత, సమయస్ఫూర్తితో వ్యవహరించారని గవర్నర్ పేర్కొన్నారు. కేవలం 30 సెకన్ల ఆలస్యమైనా పరిస్థితి మరింత విషమంగా మారేదన్నారు. అసాధ్యమనుకున్న పరిస్థితిని తన ధైర్యంతో సాధ్యంగా మార్చి ప్రయాణికుల ప్రాణాలను కాపాడారని ప్రశంసించారు.కెప్టెన్ స్మిత్ మచ్చర్ చూపిన తెగువ, మానవతా దృక్పథం భారతదేశానికి గర్వకారణమని గవర్నర్ అన్నారు. ఆయన కుటుంబ సభ్యులను అభినందిస్తూ.. కెప్టెన్ సంపూర్ణ ఆరోగ్యంతో మరింత కాలం సేవలందించాలని ఆకాంక్షి ంచారు.

# గాంధీయిజమే ప్రపంచానికి మార్గదర్శకం: డి.సిఎం భట్టి

## గాంధీ జయంతిని యావత్ ప్రపంచం ఒక పండుగగా జరుపుకుంటోంది: మహేష్‌కుమార్‌గౌడ్

**హైదరాబాద్ (సైఫాబాద్), అక్టోబరు 2 ప్రభాతవార్త:** జాతిపిత మహాత్మాగాంధీయిజమే ప్రపంచానికి మార్గదర్శకమని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క చెప్పారు. గాంధీని హత్య చేసిన గాడ్సే భావజాలాన్ని సమర్థించే దోరణలు దేశంలో కనిపంచడం బాధకరమన్నారు. గాంధీని విమర్శిస్తూ, గాడ్సే విధానాలు సరైనవని మాట్లాడే సంస్కృతిని దేశభక్తులు ఎవరూ అంగీకరించరాదని సూచించారు. గాంధీ ఆలోచనలకు వ్యతిరేకంగా గాడ్సే భావజాలాన్ని ముందుకు తీసుకువెళ్ళే ప్రయత్నాలను ప్రజలు వ్యతిరేకించాలని ఆయన పిలుపునిచ్చారు. మహాత్మా గాంధీని పురస్కరించుకుని గాంధీ గ్లోబల్ ఫ్యామిలీ, టిపిసిసి, గాంధీ జ్ఞాన ప్రతిష్టాన్ సంయుక్త ఆధ్వర్యంలో శుక్రవారం ఎల్‌బి స్టేడియంలో 'బాపు బాట-1157 చరఖాల ప్రదర్శన' సందర్భంగా జరిగిన సభలో ఆయన ముఖ్యఅతిధిగా పాల్గొని ప్రసంగించారు. భారత స్వాతంత్ర్య ఉద్యమంలో మహాత్మా గాంధీ నాయకత్వం, సత్యాగ్రహం, అహింసా సిద్ధాంతాల పాత్ర అత్యంత కీలకమైనదన్నారు. గాంధీతో కలిసి నడవని ఆనాటి స్వాతంత్ర్య ఉద్యమంతో సంబంధం లేనివారు కొందరూ చరిత్రను వక్రికరించే ప్రయత్నం బిజెపి నాయకులు చేస్తున్నారని భట్టి విక్రమార్క ఆరోపించారు. దక్షిణాఫ్రికాలో ఎదురైన అవమానం గాంధీ జీవితంలో కీలక మార్పుగా మారిందని, దీంతో ఆయన మన దేశంలో స్వాతంత్ర్య ఉద్యమానికి నాయకత్వం వహించారని, అందిరితోకలిసి ఉద్యమాన్ని చేశారని, బ్రిటిష్ సామ్రాజ్యావాదానికి సవాల్ విసిరిన మహాత్ముడు ప్రజల శక్తిని ప్రపంచానికి చాటారని ఆయన ఈ సందర్భంగా గుర్తు చేశారు. గాంధీజీ ఆలోచనలు, స్ఫూర్తితోనే ప్రజల అవసరాలను గుర్తించి వారికి అనుగుణంగా ప్రభుత్వ విధానాలను రూపొందిస్తున్నామని, ప్రజలందరికి సమాన విద్య, సామాజిక న్యాయం, గౌరవం కల్పించడమే ప్రజాపాలన లక్ష్యమన్నారు. ఈ ఆలోచనలకు అనుగుణంగానే ప్రభుత ్వం యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియ్ స్కూల్స్‌కు శ్రీకారం చుట్టిందన్నారు. పిసిసి అధ్యక్షుడు, ఎమ్మెల్సీ బి.మహేష్‌కుమార్‌గౌడ్ మాట్లాడుతూ మహాత్మాగాంధీ జయంతిని యావత్ ప్రపంచం ఒక పండువగా జరుపుకుంటున్నదని, శాంతిని కోరుకునే ప్రతి ఒక్కరికి ఇది స్ఫూర్తిదాయకమైన రోజని చెప్పారు. గాంధీ చేసిన త్యాగాలను, సత్యం, అహింసా, శాంతి, సామాజిక సమానత్వం వంటి ఆశయాలను మనం స్మరించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. గాంధీ చూపిన మార్గమే దేశానికి శ్రీరామరక్ష వంటిదని,

ఆయన ఆశయాలను, అచరణలో పెట్టడం ద్వారా ప్రజాస్వామ్య విలువలను మరింతగా బలోపేతం చేయవచ్చునని చెప్పారు. గాంధీ స్ఫూర్తితో సమాజ సేవలో నిస్వార్థంగా పనిచేస్తున్న ప్రతి ఒక్కరికి ఆయన మనస్ఫూర్తిగా అభినందనలు తెలిపారు.

అంతకు ముందు ఆయన ఎల్‌బి స్టేడియం ఆవరణలో ఏర్పాటు చేసిన వివిధ స్టాల్స్‌ను నేతలను సందర్శించారు.

ఈ కార్యక్రమంలో రాష్ట్ర మంత్రులు పొన్నం ప్రభాకర్, వివేక్ వెంకటస్వామి, అజారుద్దీన్, ప్రభుత్వ సలహాదారు వి.హనుమంతరావు, పిసిసి కార్యనిర్వాహక అధ్యక్షుడు మందడి అంజన్‌కుమార్ యాదవ్, హార్కర్ వేణుగోపాల్, గాంధీ జ్ఞాన్ ప్రతిష్టాన్ ఛైర్మన్ గున్నా రాజేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# సిఎం రేవంత్‌కు చెమటలు పట్టిస్తాం

## సిరిసిల్ల సభకు కౌంటర్‌గా కొడంగల్‌లో బిఆర్‌ఎస్ సభ

### మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్

**హైదరాబాద్,అక్టోబరు2,ప్రభాతవార్త:**తెలంగాణ రాజకీయాల్లో మరోసారి సభల రాజకీయం వేడెక్కుతోంది. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ప్రాతినిధ్యం వహిస్తున్న సిరిసిల్లలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఇటీవల భారీ బహిరంగ సభ నిర్వహించిన నేపథ్యంలో.. అందుకు కౌంటర్‌గా సీఎం సొంత నియోజకవర్గమైన కొడంగల్‌లో బీఆర్ఎస్ భారీ సభ నిర్వహించేందుకు సిద్ధమవుతున్నట్లు ఆ పార్టీ సీనియర్ నేత, మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ తెలిపారు. కొడంగల్‌లో నిర్వహించే సభతో రేవంత్‌రెడ్డికి చెమటలు పట్టిస్తామని ఆయన వ్యాఖ్యానించారు. శుక్రవారం మీడియాతో చిట్‌చాట్‌లో మాట్లాడిన తలసాని శ్రీనివాస్ యాదవ్.. ముఖ్యమంత్రి హోదాలో రేవంత్‌రెడ్డి రాష్ట్రంలో ఎక్కడైనా పర్యటించవచ్చని అన్నారు. అయితే సిరిసిల్లలో బలప్రదర్శన చేయాల్సిన అవసరం ఏముందని ప్రశ్నించారు. సిరిసిల్ల ఏమైనా పక్క రాష్ట్రంలో ఉందా అని వ్యాఖ్యానించారు. ఇక హరీష్‌రావు ప్రాతినిధ్యం వహిస్తున్న సిద్ధిపేటలో కూడా సభ నిర్వహించనున్నట్లు సీఎం రేవంత్‌రెడ్డి ఇప్పటికే స్పష్టం చేశారు. ఈ నేపథ్యంలోనే దానిపైనా స్పందించిన తలసాని.. సిద్దిపేట సభ పూర్తయిన తర్వాత కొడంగల్‌లో బీఆర్ఎస్ సభ నిర్వహిస్తామని స్పష్టం చేశారు. కొడంగల్‌లో తమ పార్టీ నిర్వహించే సభతో ముఖ్యమంత్రికి చెమటలు పడతాయని వ్యాఖ్యానించారు. కాగా.. సెప్టెంబర్ 30వ తేదీన సిరిసిల్లలో రేవంత్‌రెడ్డి పాదయాత్రతో పాటు బహిరంగ సభలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు. కేటీఆర్‌ను వచ్చే ఎన్నికల్లో ఓడించాలని కాంగ్రెస్ శ్రేణులకు పిలుపునిచ్చారు. సిరిసిల్లలో సీఎం రేవంత్ రెడ్డి నిర్వహించిన సభపై కూడా తలసాని స్పందించారు. ఆ సభతో రేవంత్‌రెడ్డికి వచ్చిన రాజకీయ మైలేజ్ కంటే నష్టమే ఎక్కువ జరిగిందని ఆయన అభిప్రాయపడ్డారు. సిరిసిల్లలో సీఎం పర్యటనపై బీఆర్ఎస్ నేతలు కూడా విమర్శలు చేశారు. ప్రభుత్వం చేపట్టిన కార్యక్రమాల కంటే కేటీఆర్, బీఆర్ఎస్ నేతలపై రాజకీయ విమర్శలకే ప్రాధాన్యం ఇచ్చారని వారు ఆరోపించారు. మరోవైపు.. కాంగ్రెస్ నేతలు మాత్రం సిరిసిల్ల సభకు ప్రజల నుంచి మంచి స్పందన లభించిందని చెబుతున్నారు.ఇదే సందర్భంగా ఖైరతాబాద్ ఉపఎన్నికపై కూడా తలసాని శ్రీనివాస్ యాదవ్ స్పందించారు. ఖైరతాబాద్‌లో బీఆర్ఎస్ 100 శాతం విజయం సాధిస్తుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు. పార్టీ మారిన నేపథ్యంలో దానం నాగేందర్‌పై నియోజకవర్గ ఓటర్లలో అసంతృప్తి ఉందని ఆయన వ్యాఖ్యానించారు. గతంలో ఓటు హక్కును వినియోగించుకోని కొందరు ఓటర్లు కూడా ఉపఎన్నికలో ఉత్సాహంగా పోలింగ్‌లో పాల్గొంటారని తలసాని పేర్కొన్నారు. డబ్బులు ఇచ్చినా ఈసారి కాంగ్రెస్‌కు ఓటర్లు మద్దతు ఇవ్వబోరని ఆయన పేర్కొన్నారు.

# అనిశ్చితిలో చేప పిల్లల పంపిణీ

## రూ.133.31 కోట్లతో గత నెల 29న ప్రారంభం

### నీటి నిల్వలు అంతంత మాత్రమే

**హైదరాబాద్, అక్టోబరు 2, ప్రభాతవార్త :** రిజర్వాయర్లు, సాగునీటి చెరువులలో నీటిమట్టాలు తగ్గిపోవడంతో రాష్ట్రంలో వార్షిక చేప పిల్లల పంపిణీ కార్యక్రమం అనిశ్చితిని ఎదుర్కొంటోంది. వానాకాలం ముగింపు దశలో గత నెల 28 నుంచే రాష్ట్రంలో చేప పిల్లల పంపిణీ కార్యక్రమం ప్రారంభమైంది. అయితే చెరువులు, కుంటలు పూర్తి స్థాయిలో నిండకపోవడం, ఇలాగే వర్షాభావం కొనసాగితే ఉన్న కొద్దిపాటి నీరు మరి కొన్ని రోజుల్లో తగ్గిపోయే అవకాశం ఉంది. ఈ పరిస్థితుల్లో చేప పిల్లలను వదిలితే అవి ఎంతకాలం బతుకుతాయన్నది ప్రశ్నార్థకంగా మారింది. రాష్ట్రంలో చేప, రొయ్య పిల్లల పంపిణీకి ప్రస్తుత 2026-27 ఆర్థిక సంవత్సరంలో రూ.133.31 కోట్లను ఖర్చు చేయనుంది. రాష్ట్రవ్యాప్తంగా 26,547 నీటి వనరుల్లో 84.59 కోట్ల చేప పిల్లలను, దాదాపు 300 నీటి వనరుల్లో 10 కోట్ల రొయ్య పిల్లలను 100 శాతం రాయితీపై పంపిణీ చేయాలని మత్స్యశాఖ నిర్ణయించింది. ఈ కార్యక్రమం ద్వారా దాదాపు ఐదు లక్షల మత్స్యకార కుటుంబాలకు ప్రత్యక్షంగా, పరోక్షంగా ప్రయోజనం కలుగుతుందని అధికారులు చెబుతున్నారు. తద్వారా 6 లక్షల టన్నుల చేపల ఉత్పత్తిని సాధించాలని లక్ష్యంగా పెట్టుకుంది. అయితే రూ.కోట్లతో చేప, రొయ్య పిల్లలను పంపిణీ చేస్తున్నప్పటికీ అదును దాటి పోవడంతో నిధులు సద్వినియోగం అవుతాయా లేదా అనేది సందిగ్ధంగా తయారయింది. ఈ వానాకాలంలో వర్షపాతం ఆశించిన స్థాయిలో లేదు. రాష్ట్ర వ్యాప్తంగా లోటు వర్షపాతం నెలకొనడంతో రిజర్వాయర్లు, చిన్న చెరువులు, కుంటల్లో నీటి మట్టాలు తగ్గిపోయాయి. సాధారణంగా వానాకాలంలో చెరువులు, కుంటలు నీటితో నిండిన వెంటనే చేప పిల్లలను వదలాలి. దీంతో చేపలు ఎదిగేందుకు ఎక్కువ సమయం దొరుకుతుంది. సీజన్ ముగిసే నాటికి చేపలు పూర్తిస్థాయిలో ఎదగడం వల్ల మత్స్యకారులకు ఆదాయం వస్తుంది. కానీ ఈ సారి పలు జిల్లాల్లో వర్షాభావ పరిస్థితులు నెలకొనగా, మరికొన్ని చోట్ల నీటి నిల్వలు అంతంత మాత్రంగానే ఉన్నాయి. మత్స్య శాఖ నిబంధనల ప్రకారం, కనీసం 40 శాతం నీటి లోతు ఉన్న జలాశయాలలో మాత్రమే చేప పిల్లలను వదలడానికి అనుమతి ఉంది. నీరు తగ్గిపోయిన చెరువులలో చేప పిల్లలను వదలడం వల్ల అధిక మరణాలు సంభవించి, ఆర్థిక నష్టాలు వాటిల్లవచ్చుని మత్స్యకారులు ఆందోళన చెందుతున్నారు. పంపిణీకి ముందు ఎంపిక చేసిన చెరువులను అధికారులు స్వయంగా తనిఖీ చేయాలని, అలాగే వాస్తవ నీటి లభ్యతకు అనుగుణంగా విత్తనాల కేటాయింపును సరిపోల్చాలని కోరుతున్నారు.

# యావద్భారతం గర్వపడుతున్న కెప్టెన్ స్మిత్ మచ్చర్

## బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రాంచందర్‌రావు

**హైదరాబాద్, అక్టోబరు 2 ప్రభాతవార్త:** మరో 9/11 తరహా ఘటన జరగకుండా ప్రాణాలను పణంగా పెట్టడాన్ని, అతని ధైర్యసాహసాలను చూసి యావత్ ప్రపంచం హర్షించి.. ఒక రోజు పూర్తయిందని బిజెపి రాష్ట్ర అధ్యక్షులు ఎన్.రాంచందర్‌రావు అన్నారు. ఒక భారతీయుడు ప్రదర్శించిన ఈ అసాధారణ ధైర్యసాహసాలను కనీసం గుర్తించి, అభినందించాలన్న ఇంగిత జ్ఞానం కూడా సోనియా గాంధీ, రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీలకు లేకపోవడం ఆశ్చర్యకరం. అర్థం పర్థంలేని అంశాలపైనా స్పందించి, తాను ప్రపంచాన్ని మారుస్తున్నట్లు మాట్లాడే రాహుల్ గాంధీ.. ఈ ఒళ్లు గగుర్పొడిచే సందర్భం గురించి, కెప్టెన్ స్మిత్ మచ్చర్ గురించి మాట్లాడటం సంగతి పక్కనపెడితే.. కనీసం ఆయన ధైర్యసాహసాలను అభినందిస్తూ ఒక సోషల్ మీడియా పోస్ట్ కూడా చేయలేకపోయారు. అసలు సోనియా గాంధీ కుటుంబం ప్రాబ్లమ్ ఏంటి? భారత్ గురించి, భారతీయుల గురించి ఏదైనా మంచి జరిగితే, లేదా భారతీయుల శక్తి, సామర్థ్యాలను ప్రపంచమంతా కీర్తిస్తే.. వారికి ఎందుకు నచ్చదు? ఒక భారతీయుడు తన ధైర్యసాహసాలతో అంతర్జాతీయ నేతల ప్రశంసలు అందుకుంటుంటే.. నెహ్రూ కుటుంబం జీర్ణించుకోలేకపోతోంది. మొదట్నుంచీ కాంగ్రెస్ పార్టీకి ఉన్న అలవాటు ఇది. అందుకే ఇలాంటి పార్టీ త్వరలోనే రాజకీయంగా కనుమరుగు కావడం ఖాయం అని పేర్కొన్నారు.

## భారత్ మహిళల హాకీ జట్టుకు శుభాకాంక్షలు: గవర్నర్ శివప్రతాప్ శుక్లా

**హైదరాబాద్,అక్టోబరు2,ప్రభాతవార్త:** ఆసియా క్రీడల్లో చారిత్రాత్మక స్వర్ణం సాధించిన భారత మహిళల హాకీ జట్టుకు తెలంగాణ రాష్ట్ర గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా శుభాకాంక్షలుతెలిపారు. భారత మహిళల హాకీ జట్టు విజయం దేశానికే గర్వకారణం అని పేర్కొన్నారు. జట్టు పట్టుదల, క్రమశిక్షణ, అసాధారణ క్రీడాస్ఫూర్తికి ఈ విజయం నిదర్శనం అని తెలిపారు. విజేతలైన మన క్రీడాకారిణులను చూసి యావత్ దేశం గర్విస్తోందని పేర్కొన్నారు. భారత మహిళల హాకీ జట్టుకు మరిన్ని విజయాలు, ఘనతలు దక్కాలని ఆకాంక్షి స్తున్నట్లు ప్రకటించారు.

## కెసిఆర్ మానవీయ పాలనకు కళ్యాణలక్ష్మి పథకం నిదర్శనం: కెటిఆర్ ట్వీట్

**హైదరాబాద్,అక్టోబరు2,ప్రభాతవార్త:** కెసిఆర్ మానవీయ పాలనకు నిదర్శనం కళ్యాణలక్ష్మి పథకం అని బిఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ వ్యాఖ్యానించారు. కళ్యాణలక్ష్మిపథకానికి 12 ఏళ్ళు పూర్తయిన సందర్భంగా కెటిఆర్ ఎక్స్‌లో వీడియో పోస్టు చేశారు. ఉద్యమ సమయంలో ఒక గిరిజన తండాలో స్వయంగా చూసిన ఒక సంఘటన ప్రేరణగా కెసిఆర్ ఈ పథకానికి శ్రీకారం చుట్టారని పేర్కొన్నారు. తెలంగాణలోని లక్షల కుటుంబాలకు ఆడబిడ్డ పెండ్లి సమయంలో కెసిఆర్ మేనమామ లాగా నిలిచి, పేద కుటుంబాలకు పెద్ద దిక్కైనాడని అన్నారు. పేదింటి ఆడబిడ్డ పెళ్లికి రూ. 1,00,116 కానుకగా అందించాలన్న ఆలోచన కెసిఆర్‌కు తప్ప ప్రపంచంలోని ఏ నాయకుడికి రాలేదని చెప్పారు. ఆడబిడ్డ పెళ్లి సమయంలో తల్లిదండ్రుల మీద ఆర్థిక భారం తగ్గించేందుకు ఈ పథకం ఉపయోగపడిందని, బాల్య వివాహాలను కూడా తగ్గించిందని తెలిపారు. గత పన్నెండేళ్లలో కళ్యాణ లక్ష్మి/షాదీ ముబారక్ ద్వారా 16.78 లక్షల పేద కుటుంబాలకు లబ్ధి చేకూరిందని తెలిపారు. కాంగ్రెస్ వచ్చాక కళ్యాణలక్ష్మి పథకాన్ని నీరుగార్చడమే కాకుండా.. పూర్తిగా రద్దు చేసే కుట్రలు జరుగుతున్నాయని అన్నారు. కళ్యాణలక్ష్మితో పాటు ఇస్తానన్న తులం బంగారం దేవుడెరుగు, అసలు ఈ పథకమే లేకుండా చేసేందుకు రేవంత్ రెడ్డి పావులు కదుపుతున్నారని ఆరోపించారు. కళ్యాణలక్ష్మి పథకం అమలులోకి వచ్చి 12 ఏళ్ళు నిండిన శుభ సమయాన... లబ్ధిదారులకు శుభాకాంక్షలు అంటూ ట్వీట్ చేశారు.

# ఎస్సీ, ఎస్టీ, బిసి, మైనార్టీలకు నవంబరు 19న రాజీవ్ యువ వికాసం

**హైదరాబాద్, అక్టోబరు 2, ప్రభాతవార్త** ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ వర్గాలకు చెందిన నిరుద్యోగులకు స్వయం ఉపాధి కల్పించి, వారి ఆర్థిక ఉన్నతిని కాపాడే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం రూపొందించిన రాజీవ్ యువ వికాసం పథకాన్ని వచ్చే నవంబరు 19వ తేదీన లాంఛనంగా ప్రారంభించాలని ప్రభుత్వం నిర్ణయించినట్లు తెలిసింది. ఈ పథకం ద్వారా రాష్ట్ర వ్యాప్తంగా 5 లక్షల మందికి లబ్ధి చేకూర్చాలని లక్ష్యం కలిగి అందుకు రూ.6,240 కోట్లు కేటాయించింది. రాష్ట్రంలోని ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఈబీసీ, మైనారిటీ, క్రిస్టియన్ మైనార్టీస్ కార్పొరేషన్ల వారీగా ఈ పథకానికి 16,30,522 దరఖాస్తులు వచ్చాయి. తొలి విడతగా రూ.50వేల నుంచి రూ.లక్ష లోపు యూనిట్ల కోసం దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారులకు అవకాశం ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించింది. రూ.50వేల నుంచి రూ.4లక్షల వరకు యూనిట్ ధర నిర్ణయించగా ఎక్కువమంది రూ.లక్ష కోసం దరఖాస్తు చేసుకున్నారు. అన్ని కార్పొరేషన్లకు కలిపి రూ.50వేల లోపు విభాగంలో 1.59లక్షల మందికి లబ్ధి చేకూర్చాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకోగా 54,822 మంది దరఖాస్తు చేసుకున్నారు.

రూ.50వేల నుంచి రూ.లక్ష లోపు 1.23లక్షల మందికి లబ్ధి చేకూర్చాలని భావించినా 1.07లక్షల మంది దరఖాస్తు చేసుకున్నారు.

ఇక రూ.లక్షకు పైన విభాగానికి ఎక్కువ మంది దరఖాస్తు చేసుకున్నారు. రూ.లక్ష నుంచి రూ.2లక్షల వరకు 1.07లక్షల మందికి ఇవ్వాలని లక్ష్యంగా పెట్టుకోగా 2.61లక్షల దరఖాస్తులు వచ్చాయి.

# యుసిసి అమలుచేస్తున్న రెండో రాష్ట్రంగా గుజరాత్



**అమ్మదాబాద్, అక్టోబరు 2:** యూసీసీ (యునిఫాం సివిల్ కోడ్) చట్టాన్ని గుజరాత్ రాష్ట్రం అమలు చేయబోతోంది. దీనిపై గుజరాత్ అసెంబ్లీలో గత మార్చిలో చేసిన తీర్మానాన్ని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము తాజాగా ఆమోదించారు. దీంతో ఈ చట్టం రాష్ట్రంలో అమలులోకి రానుంది. యూసీసీని అమలు చేయబోతున్న రెండో రాష్ట్రంగా గుజరాత్ నిలుస్తోంది. గతంలో తొలి సారిగా ఉత్తరాఖండ్ ఈ చట్టాన్ని అమలులోకి తీసుకొచ్చింది. ఇప్పుడు గుజరాత్ కూడా ఈ చట్టాన్ని అమలు చేయబోతుంది. గుజరాత్ యునిఫాం సివిల్ కోడ్ బిల్, 2026 పేరిట ఈ బిల్లును సీఎం భూపేంద్ర పటేల్ ఆధ్వర్యంలోని బీజేపీ ప్రభుత్వం తీసుకొచ్చింది. ఈ మేరకు గుజరాత్ ప్రభుత్వం గెజిట్ నోటిఫికేషన్ కూడా విడుదల చేసింది. దీని ప్రకారం రాష్ట్రంలో ఇకపై వివాహం, సహజీవనం, ఆస్తి పంపకాలు వంటివన్నీ ఈ చట్టం పరిధిలోకి వస్తాయి. ఈ విషయాల్లో కొత్త రూల్స్ అమలవుతాయి. యూసీసీ ప్రకారం చట్టంలో రానున్న కీలక మార్పులివే. గిరిజన తెగలకు మినహా అందరికీ ఈ చట్టం వర్తిస్తుంది. ఈ చట్టం ప్రకారం వారసత్వపు ఆస్తి హక్కు విషయంలో స్త్రీలు, పురుషులకు సమాన హక్కులుంటాయి. అంటే, కొడుకుకైనా, కూతురుకైనా ఆస్తి విషయంలో సమాన హక్కు ఉంటుంది. ఎవరైనా సహజీవనం చేస్తే ఇకపై రిజిస్ట్రేషన్ చేసుకోవాల్సిందే. అలా చేయకుండా సహజీవనాన్ని కొనసాగించినా కూడా నేరమే. పెళ్లిళ్లతో సమానంగా సహజీవనాన్ని కూడా నమోదు చేసుకోవాల్సిందే. విడాకులు కూడా చట్టబద్ధంగా జరగాల్సిందే. సహజీవనం విషయంలో ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం కీలకంగా చెప్పుకోవాలి. తాము సహజీవనానికి వ్యతిరేకం కాదని సీఎం భూపేష్ పటేల్ చెప్పారు. అయితే, ఈ విషయంలో మహిళల హక్కులకు ప్రాధాన్యం ఇస్తామని, అందువల్లే సహజీవనానికి కూడా రిజిస్ట్రేషన్ చేసుకునేలా చట్టం తెచ్చామన్నారు. రాష్ట్రంలో మహిళలు అందరికీ సమాన హక్కులు ఉంటాయని, మత పరంగా ఎలాంటి మినహాయింపు ఉండదని సీఎం అన్నారు. అన్ని మతాలవారికి సమానంగా యూసీసీ చట్టం వర్తిస్తుందన్నారు.

# రాబోయే ఆరు నెలలు కీలకమైన ఎన్నికల సమరం

## నషా ముక్త్ భారత్ లక్ష్య సాధనకు ప్రతీ ఒక్కరూ శ్రమించాలి: కేంద్ర మంత్రి జి.కిషన్ రెడ్డి



ప్రసంగిస్తున్న కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి

**హైదరాబాద్ , అక్టోబరు 2 ( ప్రభాతవార్త ) :** రాబోయే ఆరు నెలల కాలం అత్యంత కీలకమైన ఎన్నికల సమరమని, బూత్ స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు ప్రతి ఒక్క నాయకుడు, కార్యకర్త నిరంతరం ఫీల్డ్ లోనే ఉండాలని కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి. కిషన్ రెడ్డి పిలుపునిచ్చారు. శుక్రవారం బర్కత్‌పురాలోని బీజేపీ నగర కార్యాలయంలో నిర్వహించిన పట్టభద్రుల (గ్రాడ్యుయేట్) ఎంఎల్‌సీ ఓటర్ల నమోదు వర్క్‌షాప్‌కు కిషన్ రెడ్డి మాట్లాడారు. వచ్చే ఆరు నెలల్లో గ్రాడ్యుయేట్ ఎంఎల్‌సీ ఎన్నికలతో పాటు మూడు కార్పొరేషన్ల స్థానిక సంస్థల ఎన్నికలు, ఖైరతాబాద్ అసెంబ్లీ ఉప ఎన్నిక రానున్నాయని కిషన్ రెడ్డి స్పష్టం చేశారు. ప్రతి గ్రాడ్యుయేట్‌ను ఓటరుగా నమోదు చేయించే బాధ్యతను పార్టీ శ్రేణులు తీసుకోవాలని సూచించారు. యువతను మత్తు పదార్థాలు, డ్రగ్స్ మహమ్మారి నుంచి కాపాడటానికి ప్రధాని నరేంద్ర మోదీ ప్రతిష్టాత్మకంగా నషా ముక్త్ భారత్ కార్యక్రమాన్ని తీసుకువచ్చారని కిషన్ రెడ్డి తెలిపారు. ఇందులో భాగంగా నవంబర్ మొదటి వారంలో నిర్వహించనున్న భారీ కార్యక్రమానికి పార్టీ శ్రేణులు, ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు. అలాగే, వచ్చే బతుకమ్మ పండుగను నగరంలోని ప్రతి డివిజన్‌లోనూ ఘనంగా నిర్వహించాలని పిలుపునిచ్చారు. 4వ తేదీన కేంద్ర హోం మంత్రి అమిత్ షా బేగంపేట్ విమానాశ్రయానికి రానున్నారని, నాయకులు,

కార్యకర్తలు భారీగా తరలివచ్చి స్వాగతం పలకాలన్నారు. ఈ వర్క్‌షాప్‌లో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఎన్. గౌతమ్ రావు పాల్గొని గ్రాడ్యుయేట్ ఓటర్ల నమోదు ప్రక్రియ, ఫారమ్18 నింపే విధానంపై నాయకులకు,

కార్యకర్తలకు సమగ్రంగా వివరించారు. అర్హులైన ప్రతి ఒక్కరిచేత ఓటు నమోదు చేయించాలని కోరారు. హైదరాబాద్ సెంట్రల్ జిల్లా అధ్యక్షుడు లంకల దీపక్ రెడ్డి, సికింద్రాబాద్ మహంకాళి జిల్లా అధ్యక్షుడు గుండగోని భరత్ గౌడ్, మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రా రెడ్డి, మాజీ మంత్రి కృష్ణ యాదవ్ తదితర ముఖ్య నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.



# ఎస్వీ ప్రాణదాన ట్రస్ట్‌కు రూ.1.02 కోట్ల విరాళం

**తిరుమల, అక్టోబరు 2 ప్రభాతవార్త ప్రతినిధి:** ధార్మికసంస్థ తిరుమల తిరుపతిదేవస్థానం నిర్వహిస్తున్న పలు పథకాలు, ట్రస్ట్‌లకు దాతలు తమవంతుగా విరాళాలు అందిస్తున్నారు. శుక్రవారం ఉదయం తెలంగాణ హైదరాబాద్‌కు చెందిన దాత నోముల అశోక్ కుమార్ ఎస్వీ ప్రాణదాన ట్రస్ట్‌కు రూ.1.02 కోట్ల విరాళాన్ని అందజేశారు. హైదరాబాద్‌లోని ఛైర్మన్ క్యాంపు కార్యాలయంలో టిటిడి ఛైర్మన్ బిఆర్ నాయుడును కలిసి ఈ విరాళాన్ని అందించారు ఈ సందర్భంగా దాత నోముల అశోక్ కుమార్‌ను ఛైర్మన్ అభినందించారు. ఎస్వీ ప్రాణదాన ట్రస్ట్ ద్వారా అందిస్తున్న సేవలకు సహకరిస్తున్న దాతలకు కృతజ్ఞతలు తెలిపారు. శ్రీ వేంకటేశ్వర స్వామివారి ఆశీస్సులు దాతకు, వారి కుటుంబ సభ్యులకు ఎల్లప్పుడూ ఉండాలని నాయుడు ఆకాంక్షి ంచారు.

# పంజాబ్ పిసిసి చీఫ్‌గా ప్రగత్‌సింగ్

## ఎన్నికల వేళ పంజాబ్ కాంగ్రెస్‌లో శరవేగంగా మారుతున్న పరిణామాలు

**అమృత్‌సర్, అక్టోబరు 2:** ఎన్నికలకు సిద్ధం అవుతున్న పంజాబ్‌లో కాంగ్రెస్‌లో హటాత్పరిణామాలు పార్టీ వర్గాలను అంతర్మథనంలో పడేసాయి. నాలుగేళ్లుగా పిసిసి చీఫ్‌గా ఉన్న అమరీందర్‌సింగ్ రాజా వారింగ్ తన పదవికా రాజీనామాచేసారు. ఆయనస్థానంలో కొన్ని గంటలకే హటాత్తుగా హాకీ దిగ్గజ క్రీడాకారుడు కాంగ్రెస్ నేత ప్రగత్‌సింగ్‌ను పిసిసి ఛీఫ్‌గా నియమిస్తున్నట్లు ఎఐసిసి ప్రకటించింది. ఈమేరకు ప్రగత్‌సింగ్‌కు పంజాబ్ ఇన్‌ఛార్జి సచిన్‌పైలెట్ నియామక పత్రాన్ని అందచేసారు. తన రాజీనామా సొంతనిర్ణయమని, ఏనిమిషంలో పార్టీ పిలిచినా సేవలందించేందుకు నిరంతరం సిద్ధంగానే ఉంటానని రాజావారింగ్ వెల్లడించారు. న్యూఢిల్లీలో ఎఐసిసి నాయకుడు రాహుల్‌గాంధీని కలిసి మొత్తం పంజాబ్ పరిస్థితిని వివరించానని, రాష్ట్రంలో నెలకొన్న పరిస్థితులుఎ న్నికలకు వెళ్లాల్సిన వ్యూహం వంటివి చర్చకు వచ్చినట్లు చెప్పిన రాజావారింగ్ వారం రోజులపాటువిశ్రాంతికోసం లండన్‌కు వెళుతున్నట్లు ప్రకటించారు. నాలుగేళ్లపాటు శ్రమించిన తనకు పార్టీ ప్రస్తుతం విశ్రాంతి ఇచ్చిందని అందుకే కుటుంబంతోసహా లండన్‌కు వెళుతున్నట్లు తెలిపారు. కొత్త అధ్యక్షుడికి ఆయన శుభాకాంక్షలు తెలిపారు. రాజావారింగ్ హయాంలో పార్టీ రాష్ట్రయూనిట్‌లో నెలకొన్న విభేదాల కారణంగా ఎన్నికల తరుణంలో అప్రమత్తం కావాల్సిన అవసరం ఉన్నందున పిసిసి చీఫ్‌ను

వెంటనే మార్చామని కాంగ్రెస్‌ప్రకటించింది. అయినాకూడా రాజావారింగ్ సేవలు పార్టీకి ఎంతో విలువైనవని కితాబునిచ్చింది.

# పాడిపరిశ్రమ మరింత బలోపేతం దిశగా కేంద్రం చర్యలు

## 2029 నాటికి దేశవ్యాప్తంగా 75,000 కొత్త పాడి సహకార సంఘాల ఏర్పాటు లక్ష్యం

## తెలంగాణ ప్రభుత్వానికి మొత్తం రూ.1.16 లక్షల కోట్లు మంజూరు : కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి

**హైదరాబాద్, అక్టోబరు 2 ప్రభాతవార్త:** తెలంగాణలో ఏర్పాటు చేస్తున్న సబర్ డెయిరీ ప్రాజెక్టు భూమిపూజ కార్యక్రమంతో పాటు, అమూల్ సంస్థ రాష్ట్రంలో ఏర్పాటు చేస్తున్న మొట్టమొదటి ఆధునిక డెయిరీ ప్రారంభోత్సవ కార్యక్రమంలో కేంద్ర హోంమంత్రి అమిత్ షా పాల్గొంటారని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి వెల్లడించారు. అక్టోబరు 4వ తేదీన తెలంగాణలో కేంద్ర హోంశాఖ మంత్రి పర్యటిస్తున్నారని కిషన్‌రెడ్డి వెల్లడించారు. మెదక్ జిల్లా, తూప్రాన్‌లోని ఊర్జీ ఇండస్ట్రియల్ పార్క్‌లో ఉదయం 10 గంటల నుంచి ఈ కార్యక్రమం జరగనుందని, తెలంగాణలో డెయిరీ సెక్టార్ అభివృద్ధిలో ఈ ప్రాజెక్టు ఒక ముఖ్యమైన మైలురాయిగా నిలవనుందన్నారు. రాష్ట్రంలో పాడిపరిశ్రమ వ్యవస్థను మరింత బలోపేతం చేయడంతో పాటు, వ్యాల్యూ క్రియేషన్ పెంచడం, పాడి రైతులకు మరిన్ని అవకాశాలు కల్పించడం ఈ ప్రాజెక్టు ప్రధాన లక్ష్యం అని చెప్పారు. కేంద్ర హోంమంత్రి అమిత్ షా నాయకత్వంలోని కేంద్ర సహకార మంత్రిత్వ శాఖ.. 2024 సెప్టెంబర్ 19న శ్వేత విప్లవం 2.0 కార్యక్రమాన్ని ప్రారంభించిందని, కేంద్ర సహకార మంత్రిత్వ శాఖ, కేంద్ర మత్స్యశాఖ, పాడిపశుసంవర్ధక శాఖలు సంయుక్తంగా ఈ కార్యక్రమాన్ని చేపట్టాయి. ఈ సహకార విధానం ద్వారా ద్వారా ఇప్పటివరకు డెయిరీ కో ఆపరేటివ్ పరిధిలోకి రాని సంఘాలను, వ్యవస్థలను బలోపేతం చేయడం ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశం. సహకార సమాఖ్య నెట్‌వర్క్‌ను మరింత విస్తరించడం, పాడి రైతులకు డెయిరీ కో ఆపరేటివ్ పెంచడం, ఉపాధి అవకాశాలు కల్పించడం, మహిళా సాధికారతను ప్రోత్సహించడం వంటి అంశాలపై ఈ శ్వేత విప్లవం 2.0 ప్రధానంగా దృష్టి సారిస్తుందన్నారు. దీంతోపాటుగా 2028-29 నాటికి డెయిరీ కో ఆపరేటివ్ ద్వారా పాల సేకరణను 50శాతం పెంచడం ఈ కార్యక్రమం లక్ష్యమన్నారు. శ్వేత విప్లవం 2.0లో భాగంగా 2029 నాటికి దేశవ్యాప్తంగా 75,000 కొత్త పాడి సహకార సంఘాలను ఏర్పాటు చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నాం. ఇందులో భాగంగా తెలంగాణలో 1,525 కొత్త సహకార సంఘాలను ఏర్పాటు చేయాలన్న లక్ష్యాన్ని నిర్దేశించామని, సహకార రంగం బలోపేతానికి ప్రత్యేక చర్యలుదేశవ్యాప్తంగా సహకార రంగాన్ని మరింత బలోపేతం చేయాలన్న విస్తృత లక్ష్యంలో భాగంగానే ఈ చర్యలను చేపడుతున్నాం. సహకార రంగానికి తగిన ప్రాధాన్యత కల్పిస్తూ, ఈ రంగాన్ని మరింత బలోపేతం చేయాలన్న లక్ష్యంతో ప్రధానమంత్రి నరేంద్ర మోడీ 2021 జూలై 6న ప్రత్యేకంగా సహకార మంత్రిత్వ శాఖను ఏర్పాటు చేశారు.

అప్పటి నుంచి ఈ మంత్రిత్వ శాఖ బాధ్యతలను అమిత్ షా నిర్వహిస్తున్నారు.

గత ఐదేళ్లలో ఈ రంగాన్ని బలోపేతం చేసేందుకు అనేక కీలక చర్యలు తీసుకున్నాం.

ఇందులో.... ప్రాథమిక సహకార సంఘాలకు ఆదాయ మార్గాలను పెంచడం ద్వారా వాటిని ఆర్థికంగా బలోపేతం చేసేందుకు మోడల్ నిబంధనలను రూపొందించడం,..

నేషనల్ కోఆపరేటివ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ పరిధిని విస్తరించడం.

# అది 'సేవ్ డైనాస్టీ మార్చ్' - సేవ్ డెమోక్రసీ మార్చ్ కాదు

## ఓటమి భయంతోనే ఇసిపై పసలేని ఆరోపణలు : ఎంపి డా.కె.లక్ష్మణ్

**హైదరాబాద్, అక్టోబరు 2 ప్రభాతవార్త:** జాతిపిత మహాత్మా గాంధీ, మాజీ ప్రధాని లాల్ బహదూర్ శాస్త్రీ జయంతి సందర్భంగా వారికి ఘనంగా నివాళులర్పిస్తూ, కాంగ్రెస్ పార్టీ మరియు రాహుల్ గాంధీ అనుసరిస్తున్న ద్వంద్వ వైఖరిపై బిజెపి రాజ్యసభ సభ్యులు, పార్లమెంటరీ బోర్డు సభ్యులు డా. కె. లక్ష్మణ్ తీవ్రస్థాయిలో మండిపడ్డారు. దేశవ్యాప్తంగా కాంగ్రెస్, ఇండి కూటమి చేపట్టిన సేవ్ డెమోక్రసీ మార్చ్ అసలు ప్రజాస్వామ్య పరిరక్షణ యాత్ర కాదని, అది కేవలం తమ కుటుంబ వారసత్వాన్ని కాపాడుకోవడానికి చేస్తున్న ప్యూర్లీ సేవ్ డైనాస్టీ మార్చ్ అని ఆయన దుయ్యబట్టారు. శుక్రవారం బిజెపి రాష్ట్ర కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో లక్ష్మణ్ మాట్లాడారు. ప్రజాస్వామిక ఎన్నికల ప్రక్రియలో దేశ ప్రజలు పదే పదే కాంగ్రెస్‌ను ఓడిస్తుంటే వారు జీర్ణించుకోలేకపోతున్నారని డా. లక్ష్మణ్ ఫైర్ అయ్యారు. ప్రధాని నరేంద్ర మోడీ అభివృద్ధి, ప్రజాదరణను ఎదుర్కోలేక, ప్రజల్లోకి వెళ్లి ఓట్లు అడిగే నైతిక ధైర్యం లేకనే ఓట్ చోరీ, ఈవిఎంల ట్యాంపరింగ్ అంటూ కాంగ్రెస్ నాయకులు రాద్ధాంతం చేస్తున్నారని సూటిగా నిలదీశారు. ఆడలేక మద్దెల ఓడు అన్నట్లుగా కాంగ్రెస్ గెలిచిన కర్ణాటక, తెలంగాణ, కేరళలో ప్రజా తీర్పని, ఓడిపోయిన చోట మాత్రం ఈవిఎంలు, ఎన్నికల సంఘం పక్షపాతమంటూ వింత వాదనలు తెరపైకి తేవడం వారి ద్వంద్వ నీతికి నిదర్శనమని ఎద్దేవా చేశారు. ప్రజలు రెండుసార్లు, మూడుసార్లు తిరుగులేని మెజారిటీతో ఎన్నుకున్న ప్రధాని నరేంద్ర మోడీని, హోం మంత్రి అమిత్ షాని కాంగ్రెస్ నాయకులు దేశద్రోహులు అంటూ సంబోధించడాన్ని దేశ ప్రజలు తీవ్రంగా అసహ్యించుకుంటున్నారని ఫైర్ అయ్యారు. ఓటర్ల జాబితాలో ఏళ్ల తరబడి తిష్టవేసిన దొంగ ఓట్లు, చనిపోయిన వారి ఓట్లు, డూప్లికేట్ ఓట్లను తొలగించి జాబితాను ప్రక్షాళన (ఎస్ఐఆర్) చేస్తుంటే కాంగ్రెస్ పార్టీకి ఎందుకు అంత కడుపుమంట అని లక్ష్మణ్ నిలదీశారు.



శుక్రవారం మదనపల్లెలో గ్లోబల్ హార్టికల్చర్ హబ్ శంకుస్థాపన కార్యక్రమంలో ఏపి సిఎం చంద్రబాబుకు పాదాభివందనం చేస్తున్న రిలయన్స్ ఇడి అనంత్ అంబానీ

# ముంబయిలో పోటాపోటీ నిరసనలు

## సిజెపికి కౌంటర్‌గా జెన్‌నెక్ట్స్ గ్రూప్ ప్లకార్డులతో నిరసన



**ముంబయి, అక్టోబరు 2:** ఎస్ఐఆర్‌లో అక్రమాలకు పాల్పడిన వ్యవహారంలో సీఈసీ జ్ఞానేష్ కుమార్ రాజీనామా కోరుతూ కాక్రోచ్ జనతా పార్టీ (దిరిశి)ఇవాళ ముంబై శివాజీ పార్క్ వద్ద భారీ ధర్నా చేపట్టింది. పోలీసులు అనుమతి నిరాకరించినా భారీ ఎత్తున తరలివచ్చిన కార్యకర్తలు.. ఈ ధర్నాలో పాల్గొంటున్నారు. తొలిరోజే బాలీవుడ్ సెలబ్రిటీలు హాజరై కాక్రోచ్ లకు సంఘీభావం తెలియజేస్తున్నారు. అయితే అదే సమయంలో కాక్రోచ్ పార్టీ నిరసనలకు పోటీగా రైట్ వింగ్ కు చెందిన ఓ గ్రూప్ పోటీ నిరసనలకు దిగింది. శివాజీ పార్క్ సమీపంలో సీజేపీ నిరసన చేస్తున్న చోటుకు దగ్గర్లోనే జెన్ నెక్ట్స్ అని చెప్పుకుంటూ ఓ గ్రూపు నిరసనలకు దిగింది. కాక్రోచ్ జనతా పార్టీకి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ, ప్లకార్డులు పట్టుకుని వీరు నిరసనకు దిగారు. దీంతో ఈ వ్యవహారం తొలిరోజే కాక్రోచ్ లకు షాకిచ్చింది. కాక్రోచ్ బాస్ అభిజీత్ దిప్కే ఫొటోలతో కూడిన ప్లకార్డులతో వీరు వ్యతిరేక నినాదాలు చేస్తున్నారు. దీంతో మహారాష్ట్ర ప్రభుత్వం, బీజేపీ అండతోనే వీరు రంగంలోకి దిగినట్లు తెలుస్తోంది. మరోవైపు శివాజీ పార్క్ వద్ద పోలీసుల అనుమతి లేకపోయినా కాక్రోచ్ జనతా పార్టీ నిషేధాజ్ఞలు ఉల్లంఘించి ధర్నా చేపట్టడంపై స్థానికులు కొందరు ఇప్పటికే అభ్యంతరాలు వ్యక్తం చేస్తున్నారు. వీరు అంతటితో ఆగకుండా చర్యలు తీసుకోవాలని కోరుతూ పోలీసులకు ఫిర్యాదులు కూడా చేస్తున్నారు. ఈ మేరకు కాక్రోచ్ పార్టీ నేతలపై శివాజీ పార్క్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. అనుమతి లేకపోయినా, బాంబే హైకోర్టు 2013లో ఇచ్చిన తీర్పుకు విరుద్ధంగా, మహారాష్ట్ర ప్రభుత్వ నిషేధ ఉత్తర్వుల్ని ఉల్లంఘించి శివాజీ పార్క్‌లో నిరసనను కొనసాగించడానికి, భారీ జనసమీకరణకు ప్రయత్నించారంటూ ఈ ఫిర్యాదు చేశారు. ఇది శాంతియుత నిరసన కాదని, రాజకీయ నిరసన ముసుగులో చట్టాన్ని ధిక్కరించే ప్రయత్నమని ఫిర్యాదుదారులు ఆరోపించారు. రాజ్యాంగం కోసం పోరాడుతున్నామని చెప్పుకునేవారే, అదే రాజ్యాంగం ద్వారా ఏర్పాటైన హైకోర్టు అధికారాన్ని బహిరంగంగా సవాలు చేస్తున్నారని కూడా ఫిర్యాదులో పేర్కొన్నారు. రాజ్యాంగపరమైన బాధ్యతలను, న్యాయస్థాన ఆదేశాలను ఉద్దేశపూర్వకంగా విస్మరిస్తూ, రాజ్యాంగపరమైన హక్కులను డిమాండ్ చేయడం కుదరదన్నారు. ఒకవేళ ఇలాంటి ప్రవర్తనను అనుమతిస్తే, రేపు ఎవరైనా సరే కోర్టు ఆమోదించిన ఆంక్షలను ఉల్లంఘించారు.

# డ్రైవింగ్ పరీక్షల్లో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్

## ఆరు డ్రైవింగ్ టెస్ట్ ట్రాక్‌ల్లో ఏఐ వీడియో అనలిటిక్స్

## త్వరలో ప్రారంభించనున్న రవాణా శాఖ

**హైదరాబాద్, అక్టోబరు 2, ప్రభాతవార్త** తెలంగాణలో డ్రైవింగ్ లైసెన్సుల ప్రక్రియలో అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించాలని రవాణా శాఖ నిర్ణయించింది. ఇందుకు ఆరు డ్రైవింగ్ టెస్ట్ ట్రాక్‌లలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) ఆధారిత వీడియో అనలిటిక్స్‌ను ప్రవేశపెట్టేందుకు సిద్ధమవుతోంది. దీంతో తెలంగాణలో త్వరలో డ్రైవింగ్ లైసెన్స్ దరఖాస్తుదారులను ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ పరీక్షి ంచనుంది. వాహనం నడపడానికి, ట్రాఫిక్‌ను అధిగమించడానికి అవసరమైన నైపుణ్యాలు వారికి ఉన్నాయో లేదో కూడా ఇది నిర్ధారిస్తుంది. తద్వారా మూల్యాంకన ప్రక్రియలో మానవ జోక్యానికి ఆస్కారాన్ని తగ్గిస్తూ, డ్రైవింగ్ పరీక్షలను మరింత పారదర్శకంగా, స్థిరంగా నిర్వహించడమే లక్ష్యంగా పెట్టుకుంది. రవాణా శాఖ అధికారులు వెల్లడించిన వివరాలు ప్రకారం, మొదటి దశలో రాష్ట్రంలోని కరీంనగర్ ఆర్టీఓలోని డ్రైవింగ్ టెస్ట్ ట్రాక్‌తో పాటు, హైదరాబాద్, మల్కాజిగిరి, సైబరాబాద్ పరిధిలోని ప్రాంతాలతో సహా కోర్ అర్బన్ రీజియన్‌లోని ఐదు డ్రైవింగ్ టెస్ట్ ట్రాక్‌లను కవర్ చేయనున్నారు. ఇందుకు రవాణా, హెచ్ఎండిఏ అధికారులు ఇటీవల కొండాపూర్, నాగోల్ డ్రైవింగ్ టెస్ట్ ట్రాక్‌లను తనిఖీ చేశారు. ఈ బృందాలు ఇప్పటికే ఉన్న మౌలిక సదుపాయాలను అంచనా వేసి, ప్రతిపాదిత సాంకేతికతను స్థాపించడానికి అవసరాలను గుర్తించాయి. ఢిల్లీ, ఉత్తర ప్రదేశ్, ఒడిశా రాష్ట్రాల్లోని ఆటోమేటెడ్ డ్రైవింగ్ టెస్ట్ సిస్టమ్‌లపై జరిపిన అధ్యయనం ఆధారంగా ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. ఇటీవల ఈ మూడు రాష్ట్రాల్లో పర్యటించిన రవాణా శాఖ కమిటీ, తమ అధ్యయన ఫలితాలను తెలంగాణ

# కాంగ్రెస్, బిఆర్ఎస్ మధ్య పరస్పర అవినీతి ఒప్పందం

## ఉపాధ్యాయులను అక్రమంగా అరెస్టు చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నాం

## బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రాంచందర్ రావు

**హైదరాబాద్, అక్టోబరు 2 ప్రభాతవార్త:** తెలంగాణలో అధికారంలో ఉన్న కాంగ్రెస్, గతంలో పాలించిన బిఆర్‌ఎస్ పార్టీల మధ్య పరస్పర అవినీతి బాగోతాలను కప్పిపుచ్చుకునే క్విడ్ ప్రో కో నడుస్తోందని బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రాంచందర్ రావు తీవ్రస్థాయిలో మండిపడ్డారు. శుక్రవారం రాష్ట్ర బిజెపి కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. మొన్న సిరిసిల్ల సభలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గత ప్రభుత్వ మంత్రులు, కుటుంబీకుల ఆస్తులపై వ్యాఖ్యలు చేశారని, దానికి ప్రతిగా బిఆర్‌ఎస్ నేతలు కాంగ్రెస్ అవినీతిపై ఆరోపణలు చేసుకుంటున్నారే తప్ప, ప్రజలకు ఒరిగిందేమీ లేదని దుయ్యబట్టారు. "నువ్వు ఎంత తిన్నావు, నేను ఎంత తిన్నాను... మీరే అంతా తినేస్తే మాకేం మిగిల్చలేదు" అన్న చందంగా ఇరు పార్టీలు పరస్పర ఆరోపణలకే పరిమితమయ్యాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. కేంద్రంలో ప్రధాని నరేంద్ర మోడీ దేశానికి అవినీతి రహిత సుపరిపాలన అందిస్తుంటే, తెలంగాణలో మాత్రం ఎవరు ఎక్కువ అవినీతి చేయాలనే పోటీ పడుతున్నారని ఫైర్ అయ్యారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన 100 రోజుల్లో బిఆర్‌ఎస్ అవినీతి చిట్టా విప్పి అరెస్టులు చేస్తామని ప్రగల్భాలు పలికిందని, కానీ నేటికీ ఒక్క కేసులోనూ అరెస్టు చేయలేదని గుర్తు చేశారు. కేవలం పత్రికా ప్రకటనలకే పరిమితమై లోపాయికారీ ఒప్పందాలతో కాలం గడుపుతున్నారని దుయ్యబట్టారు. రాష్ట్రంలో ప్రజా సమస్యలను పరిష్కరించడంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని, ప్రశ్నించే వారిపై అక్రమ అరెస్టులతో ఉక్కుపాదం మోపుతోందని రాంచందర్ రావు ఆగ్రహం వ్యక్తం చేశారు. గత ప్రభుత్వం తెచ్చిన వివాదాస్పద జీవో 317ను బిజెపితో పాటు ఉపాధ్యాయులు తీవ్రంగా వ్యతిరేకించారని, దానికి ప్రత్యామ్నాయంగా ఈ ప్రభుత్వం తెచ్చిన జీవో 190ను సైతం సరిగ్గా అమలు చేయడం లేదని విమర్శించారు. జీవో 190 పరిధిలో దాదాపు 4000 మందికి ట్రాన్స్‌ఫర్లు/డిప్యుటేషన్లు రావాల్సి ఉండగా, కేవలం 100 నుంచి 200 మందికి మాత్రమే ఇచ్చి చేతులు దులుపుకున్నారని మండిపడ్డారు. దీనిపై గాంధీ భవన్ ఎదుట న్యాయబద్ధంగా ఆందోళన చేపట్టిన ఉపాధ్యాయులను పోలీసులతో అక్రమంగా అరెస్టు చేయించడాన్ని బీజేపీ పక్షాన తీవ్రంగా ఖండిస్తున్నామని స్పష్టం చేశారు. సమాజంలో ఎంతో గౌరవించదగిన ఉపాధ్యాయులతో పాటు రైతులు, విద్యార్థులు, రాజకీయ నాయకులను అరెస్టు చేస్తూ ప్రభుత్వం ఏం సందేశం ఇవ్వదలిచిందని ప్రశ్నించారు. టీచర్ల న్యాయమైన కోరికలను తక్షణమే నెరవేర్చాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో అన్నదాతల పరిస్థితి అత్యంత దయనీయంగా మారిందని, నీళ్ల లేక, కరెంట్ రాక పొలాలు ఎండిపోతుంటే ప్రభుత్వం చోద్యం చూస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. నల్గొండ జిల్లాలో బోరుబావుల్లో నీరులేక పంటలు ఎండిపోయి రైతులు కన్నీరుమున్నీరవుతున్నారని, జూరాలకు వెళ్తుంటే రైతులను, తమ పార్టీ నేతలను సైతం అరెస్టు చేశారని మండిపడ్డారు. ఖరీఫ్ సీజన్‌లో రైతులు ఇప్పటికే తీవ్రంగా నష్టపోయారని, రాబోయే రబీ పంటకు సిద్ధమవుతున్న అన్నదాతలను ఆదుకోవడానికి ప్రభుత్వం తక్షణమే ఒక విడత రైతు భరోసా నిధులను విడుదల చేసి వారి ఖాతాల్లో జమ చేయాలని డిమాండ్ చేశారు. ఈ మీడియా సమావేశం సందర్భంగా సినిమా, టివి రంగాలకు చెందిన పలువురు ప్రముఖులు బిజెపిలో చేరారు. బిజెపి స్టేట్ సినిమా సెల్ కోకన్వీనర్, నటుడు వైభవ్ సూర్య ఆధ్వర్యంలో టివి ఆర్టిస్ట్, న్యాయవాది స్వర్ణలత, ప్రముఖ టివి నటుడు లక్ష్మణ్, సీనియర్ కెమెరామెన్లు సురేష్, మహేష్ బిజెపిలో చేరారు. పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రాంచందర్ రావు వారికి పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో బిజెపి కిసాన్ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు బస్వాపురం లక్ష్మీ నర్సయ్య, పార్టీ రాష్ట్ర కార్యదర్శి భరత్ ప్రసాద్ ఉన్నారు.

# ప్రాణాలు తీసిన పచ్చని పైరు!

## పంటను కాపాడుకొనే ఆరాటంలో కరెంటు షాక్‌కు గురై దంపతుల మృతి - సిరిసిల్లలో విషాదం

**సిరిసిల్ల బ్యూరో, ప్రభాతవార్త :** కలసి బతికారు.. కలసే నేలకొరిగారు! కంటికి రెప్పలా కాపాడుకున్న ఆ పచ్చని పైరే వారి పాలిట కాలయముడవుతుందని ఊహించలేకపోయారు. అడవి జంతువుల బారి నుంచి పంటను కాపాడుకోవాలనే ఆరాటమే ఆ కౌలు రైతు దంపతులను నూరేళ్ల నిండైన జీవితానికి నూరేళ్ల దూరం చేసింది. రాజన్న సిరిసిల్ల జిల్లా గంభీరావుపేట మండల కేంద్రంలో శుక్రవారం చోటుచేసుకున్న ఈ హృదయవిదారక సంఘటన గ్రామంలో తీవ్ర శోకసంద్రాన్ని నింపింది. గంభీరావుపేట గ్రామానికి చెందిన గంట దేవయ్య (65), ఆయన భార్య లక్ష్మి (58) ఇద్దరూ కౌలుకు పొలాన్ని తీసుకుని వ్యవసాయం చేస్తూ జీవనం సాగిస్తున్నారు. రోజూ రాత్రింబవళ్లు శ్రమించి పంటను కాపాడుకోవడం వారి దినచర్య. అయితే, ఊరి పరిధిలో అడవి జంతువుల బెడద తీవ్రంగా ఉండటంతో, రాత్రివేళల్లో పంటను కాపాడుకునేందుకు పొలం వద్ద ఉన్న స్టార్టర్ డబ్బా నుంచి విద్యుత్ వైర్ తీసి పొలం చుట్టూ రక్షణగా ఏర్పాటు చేశారు. ఎప్పటిలాగే గురువారం సాయంత్రం దంపతులిద్దరూ కలిసి చేను వద్దకు వెళ్లారు. అయితే, అక్కడ ఏర్పాటు చేసిన రక్షణ విద్యుత్ వైరు ప్రమాదవశాత్తు తగలడంతో ఇద్దరూ కరెంట్ షాక్‌కు గురై అక్కడికక్కడే ప్రాణాలు విడిచారు. శుక్రవారం ఉదయం పక్క పొలం రైతు గొల్ల నిశాంత్ తమ పొలం వైపు వెళ్తుండగా, దేవయ్యలక్ష్మి దంపతులు మృతిచెంది ఉండటాన్ని గమనించాడు. వెంటనే ఈ విషయాన్ని వారి కుమార్తె గంధవు భాగ్యలక్ష్మికి తెలియజేశాడు. కంటికి నలికంటిగా చూసుకున్న తల్లిదండ్రులు చేనులోనే నిశ్చేష్టంగా పడి ఉండటం చూసి కుమార్తె, కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరయ్యారు. మృతి చెందిన దంపతుల కుమార్తె భాగ్యలక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు గంభీరావుపేట పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. పంట రక్షణ కోసం తమంతట తామే అమర్చుకున్న కరెంట్ వైరు తగిలి ప్రమాదవశాత్తు మృతి చెందారని, ఈ ఘటనపై ఎవరిపైనా అనుమానాలు లేవని భాగ్యలక్ష్మి పోలీసులకు తెలిపింది. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు.

# పంట పొలాల్లో గంజాయి మొక్కలు స్వాధీనం




**నార్నూర్, అక్టోబర్ 02, ప్రభాతవార్త:** గంజాయి పండించిన వారికి ప్రభుత్వ పథకాలు రాకుండా సిఫార్సు చేస్తామని సిఐ అంజమ్మ అన్నారు. గాదిగూడ మండలంలోని ఖండోర్ రాంపూర్ గ్రామ శివారులో వ్యవసాయ భూమిలో అక్రమంగా గంజాయి సాగు చేస్తున్న వ్యక్తిని గాడిగూడ పోలీసులు అరెస్ట్ చేసి, 24 గంజాయి మొక్కలను స్వాధీనం చేసుకున్నారు. నమ్మదగిన సమాచారం మేరకు గాడిగూడ ఎస్ఐ జి. రమ్య ఆధ్వర్యంలో పోలీసు సిబ్బంది ఖండోర్ రాంపూర్ గ్రామ శివారులోని వ్యవసాయ భూమిలో తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా పత్తి, కంది పంటల మధ్య అంతర పంటగా సాగు చేస్తున్న 24 గంజాయి మొక్కలను గుర్తించారు. ఒక్కో మొక్క విలువ సుమారు రూ.10,000గా అంచనా వేయగా, మొత్తం 24 మొక్కల విలువ సుమారు రూ.2,40,000గా ఉంది.

గేడం రాజేశ్వర్(38) వ్యవ సాయ భూమిలో పత్తి, కంది పంటల మధ్య గంజాయి మొక్కలను సాగు చేసినట్లు పోలీసుల విచారణలో వెల్లడైంది. గంజాయి పండించిన వారి పై ప్రభుత్వ పథకాలు రాకుండా సిఫార్సు చేయడం జరుగుతుందని తెలిపారు. గంజాయి రవాణా చేసిన, పండించిన, వ్యాపారం చేసిన, సేవించిన వారిపై చట్టరీత్యా చర్యలు తప్పవని హెచ్చరించారు.

# పెండింగ్‌ట్రాఫిక్ చలాన్లపై సుప్రీం' సీరియస్

● అన్ని సేవలు నిలిపివేయాలని ఆదేశం



**న్యూఢిల్లీ, అక్టోబరు 2:** ట్రాఫిక్ చలాన్లు కట్టకుండా అలాగే వదిలేస్తే బండి జప్తు అవ్వడమే కాకుండా, పెండింగ్ ఫైన్లు ఉన్న వాహనాలకు సంబంధించి దాదాపు అన్ని రకాల ఆన్‌లైన్ సేవలను నిలిపివేసేందుకు అధికారులు సిద్ధమవుతున్నారు. ఈ విషయాన్ని సుప్రీంకోర్టు అత్యంత తీవ్రంగా పరిగణిస్తూ, పెండింగ్ ఈచలాన్లు ఉన్న వాహనాలపై కఠిన చర్యలు తీసుకోవాలని అన్ని రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలను ఆదేశించింది. కేవలం చలాన్లు విధిస్తే సరిపోదని, వాటిని వసూలు చేయడంలో స్పష్టమైన చర్యలు ఉండాలని జస్టిస్ జె.బి. పార్డీవాలా, జస్టిస్ కె.వి. విశ్వనాథన్‌లతో కూడిన ధర్మాసనం స్పష్టం చేసింది. దేశవ్యాప్తంగా జారీ అవుతున్న చలాన్లలో దాదాపు 47 శాతం వరకు పెండింగ్‌లోనే ఉండటంపై కోర్టు అసంతృప్తి వ్యక్తం చేసింది. అధికారులు ఇకపై అకస్మాత్తుగా రోడ్లపై తనిఖీలు చేసి, పెండింగ్ చలాన్లు ఉన్నట్లు తేలితే ఆ వాహనాలను వెంటనే సీజ్ చేయాలని స్పష్టమైన ఆదేశాలు ఇచ్చింది. ఇక, చలాన్లు చెల్లించకపోతే ఎదురయ్యే చిక్కులు మామూలుగా లేవు. బాకీ బకాయిలు తీర్చేవరకు సదరు వాహనాలకు సంబంధించిన పలు ఆన్‌లైన్ సేవలను పూర్తిగా నిలిపివేస్తారు. వాహనం రిజిస్ట్రేషన్ సర్టిఫికేట్ రెన్యూవల్ చేయడం కుదరదు, నకిలీ ఆర్‌సీ ఇవ్వరు, అలాగే యజమాని అడ్రస్ మార్చాలన్నా కుదరదు. ఫిట్‌నెస్ సర్టిఫికేట్ నిరాకరించడమే కాకుండా, పరివాహన్ పోర్టల్‌లో ఆ వాహనాన్ని బ్లాక్‌లిస్ట్‌లో పెడతారు. ఇక వాహనాన్ని వేరొకరికి అమ్మాలన్నా లేదా వేరే పేరు మీదకు మార్చాలన్నా (ఓనర్ షిప్ ట్రాన్స్‌ఫర్) కుదరదు. అన్నింటికంటే ముఖ్యంగా, పెండింగ్ చలాన్లు ఉన్న బండ్లకు పొల్యూషన్ పియుసి సర్టిఫికేట్ కూడా ఇవ్వకూడదని సుప్రీంకోర్టు స్పష్టంగా ఆదేశించింది. ఒక్కసారి కాకుండా పదే పదే ట్రాఫిక్ నిబంధనలను ఉల్లంఘించే డ్రైవర్లపైనా కఠిన చర్యలకు కోర్టు పిలుపునిచ్చింది. పలుమార్లు నియమాలు ఉల్లంఘించిన వారి డ్రైవింగ్ లైసెన్స్ రెన్యూవల్‌ను నిలిపివేయడంతో పాటు, ప్రస్తుతం చెల్లుబాటులో ఉన్న లైసెన్సులను కూడా సస్పెండ్ చేయడానికి తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించింది. రాష్ట్ర ప్రభుత్వాలు ఈచలాన్లు జారీ చేయడమే తప్ప, పెండింగ్ సొమ్మును వసూలు చేయడంలో ఘోరంగా విఫలమవుతున్నాయని ధర్మాసనం వ్యాఖ్యానించింది. ఇప్పటివరకు సేకరించిన సమాచారం ప్రకారం దేశవ్యాప్తంగా వివిధ రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లో ఈ చలాన్ల రూపంలో ఏకంగా రూ. 49,194 కోట్లు వసూలు కావాల్సి ఉంది. అందులో ఇప్పటివరకు కేవలం రూ. 26,175 కోట్లు మాత్రమే వసూలైంది, మిగతా భారీ సొమ్ము ఇంకా పెండింగ్‌లోనే ఉండిపోయింది. కేవలం కాగితాల మీద చలాన్లు రాయడం కాకుండా, క్షేత్రస్థాయిలో కఠినంగా వ్యవహరించి వసూలు చేయాల్సిన అవసరం ఉందని అధికారులకు సూచించింది. మోటారు వాహనాల చట్టాన్ని సమర్థవంతంగా అమలు చేయడానికి 2012లో దాఖలైన ఈ పిటిషన్‌పై దాదాపు 14 ఏళ్లుగా విచారణ జరుగుతోంది. ఇన్ని సంవత్సరాలుగా తాము ఎన్నో ఆదేశాలు ఇస్తున్నా, అవి కేవలం కాగితాలకే పరిమితమైతే సహించేది లేదని, అధికారులు ఇకనైనా మారకపోతే కఠిన చర్యలు తీసుకుంటామని సుప్రీంకోర్టు తీవ్రంగా హెచ్చరించింది.

# ఫ్లైదుబాయి ఘటనపై రాహుల్ మౌనం దేనికి?

● బిజెపి ఎంపి సంబిత్‌పాత్రా ప్రశ్నలు

**న్యూఢిల్లీ:** ఫ్లైదుబాయి ఘటనలో భారత కెప్టెన్ స్మిత్ మచ్చర్ పేరు దేశదేశాలు ప్రశంసిస్తుంటే విపక్షనేత రాహుల్ గాంధీ స్పందించకపోవడం ఏమిటని బిజెపి నేతలు విమర్శలు ఎక్కుపెట్టారు ఇజ్రాయిల్‌లోని ప్రతీ ఇంటిలో కూడా ఇప్పుడు స్మిత్ పేరే వినిపిస్తోంది. ఇంతలా హీరోగా మారిన స్మిత్‌పై కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ స్పందించకపోవడం విడ్డూరంగా కనిపిస్తోంది. దీనిపై బీజేపీ ప్రశ్నల వర్షం కురిపిస్తోంది. రాహుల్ ఎందుకు మోనంగా ఉన్నారంటూ బీజేపీ అధికార ప్రతినిధి ప్రదీప్ భండారీ సోషల్ మీడియాలో పోస్ట్ చేశారు. రాహుల్ గాంధీ ఎందుకు ట్వీట్ చేయలేదని బీజేపీ ఎంపీ సంబిత్ పాత్ర కూడా ప్రశ్నను లేవనెత్తారు. తాను ఈ అంశాన్ని రాజకీయం చేయాలని అనుకోవడం లేదని, అయితే రాహుల్ గాంధీ మోనం వెనక ఒక నిర్దిష్ట కారణం ఉంటుందని, ఆయన మోనానికి బుజ్జగింపు రాజకీయం కూడా కారణం కావచ్చని అన్నారు. ఫ్లైదుబాయ్ విమాన ఘటనపై ప్రపంచం స్పందిస్తోంది. ముఖ్యంగా భారతీయ పైలట్ స్మిత్ మచ్చర్ ధైర్యాన్ని అంతా కొనియాడుతున్నారు. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, ఇజ్రాయిల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహూలు స్మిత్ హీరో అంటూ, ప్రయాణికుల ప్రాణాలు కాపాడేందుకు కారణమయ్యారంటూ ప్రశంసించారు. ఇక ప్రధాని నరేంద్రమోడీ స్మిత్ ధైర్యాన్ని మెచ్చుకున్నారు. శుక్రవారం ప్రధాని, స్మిత్‌తో వీడియో కాల్‌లో మాట్లాడారు. 180 మంది ప్రయాణికులతో దుబాయ్ నుంచి ఇజ్రాయిల్‌లోని టెల్ అవీవ్ వెళ్తున్న ఫ్లై దుబాయ్ విమానాన్ని ఒమన్ జాతీయుడైన కోపైలట్ కూల్చడానికి ప్రయత్నించాడు. పైలట్ స్మిత్ పటేల్‌పై దాడి చేసి, విమానాన్ని తన కంట్రోల్‌లోకి తీసుకోవాలని అనుకున్నాడు. కానీ స్మిత్ వెంటనే కాక్‌పిట్ డోర్లు తెరవడంతో, ప్రయాణికులు కాక్‌పిట్‌లోకి ప్రవేశించి కోపైలట్‌ను అదుపు లోకి తీసుకున్నారు. విమానం కుప్పకూలకుండా, సౌదీ అరేబియాలో ల్యాండ్ అయ్యేలా చేశారు. దీంతో ఇప్పుడు స్మిత్ మచ్చర్ పేరు ప్రపంచవ్యాప్తంగా మారుమోగుతోంది.

# అక్రమంగా నడుస్తున్న గుట్కా తయారీ కేంద్రం గుట్టురట్టు

● ముగ్గురు నిందితులు, ఇద్దరు బాలురను అదుపులోకి తీసుకున్న టాస్క్ ఫోర్స్ పోలీసులు...
● రూ.50 లక్షల విలువైన నిషేధిత గుట్కా, యంత్రాలు, ప్యాకింగ్ మెటీరియల్ జప్తు...

**మెహిదీపట్నం,అక్టోబర్ 02, ప్రభాతవార్త :** విశ్వసనీయ సమాచారం మేరకు హైదరాబాద్ కమిషనర్స్ టాస్క్ ఫోర్స్ (గోల్కొండ జోన్) ఆసిఫ్ నగర్ పోలీసులు సంయుక్తంగా నిర్వహించిన దాడిలో, అక్రమంగా నడుస్తున్న గుట్కా, పాన్ మసాలా తయారీ కేంద్రాన్ని పట్టుకున్నారు. హైదరాబాద్ సిటీ టాస్క్ ఫోర్స్ అదనపు డిసిపి ఈ వివరాలను వెల్లడించారు. ఆసిఫ్ నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని మురాద్ నగర్, చోటీ మసీదు ఎదురుగా ఉన్న ఇల్లు పై దాడి చేసి, అనుమతులు లేకుండా అక్రమంగా నిషేధిత గుట్కా తయారు చేస్తున్న ముగ్గురు కార్మికులను అదుపులోకి తీసుకోవడంతో పాటు ఇద్దరు చట్టానికి లో బడిన బాలురను సీసీఎల్ రక్షించారు. ఈ దాడిలో ఎలాంటి ఎఫ్.ఎస్.ఎస్.ఎ.ఐ, జి.ఎస్.టి, పొగాకు లైసెన్సులు లేకుండా, ప్యాకెట్లపై కనీస తయారీ తేదీ, గడువు తేదీ, బ్యాచ్ నంబర్, ధర ఎమ్మార్పీ, ఆరోగ్య హెచ్చరికలు లేకుండా హానికరమైన, బాద్ షా, సాగర్ పాన్ మసాలా, గుట్కా ఉత్పత్తులను తయారు చేస్తున్నట్లు పోలీసులు గుర్తించారు. ఉత్తరప్రదేశ్ ప్రాంతానికి చెందిన రోహిత్ కుమార్



అలియాస్ రోహిత్ యాదవ్ (25) కార్మికుడు. రాజస్థాన్ ప్రాంతానికి చెందిన అలియాస్ సౌరభ్ చౌహాన్ (20) కార్మికుడు, అలియాస్ రాహుల్ పర్మార్ (21) – కార్మికుడు, చట్టానికి లోబడిన బాలుడు సీసీఎల్ కార్మికుడు. కాగా జుబేర్ (తయారీదారు), ముజఫ్ఫర్ అలియాస్ దాదా (తయారీదారు భవన యజమాని) పరారీ లో ఉన్నారు. స్వాధీనం చేసుకున్న సొత్తు (మొత్తం విలువ: ..50,00,000/): అనుమతి లేనీ పాన్ మసాలా ప్యాకెట్లు 100, విడి జర్దా సంచులు: 50 కేజీల సంచి, 10 కేజీల సంచితో పాటు కాథా, సుపారీ, సున్నం ఉన్న ముడి సరుకుల సంచులు14, తయారు చేసిన గుట్కా మిశ్రమం 60 కేజీల సంచులు, 24, 100 కేజీల సంచులు, ప్యాకింగ్ రోల్స్ , గోల్డ్ 9000, బాద్ షా, జోకర్, సాగర్ పేపర్ రోల్స్, గుట్కా ప్యాకింగ్ మిషన్లు 3, గుట్కా మిక్సింగ్ మిషన్, గుట్కా ఓవెన్ మిషన్, సుపారీ కటింగ్ మిషన్, పెద్ద జోకే మిషన్, చిన్న జోకే మిషన్లు2, సీలింగ్ మిషన్, సంచులు కుట్టే మిషన్ లను స్వాధీనం చేసుకున్నారు. అయితే ముజఫ్ఫర్ అలియాస్ దాదా, జుబేర్ ఇద్దరూ కలిసి మురాద్ నగర్‌లోని తమ భవనంలో ఎలాంటి ప్రభుత్వ అనుమతులు లేకుండా చట్టవిరుద్ధంగా ఈ తయారీ కేంద్రాన్ని నిర్వహిస్తున్నారు.

లాభాల కోసం ప్రజల ఆరో గ్యాన్ని పణంగా పెడుతూ, కేన్సర్ వంటి ప్రాణాం తక వ్యాధులకు కారణమయ్యే నిషేధిత గుట్కా పదార్థాలను నగరంలో విక్రయిస్తున్నారు. అంతేకాకుండా, ఈ కేంద్రంలో మైనర్ పిల్లలను ప్రమాదకర వాతావరణంలో పనిలో కుదుర్చుకో వడమే కాకుండా, పరిసర ప్రాంతాల్లో తీవ్ర దుర్గంధం, ప్రజారోగ్యానికి భంగం కలిగిస్తున్నా రు. లభించిన పక్కా సమాచారంతో గోల్కొండ జోన్ టాస్క్ ఫోర్స్, ఆసిఫ్ నగర్ పోలీసులు ఉమ్మడిగా దాడి చేసి ఈ కేంద్రాన్ని సీజ్ చేశారు. ఆసిఫ్ నగర్ పోలీస్ స్టేషన్‌లో చైల్డ్ లేబర్ యాక్ట్ సెక్షన్ కింద కేసులు నమోదు చేశారు. కాగా ఈ దాడి, అరెస్టులను హైదరాబాద్ సిటీ టాస్క్ ఫోర్స్ అదనపు డిప్యూటీ కమిషనర్ ఆఫ్ పోలీస్ పర్యవేక్షణలో, గోల్కొండ జోన్ టాస్క్ ఫోర్స్ ఇన్స్పెక్టర్ ఎం. మహేష్, ఆసిఫ్ నగర్ ఇన్స్పెక్టర్ ఎన్. ఆనంద్, ఎస్సైలు కె. వెంకట్రామన్, ఎన్. నవీన్, వారి సిబ్బంది నిర్వహించారు.



## మియాపూర్ హోటల్‌లో వైద్య విద్యార్థిని అనుమానాస్పద మృతి

**మియాపూర్, అక్టోబర్ 2, ప్రభాతవార్త :** మియాపూర్‌లోని ఓ హోటల్ గదిలో 27 ఏళ్ల పీజీ వైద్య విద్యార్థిని కొమటి సృజన శుక్రవారం అనుమానాస్పద పరిస్థితుల్లో మృతి చెందారు. హనుమకొండలో మొదటి సంవత్సరం పీజీ పీడి యాట్రిక్స్ చదువుతున్న సృజన సెప్టెంబర్ 30న హైదరాబాద్‌కు వచ్చిన అనంతరం కనిపించకుండా పోయారు. ఆమె మొబైల్ ఫోన్ లొకేషన్ ఆధారంగా మియాపూర్‌లోని హోటల్ గ్రాండ్ బ్రోచిల్‌ను గుర్తించిన పోలీసులు, 502వ గదిని స్పేర్‌కీతో తెరిచి పరిశీలించగా మంచంపై సృజన మృతదేహం కనిపించింది. మృతురాలి తండ్రి కె. భూమయ్య ఇచ్చిన ఫిర్యాదులో రవి కుమార్ అనే వ్యక్తి గతంలో సృజన బంగారు గొలుసును తీసుకున్నట్లు పేర్కొన్నారు. అనంతరం ఆమె హైదరాబాద్‌కు వచ్చినట్లు తెలిపారు. ఈ ఘటనపై మియాపూర్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. మృతికి గల కారణాలు, ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలను పోలీసులు విచారిస్తున్నారు.

# రైతాంగానికి వ్యవసాయ వర్సిటీ వెన్ను దన్నుగా ఉండాలి

● మహాత్మాగాంధీ జయంతి వేడుకల్లో వ్యవసాయ మంత్రి తుమ్మల ఆకాంక్ష

**అత్తాపూర్ అక్టోబరు2 ,ప్రభాతవార్త :** రాజేంద్రనగర్‌లోని ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణా వ్యవసాయ విశ్వవిద్యాలయం ఆడిటోరియంలో మహాత్మా గాంధీ 157 వ జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. ముఖ్య అతిధి గా రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు హాజరుఅయ్యారు. జాతి పిత మహాత్మా గాంధీ, మాజీ ప్రధాని లాల్ బహదూర్ శాస్త్రిల జయంతి కార్యక్రమాలని ఇంత ఘనంగా నిర్వహించినందుకు వ్యవసాయ విశ్వవిద్యాలయం ఉప కులపతి ప్రొఫెసర్ అల్దాస్ జానయ్యని మంత్రి అభినందించారు. మహనీయుల త్యాగాలని, పద్ధతులని స్ఫూర్తి గా తీసుకోవాలని ఆయన సూచించారు. నేడు మనం స్వేచ్ఛా వాయువుల ని పీల్చడానికి మహాత్మా గాంధీ అహింసా పోరాటం, త్యాగాలే కారణమన్నారు. ఆనాటి ప్రధాని లాల్ బహదూర్ శాస్త్రీ చేతుల మీదుగా ఏర్పాటు అయిన ఈ వ్యవసాయ విశ్వవిద్యాలయం నేడు దేశం లోనే వ్యవసాయ రంగానికి తలమానికం గా నిలిచిందని మంత్రి అభినందించారు. నిరంతరం రైతాంగానికి చేదోడు, వాదోడు గా ఉంటూ కొత్త టెక్నాలజీలని అందించి వారు అధిక దిగుబడులు సాధించి స్థిర ఆదాయం పొందేలా విశ్వవిద్యాలయం సిబ్బంది చూడాలని మంత్రి సూచించారు. తద్వారా నవభారతానికి నాంది పలకాలని తుమ్మల నాగేశ్వరరావు పిలుపునిచ్చారు. మహాత్మా గాంధీ



అడుగుజాడల్లో ప్రతి ఒక్కరూ నడవాలని రాజేంద్రనగర్ శాసనసభ్యులు శ్రీ టి. ప్రకాష్ గౌడ్ కోరారు. అనేక మంచి కార్యక్రమాలు నిర్వహిస్తూ వ్యవసాయ విశ్వవిద్యాలయం అసమాన సేవలు అందిస్తోందని ప్రకాష్ గౌడ్ అభిప్రాయపడ్డారు. నేటి యువత లో స్వాతంత్ర్య పోరాట చరిత్ర పై అవగాహన కల్పించడం కోసమే మహాత్మా గాంధీ జయంతి కార్యక్రమం పెద్ద ఎత్తున నిర్వహించామని వ్యవసాయ విశ్వవిద్యాలయం ఉప కులపతి ప్రొఫెసర్ అల్దాస్ జానయ్య అన్నారు. వారి త్యాగాలని స్మరించుకొని స్ఫూర్తి పొందాలని ఆయన అన్నారు. అందుకే అన్ని విశ్వవిద్యాలయాల విద్యార్థుల కి వ్యాసరచన, వృక్తత్వ పోటీలని నిర్వహించామని వివరించారు. 1965 లో నాటి ప్రధాన మంత్రి శ్రీ లాల్ బహదూర్ శాస్త్రీ ఈ వ్యవసాయ విశ్వ విద్యాల యాన్ని జాతికి అంకితం చేశారని తెలిపారు. ఆ మహనీయుల స్ఫూర్తి తో దేశ వ్యవసాయ, గ్రామీ ణ రంగాల అభివృద్ధికి ప్రతి ఒక్కరూ కృషి చేసి వికసిత్ భారత్ ని సాధించాలని అల్దాస్ జానయ్య కోరారు. ఈ సందర్భంగా స్వాతంత్ర్య సమరయో ధులు ఉన్నం వెంకయ్య, జి. నర్సయ్య, వెంకట శ్వేరరావులని, గాంధీయన్ స్కాలర్, హైకోర్టు న్యా యవాది డాక్టర్ ఏ. రఘు కుమార్ లని మంత్రి సత్కరించారు. అదే విధంగా రాష్ట్రం లోని 15 విశ్వవిద్యాలయాల విద్యార్థుల కి తెలుగు, ఆంగ్లం లో నిర్వహించిన వ్యాసరచన, వృక్తత్వ పోటీలలో మొదటి, రెండవ స్థానాల్లో నిలిచిన ఎనిమిది మంది విద్యార్థులకి మంత్రి, ఉప కులపతి, ఇతర అధికారులు బహుమతులు అందచేశారు. వ్యవసా య విశ్వవిద్యాలయ విద్యార్థులు ప్రదర్శించిన దేశభక్తి సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నా యి. ఈ కార్య క్రమం లో రంగారెడ్డి జిల్లా అదనపు కలెక్టర్ చంద్రారెడ్డి, వివిధ విశ్వవిద్యాల యాల అధికారులు, విద్యార్థులు పెద్ద సంఖ్య లో పాల్గొన్నారు.

# సంతోషిమాత విగ్రహంపై కర్రతో దాడి

● దేహశుద్ధి చేసి పోలీసులకు అప్పగించిన భక్తులు

**ఎల్.బి.నగర్, అక్టోబర్ 2 ప్రభాతవార్త:** గర్భగుడిలోని సంతోషిమాత విగ్రహంపై దుండగుడు కర్రతో దాడి చేశాడు. దీంతో భక్తులందరూ ఒక్కసారిగా హావాక్కయ్యారు. విగ్రహంపై కర్రలతో దాడి దేవాలయంలో పనిచేసే పంతులుపై కూడా దాడి చేసి పారిపోతున్న దుండగున్ని భక్తులు పట్టుకొని దేహశుద్ధి చేసి పోలీసులకు అప్పగించారు. ఈ సంఘటన చైతన్యపురి పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు, భక్తులు తెలిపిన వివరాల ప్రకారం... దిల్ సుక్ నగర్ బస్ డిపో పక్కన ఉన్న శ్రీసంతోషిమాత దేవాలయంలో శుక్రవారం ఉదయం పూజలు జరుగుతున్నాయి. కాగా మహమ్మద్ అన్సా రి (41) అనే వ్యక్తి రెండు కర్రలు తీసుకొని నేరుగా గర్భగుడిలోకి ప్రవేశించి సంతోషిమాత అమ్మవారి విగ్రహంపై కర్రలతో దాడికి పాల్పడ్డాడు. వెంటనే అక్కడి నుంచి పారిపోయే ప్రయత్నం చేయగా భక్తులు అతన్ని పట్టుకొని దేహశుద్ధి చేసి తాళ్లతో కట్టేశారు. పోలీసులకు సమాచారం ఇవ్వడంతో వెంటనే పోలీసులు అక్కడికి చేరుకొని నిందితుడిని చైతన్యపురి పోలీస్ స్టేషన్కు తరలించారు. ఏసిపి రవీందర్ రెడ్డి, ఇన్స్పెక్టర్ సైదులు ఇతర పోలీస్ సిబ్బంది హుటాహుటిన సంఘటన స్థలానికి చేరుకున్నారు. ఈలోపే బిజెపి నాయకులు, కార్యకర్తలు పెద్దఎత్తున దేవాలయం వద్దకు తరలివచ్చి సంఘటన విషయాన్ని తెలుసుకొని ఆందోళన చేపట్టారు. అప్పటినుంచి విజయవాడ




జాతీయ రహదారిపై బైఠాయించి పెద్దఎత్తున ఆందోళనకు దిగారు. దీంతో రహదారిపై ట్రాఫిక్ సమస్య తలెత్తింది. ఆందోళన నిర్వహించాలని పోలీసులు ఎంత నచ్చ చెప్పినప్పటికీ బిజెపి నాయకులు వినకపోవడంతో వారిని పోలీసులు బలవంతంగా అక్కడి నుంచి పోలీస్ స్టేషన్కు తరలించారు. అయితే విగ్రహంపై కర్రతో దాడికి పాల్పడ్డ మహమ్మద్ అన్సా రి దేవాలయానికి 300 మీటర్ల దూరంలోనే అద్దెనివాసంలో ఉంటున్నాడు. అతని భాష వేరే విధంగా ఉందని అతను ఇండియన్ సిటిజన్ కాదేమోనని అనుమానాన్ని స్థానికులు వ్యక్తం చేస్తున్నారు. నిందితుడు విదేశీయుడై ఉంటాడని అనుమానాన్ని వ్యక్తం చేస్తున్నారు. బిజెపి, జనసేన విశ్వహిందూ పరిషత్, హిందూ వాహిని, ఇతర పలు సంఘాలు పెద్దఎత్తున ఆందోళనకు దిగారు. నాయకులు వనపల్లి శ్రీనివాసరెడ్డి, రంగ నరసింహా గుప్తా, బత్తుల సుమన్ గౌడ్, శంకర్ గౌడ్, బి.యశ్పాల్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు. మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నారు.

# నిబద్ధతతో పనిచేస్తున్న 'మరసం'

● 40 సంవత్సరాల సభలో మాజి మంత్రి హరీష్‌రావు




**సైఫాబాద్, అక్టోబరు 2 ప్రభాతవార్త:** ఒక సంఘాన్ని ఏర్పాటు చేయడం ఎంతో సులువేన ని, అయితే ఎన్నో వత్తిళ్ళు తట్టుకుని 4 దశాబ్దా లుగా మంజీరా రచయిత సంఘం (మరసం) కొన సాగడం అందులోని కవుల పనితీరు నిబద్ధత, నిజాయితీకి నిదర్శనమని అసెంబ్లీలో డిప్యూటి ఫ్లోర్ లీడర్ టి.హరీష్‌రావు చెప్పారు. ప్రభుత్వాల వత్తిళ్ళు, బెదిరింపులు ఎదురైన సంస్థ తన ప్రస్థా నాన్ని కొనసాగించిందన్నారు. శుక్రవారం బషీర్ బాగ్ ప్రెస్‌క్లబ్‌లో జరిగిన మరసం 40 వసంతాల మహాసభకు ఆయన ముఖ్యఅతిధిగా పాల్గొని ప్రసంగించారు. 1992లో జరిగిన మద్యపాన నిషేద ఉద్యమం, అకలిచావులు, రైతుల ఆత్మహత్యలు, గుట్కా నిషేదం తదితర ప్రజా, సామాజిక సమస్యలపై మరసం పోరాడిందని ఆయన గుర్తు చేశారు. తెలంగాణ ఉద్యమం తొలినాళ్ళలో తెలంగాణ రచయితలు, మేధావులపై ఉన్న చిన్న చూపును నందిని సిధారెడ్డి తిప్పికొట్టారని హరీష్ రావు చెప్పారు.

తెలంగాణ ఏర్పడిన తరువాత కెసిఆర్ ప్రభుత్వం సాహిత్య అకాడమీని పునరుద్ధరించి, నందిని సిధారెడ్డిని తొలి ఛైర్మన్‌గా నియమించిందన్నారు. ఈ సభకు మంజీరా రచయితల సంఘం అధ్య క్షుడు రంగాచారి అధ్యక్షత వహించగా, నందిని సిధారెడ్డి, మాజీ ఎమ్మెల్సీ దేశపతి శ్రీనివాస్, మాజీ ఛైర్మన్ దేవి ప్రసాద్, టియూడబ్ల్యూజే రా ష్ట్ర అధ్యక్షుడు విరాహత్‌ఆలీ, ప్రముఖ కవి నాళే శ్వరం శంకరం, ప్రముఖ జర నలిస్టు కె.అంజయ్య తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణలో బిసిల అణచివేతకు కుట్ర

● ఎపిలో కోర్టులు సైతం బిసిలకు వ్యతిరేకంగా తీర్పులు ఇస్తున్నాయి
● ఆవేదన వ్యక్తం చేసిన రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య

**సైఫాబాద్, అక్టోబరు 2 ప్రభాతవార్త:** రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం పచ్చిగా బిసి వ్యతిరేక వైఖరిని అవలంభిస్తూ విద్యా, ఉద్యో, ఆర్థిక, రాజకీయ రంగాలలో అణిచివేసేందుకు కుట్రచేస్తున్నదని, మరొక వైపు కోర్టులు సైతం బిసిలకు వ్యతిరేకంగా తీర్పులు ఇస్తున్నాయని రాజ్యసభ సభ్యుడు, జాతీయ బిసి సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే బిసి వ్యతిరేక చర్యలకు స్వస్తి పలికి బిసిలకు అన్ని రంగాలలో జనాభా ప్రకారం వాటా కల్పించాలని ఆయన డిమాండ్ చేశారు. శుక్రవారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఉభయ తెలుగు రాష్ట్రాలకు చెందిన 14 బిసి సంఘాల ముఖ్యనాయకులు సమావేశంలో ఆయన ముఖ్యఅతిధిగా పాల్గొని ప్రసంగించారు. ఇటీవల కాంగ్రెస్ పార్టీ ప్రకటించిన రెండు ఎంఎల్‌సి స్థానాలలో ఒక్కటి కూడా బిసిలకు కేటాయించకుండా ఒకే అగ్రకులానికి రెండు సీట్లు కేటాయించి, బిసిలను అవమానపరిచిందని ఆరోపించారు. దీనిని వెంటనే పునపరిశీలించి ఒక సీటును బిసిలకు కేటాయించాలని డిమాండ్ చేశారు. ఇటీవల



అభివాదం చేస్తున్న తెలుగు రాష్ట్రాల బిసి నేతలు. చిత్రంలో ఆర్.కృష్ణయ్య తదితరులు

ప్రభుత్వం నియమించిన సమాచార కమిషన్ల నియమాకాల్లో ఒక్క బిసిని కూడా నియమించకపోవడం ఇది బిసిల అణిచివేత చర్యగా భావిస్తున్నామని, రాష్ట్ర మంత్రి వర్గంలో ఇద్దరికి మాత్రమే అవకాశం కల్పించి, ప్రాధాన్యత లేని నామమాత్రపు శాఖలు కేటాయించిందని, వాస్తవానికి 8 మంత్రి పదవులు బిసిలకు రావాలని, అలాగే నామినేటెడ్ పోస్టులలో బిసిల జనాభా 56 శాతం ప్రకారం 15 శాతం వాటా కల్పించాలని ఆయన డిమాండ్ చేశారు.

**ఎపి ప్రభుత్వం 34శాతం బిసి రిజర్వేషన్‌లకు చట్ట బద్ధత కల్పించాలి**

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం బిసిలకు గ్రామ పంచాయితీ, పట్టణ, స్థానిక సంస్థల ఎన్నికల్లో 34 శాతం రిజర్వేషన్‌లు కల్పిస్తూ జారీ చేసిన ఉత్తర్వులను హైకోర్టు కొట్టివేసిందని ఆర్.కృష్ణయ్య ఆవేదన వ్యక్తం చేశారు. ఎపి ముఖ్యమంత్రి ఎన్.చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి కొణిదల పవన్‌కళ్యాణ్ ఈ రిజర్వేషన్‌లు అమలు కోసం ఢిల్లీలో ప్రధాన మంత్రి నరేంద్రమోదీని కలిసి పార్లమెంట్‌లో 9వ షెడ్యూల్డ్‌లో చేర్పించి చట్టబద్ధత కల్పించాలని విజ్ఞప్తి చేశారు. సిఎం రేవంత్‌రెడ్డి చిరస్థాయిగా బిసి హృదయాలలో నిలిచిపోవాలంటే కొత్త సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టాలని విజ్ఞప్తి చేశారు. గతంలో రాష్ట్రాన్ని పాలించిన ముఖ్యమంత్రులందరూ బిసిలకు రకరకాల పథకాలను చేపట్టి చరిత్రలో నిలిచిపోయారని, రేవంత్‌రెడ్డి కూడా ఆదేవిధంగా నిలిచిపో యేందుకు కృషి చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశానికి బిసి విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పగిళ్ళ సతీష్ అధ్యక్షత వహించగా, ఎపి బిసి నాయకులు రంగస్వామి, శివన్న, కురుకుంద్, వెంకటేష్, మహేష్, తెలంగాణ బిసి నాయకులు సి.రాజేందర్, మోదీ రాందేవ్, నిఖిల్‌పటేల్ తదితరులు పాల్గొన్నారు.

ఫ్యాషన్ ఫ్యాషన్

# అదరహో ! యూత్ ఫుల్ కోట్ !



ఈ తరం అమ్మాయిలు.. ఫ్యాషన్‌కి ఐకాన్‌లు, పండగైనా, పెళ్లైనా స్టైల్ స్టేట్‌మెంట్ కనిపించాలని కోరుకుంటున్నారు. వారికి మెప్పించేందుకు డిజైనర్లూ ఎన్నో ప్రయోగాలు చేస్తున్నారు. క్రాప్‌టాప్.. దానికి జతగా లాంగ్ కోట్. అవునండీ! లంగా ఓణీకి ప్రత్యామ్నాయంగా.. ఇటు సంప్రదాయాన్నీ, అటు ఆధునిక శైలినీ కలగలిపిన చేసిన డ్రెస్ ఇది. డైమండ్ సిల్క్, రాసిల్క్, జార్జెట్, టిష్యూ.. వంటి జాలువారే వస్త్రాలతో శుభకార్యాల్లో తళుక్కుమనేలా తీర్చిదిద్దన ఈ యువతను బాగా ఆకట్టుకుంటున్నాయి. చీర, హాఫ్‌శారీ కట్టుకోవడానికి ఇబ్బంది పడేవారికి ఇవీ మరీ నచ్చేస్తున్నాయి. అందుకే, సందర్భానికో రకం అన్నట్లుగా.. కట్‌వర్క్, జర్దోసీ, ప్రింట్లూ, పెయింట్లు.. వంటి హంగులెన్నో చేరి అదరహో అనిపిస్తున్నాయి. మన అభిరుచిని బట్టి ప్రత్యేకంగా కుట్టించుకోవచ్చు. లేదంటే రెడీమేడ్‌గానూ కొనుక్కోవచ్చు. కట్టుకంటే క్లాసీ లుక్‌తో మెరిసిపోవడం ఖాయం.







‘ఫస్ట్‌ర్యాంకుకు రెండు మార్కులు తగ్గితే కోప్పడతావు. ఇన్ని మార్కులు తెచ్చుకున్నాననని ప్రశంసించవు ప్రతి సారీ వంద శాతం వస్తేనే.. అంటారు కొంత మంది తల్లులు. పిల్లలను పొగిడితే

## పొగడ్తలోనూ స్వాంతన !



చెప్పినమాట వినరు అనుకోకుండా సందర్భంబట్టి కాస్తంత పొగిడి చూడండి అంటున్నారు నిపుణులు. అది వారికి ప్రోత్సహించి లక్ష్యసాధనవైపు నడిపించేలా ఉండాలట. అలాగే పొగడ్లకూ ఒక లెక్క ఉందట. పిల్లలు సంతోషిస్తారని లేదా పొగడ్త ఇవ్వకపోతే బాధపడతారని కాకుండా నిజాయితీగా ప్రశంసించాలి. అది కూడా నిర్దష్టంగా ఉండాలి. తను చేసిన పని వల్ల లేదా చదువులో ముందుండటం తో కలిగే ప్రయోజనాలను వివరించి పొగడాలి. భవిష్యత్తులో ఈ మార్గాన్నే అనుసరించాలనే సూచన పిల్లల మెదడుకు చేరాలి. ఇతరు లపై తను చూపించే ప్రేమ, పక్కవారికి సాయం చేసే గుణం వంటివి ప్రదర్శించి నప్పుడు మీ పొగత్తన తప్పనిసరి. మున్ముందు కూడా ఆ తత్వాన్ని అలవరుచుకోవడం ఎంత మంచి విషయమో చెప్పి మరీ ప్రశంసిం చాలి. పిల్లలు కష్టపడి ప్రయత్నిస్తు న్నప్పుడు ప్రశంస ప్రోత్సాహ పూర్వకమైనదిగా ఉండాలి. ప్రశంసా పూర్వకమైన చిన్న సంజ్ఞ కూడా వారి ఆత్మవిశ్వాసాన్ని పెంచుతుంది. మంచి పని చేసినప్పుడే కాదు. వాళ్లల్లో ప్రతికూలమైన ప్రవర్తన కనిపించినప్పుడు కూడా సానుకూల శ్రద్ధ కనబరుస్తూ ప్రశంసలు కలపాలి. ఎలాగంటే, గతంలో నువ్వెంతో మంచిగా ఉన్నావు.ఇప్పుడెందుకిలా ప్రవర్తిస్తున్నావు అని విమర్శనాత్మకంగా లేదా గట్టిగా అరవకుండా, అదే పదాలను మృదువుగా చెప్పాలి. పిల్లలు ప్రతికూల అభిప్రాయా లకంటే, అందులోని ప్రశంసకే స్పందిస్తారు. అతిగా ప్రశంసించడం నివారించుకోవాలి. అతిశయోక్తి చేయకూడదు. ఎందుకంటే ఇది నిజమైన పొగడ్త ప్రాముఖ్యతను తగ్గస్తుంది. మనకు నచ్చింది చేశారని కాకుండా, పిల్లల తీసుకునే చిన్న చిన్న నిర్ణయాలు వారి లోఁ్యాన్ని సాధింఒచగలరనే నమ్మకం కలిగినప్పుడు ప్రశంసించాలి. అది వాళ్లలో స్వతంత్ర నిర్ణయాలు తీసుకోగలిగే నైపుణ్యాలను పెంచుతుంది. ◻

## సమతుల ఆహారం !

ప్రతి మనిషి శారీరక మానసిక వికాసానికి అవసరమైన సమతుల్య ఆహారం లభ్యత ఒక సవాల్‌గా మారిందనే చెప్పాలి. ప్రపంచంలో మూడింట ఒక వంతు ప్రజలకి అంటే దాదాపు 2690 కోట్ల మందికి ఆరోగ్యకరమైన ఆహారం కొనగలిగే శక్తి లేదు. ఇక మన దేశంలో 50% పైగా జనాభాకి కొనగోలు శక్తి లేదని (ఎఫ్ఎఓ) ఆహార వ్యవసాయ సంస్థ అంచనా వేసింది. ఒక వ్యక్తి రోజువారీ శక్తి అవసరాల్ని తీర్చడానికి విటమిన్లు ఖనిజాలున్న ఆహారాన్ని అంతర్జాతీయ పర్చేజింగ్ పవర్ పారిటీ (పిపిపి) డాలర్లలో లెక్కించడం కద్దు. నిరంతర శక్తి కోసం తక్కువ ఖర్చు కోసం ప్రధాన ధాన్యాల్ని (బ్రీన్‌రైస్/ఓట్స్) పెద్ద మొత్తంలో కొనాల్సి ఉంటుంది. మార్కెట్‌లో లోపాలున్న ఉత్పత్తుల్ని కొనండి. అవి చూడటానికి పోషకమైనవే కాక తక్కువ ధర కల్గి ఉంటుంది. మంచి ఆహారం తినడానికి సృజనాత్మక, తక్కువ ఖర్చుతో కూడిన మార్గలు అనేకం ఉంటాయి. అందుకే ఆరోగ్యం ఆహారం ముఖ్యమైది. ఇది అన్ని జీవనశైలికి ఆర్థిక పరిస్థితులకి సరిపోతుంది. వంట పద్ధతుల్ని మార్చడం నుండి వ్యాయామాన్ని రోజువారీ అలవాటుగా చేసుకోవడం వరకు, తక్కువ ఖర్చుతో కూడిన మార్పులు గొప్ప ఫలితాల్ని, అనుభూతుల్ని అందిస్తాయి. స్వీయ సంరక్షణ ఖరీదైనది కానవసరం లేదు. మొదట ఆరోగ్యం బైటి కన్నా ఇంట్లోనే మొదలవుతుంది. కాబట్టి తక్కువ ఖర్చులో నిలకడగా ఉండే ఆరోగ్య అలవాట్లని సరిగ్గా అలవాటు చేసుకోవాలి. ప్రతి వ్యక్తికీ రోజూవారీ అవసరమయ్యే ఆహార ధాన్యలు (బియ్యం, గోధుమలు) కాలరీల ఖర్చు కేవలం 13% మాత్రమే పండ్లు, కూరగాయలు,పాలు, మాంసం, పప్పు ధాన్యల ఖర్చుమొత్తం ఆహార వ్యయంలో 70%కంటే ఎక్కువగా ఉంటుంది. అమెరికా, యుఎస్, యుకె, దేశాల్లో ప్రజల ఆదాయం ఎక్కువగా ఉండడం వల్ల ఆహార సమస్య తక్కువగా ఉంటుంది. అభివృద్ధి చెందుతున్న దేశాల్లో రోజువారీ ఆదాయం లోఎక్కువ భాగం ఆహారానికే వెచ్చించాల్సి ఉంటుంది. దీనికానేక కారణాల ున్నాయి. స్థానిక ప్రజల ఆహార అవసరాలకు సరిపడా ఆహారోత్పత్తులు పెరగకపోవడం, సరఫరా వ్యవస్థలో అడ్డంకులు, అధిక రవాణా ఖర్చులు, గిట్టుబాటు లేని ధరలు, దళారీల మోసం, అకాల వర్షాలు, కరువులు, పంటనష్టాలు, పాల ఉత్పత్తుల లభ్యత తగ్గిపోవడం, స్థానిక, సరఫరా వ్యవస్థలు సరిగా పనిచేయక పోవడం అపరిశుభ్రతవల్ల, గిడ్డంగులకొరత, వస్తువుల నాణ్యతా ప్రమాణాలు సరిగా పాటించకపోవడం వల్ల ఆకాశన్నండే ధరలు వల్ల సరైన ఆహారం చౌకగా, అందరికీ అందుబాటులో లేకపోవడం వల్ల అనేక పోషకాహార లోపాలు తలెత్తుతు న్నాయి. మీ ఆరోగ్య ప్రయాణాన్ని మెల్లగా, చిన్నగా మీ బడ్జెట్‌కి అనుగుణంగా ప్రవేశపెట్టండి. స్థానిక కాలానుగుణ ఉత్పత్తుల్ని చేర్చుకొని తక్కువ ఖర్చుతోకూడిన పోషణతో మొత్తం ఆరోగ్యాల్ని మెరుగుపర్చు కోవాలి. అవసరమైన పోషకాలతో సమృద్ధిగా ఉన్నవాటిని ఎంపిక చేసుకుని మీ ఆహారపు అలవాట్లని మెరుగుపర్చుకొని డబ్బున కూడా ఆదా చేసుకోవచ్చు. ఖరీదైన ఫాస్ట్‌ఫుడ్ మరియు అతిగా ప్రాసెస్‌చేసిన ఆహార ఉత్పత్తుల్ని కొనడం ఆపండి. స్వీయ ఆహార సంరక్షణ విషయంలో అన్ని విధాలా చురుకుగా ఉండటమే ముఖ్యం. ఉదా: మామిడి పండ్లు వేసవికాలం కంటే శీతకాలంలో ఖరీదైనవి కాబట్టి చౌకగా లభ్యమయ్యే సీజనల్ ఫ్రూట్స్, కాయగూరలు, నట్స్ తీసుకోవాలి. రుచికరమైన ఆరోగ్యకరమైన ప్రణాళికా బద్ధమైన ఆహారాన్ని వాటి ఆరోగ్య ప్రయోజనాలకి భంగం కల్గికుండా తీసుకోవడమే నేటి ఆరోగ్య సూత్రం. ◻



డాక్టర్ కె.ఉమాదేవి
తిరుపతి



## ధర్మ స్వరూపం

శ్రీరాముడు .. మూర్తీభవించిన ధర్మ స్వరూపుడు అనే విషయాన్ని ఆధ్యాత్మిక గ్రంధాలు చెబుతున్నాయి. ఎదుటి వారి మనసును నొప్పించడం .. ఇచ్చిన మాటను తప్పడం రాముడికి తెలియదు. తండ్రి ఆజ్ఞ మేరకు ఆయన రాజ్య సుఖాలను వదిలి కట్టుబట్టలతో వనవాసానికి బయలు దేరాడు. తాను అడవులకు వెళ్లడానికి కారణమైన కైకేయిని కూడా రాముడు ఒక్క మాట అనలేదు. తన శరణు కోరిన సుగ్రీవుడిని .. విభీషణుడిని రక్షించి వాళ్లను రాజులుగా చేసిన శరణాగత వత్సలుడు రాముడు. తనయుడిగా .. సోదరుడిగా.. శిష్యుడిగా.. స్నేహితుడిగా.. భర్తగా .. ప్రజాసేవకుడిగా రాముడు నిర్వహించిన పాత్ర ఎప్పటికీ ఆదర్శనీయమే. సత్యం .. ధర్మం .. ఓర్పు .. సహనం .. ధైర్యం శ్రీరాముడికి సహజ మైన ఆభరణాలుగా కనిపిస్తాయి. ఒకే మాట .. ఒకే బాణం .. ఒకే భార్య రామచంద్రుడి ప్రతిజ్ఞా పాలనకు అద్దం పడ్తాయి. శ్రీరాముడు ఎంతటి పరాక్రమవంతుడో .. అంతటి క్షమాగుణం కలిగినవాడు అనడానికి అనేక సంఘటనలు నిలువెత్తు నిదర్శనాలుగా కనిపిస్తాయి. సాక్షాత్తు శ్రీమన్నారాయణుడి అవతారమైన శ్రీరాముడిని దర్శించుకోవడం వలన సమస్త పాపాలు నశిస్తాయి. రాముడు అనుసరించిన మార్గాన్ని సూచించే రామాయణం చదవడం వలన, గాయత్రి మంత్రాన్ని జపించిన ఫలితం దక్కుతుందనేది మహర్షుల మాట. ◻

తెర

## ‘బా బా బ్లాక్ షీప్’ ట్రైలర్ లాంచ్ ఈవెంట్



అన్ని వర్గాల ప్రేక్షకులను మెప్పించేలా డిఫరెంట్ కాన్సెప్ట్‌తో రూపొందుతోన్న న్యూ ఏజ్ క్రైమ్ కామెడీ ‘బా బా బ్లాక్ షీప్’. దోనేపూడి చక్రపాణి సమర్పణలో చిత్రాలయం స్టూడియోపై వేణు దోనేపూడి నిర్మిస్తున్న ఈ మూవీకి గుణి మంచికంటి దర్శకత్వం వహిస్తున్నారు. అక్టోబర్ 9న సినిమా రిలీజ్ అవుతుంది. ప్రముఖ నటుడు ఉపేంద్ర లిమాయె మాట్లాడుతూ.. ముందుగా నా ప్రాణ స్నేహితుడు సందీప్ రెడ్డి వంగాకు నా మనస్పూర్తిగా ధన్యవాదాలు. నన్ను నా సొంత వాయిస్‌తో తెలుగు ఇండస్ట్రీకి పరిచయం చేసింది ఆయనే. నటుడు విష్ణు ఓయ్ మాట్లాడుతూ మా ‘బా బా బ్లాక్ షీప్’ట్రైలర్ లాంచ్‌కు సహకరించిన వారికి ధన్యవాదాలు. ఈ సినిమా కథ విన్నప్పుడు నేను ఎంతగానో ఎంజాయ్ చేశాను. నటి మాల్వీ మల్హోత్రా మాట్లాడుతూ‘బా బా బ్లాక్ షీప్’ అనేది చాలా ఫన్, కొంచెం వెరైటీగా ఉండే ఒక ఆసక్తికరమైన టైటిల్. దర్శకుడు గుణి నాకు ఈ కథ చెప్పినప్పుడు నేను ఎంతో ఎగ్జైట్ అయ్యాను. నటి సమృద్ధి ఆర్యాళ్ మాట్లాడుతూ‘సినిమా కంటే కూడా, ఈ మూవీ యూనిట్‌తో వర్క్ చేస్తూ నేను పొందిన అనుభవం నాకెంతో ప్రత్యేకం. నటీనటులు, దర్శకుడు, నిర్మాతలు.. ఇలా ప్రతి ఒక్కరూ చాలా ఆప్యాయంగా చూసుకున్నారు. నటుడు అక్షయ్ లగుసాని మాట్లాడుతూ నేను ఈ సినిమాతో పాటు మరో రెండు సినిమాలు కూడా చేస్తున్నాను. రాబోయే నాలుగు నెలల్లో అవి కూడా విడుదల కానున్నాయి. మీ అందరి సపోర్ట్, ఆశీస్సులు ఇలాగే ఉండాలని కోరుకుంటు న్నాను. నిర్మాత వేణు దోనేపూడి మాట్లాడుతూ ఈ సినిమా కోసం ఎంతో కష్టపడి పనిచేసిన ప్రతి ఒక్క టెక్నీషియన్‌కు, నటీనటులకు నా కృతజ్ఞతలు. జాతీయ అవార్డు గ్రహీత ఉపేంద్ర లిమాయే గారితో కలిసి ప్రయాణించడం నాకు , ఎంతో గౌరవంగా ఉంది. మీరందరూ కుటుంబంతో కలిసి థియేటర్లలో ఈ సినిమాను చూసి ఆశీర్వదించాలని కోరుకుంటున్నాన్న అని అన్నారు.దర్శకుడు గుణి మంచికంటి మాట్లాడుతూ ‘ముందుగా నిర్మాత వేణు గారికి చాలా పెద్ద థాంక్స్. ప్రస్తుతం ఉన్న కాంపిటీషన్‌లో ఒక డెబ్యూ డైరెక్టర్‌కు సినిమా రావడం చాలా కష్టమైన విషయం. కానీ వేణునేను చెప్పిన ఒక్క నరేషన్‌తోనే ఈ సినిమాను ఓకే చేశారు.

## ‘తెల్ల కాగితం’ సినిమా ప్రీ రిలీజ్ ఈవెంట్



హీరో హర్ష రోషన్ మాట్లా డుతూ.. “ఈ వారం రోజుల్లో నేను రెండు షాకులు చూశాను. మొదటి ది పాన్ ఇండియా సూపర్ స్టార్ ప్రభాస్ అన్న మా ట్రైలర్ గురించి పోస్ట్ చేసి మాకు కొండంత ధైర్యం ఇవ్వడం, రెండోది సినిమా విడుదలకు మూడు రోజుల ముందు మా చిత్రం నుంచి ఒక వీడియో లీక్ కావడం. ఆ లీక్ అయిన వీడియోపై వచ్చిన ప్రతి మీమ్, ట్వీట్, రీల్ చూశాను. హీరోయిన్ నక్షత్ర మాట్లాడుతూ.. “తెల్ల కాగితం మూవీ 2006 బ్యాక్‌డ్రాప్‌లో నడిచే కథ అయినా.. ప్రస్తుత జనరేషన్‌తో పాటు రాబోయే తరాలకు కూడా అర్థమయ్యే ఒక అందమైన సందేశం ఇందులో ఉంది. తెల్ల కాగితం మూవీ డైరెక్టర్ రమేష్ బండ్రెడ్డి మాట్లాడుతూ.. “మా నిర్మాత కృష్ణ నన్ను నమ్మి, చిన్న పిల్లల మైనా సరే నడిపించి, బడ్జెట్ పరిమితులు పెట్టకుండా కథకు కావాల్సినవన్నీ సమకూర్చారు. ఈ రోజు నన్ను ఇక్కడ నిలబెట్టిన ఆయన డెడికేషన్‌కి ఎప్పటికీ రుణపడి ఉంటాను. నిర్మాత, టీఎఫ్‌డీసీ ఛైర్మన్ దిల్ రాజు మాట్లాడుతూ.. “నిర్మాత కృష్ణ ఈ ప్రాజెక్ట్ ప్రారంభంలో రైటర్ నందుతో నాకు కథ చెప్పించినప్పుడే ఇది 2000ల కాలం నాటి నేపథ్యంలో సాగే ఎంతో స్వచ్ఛ మైన, ఇన్నోసెంట్ లవ్ స్టోరీ అనిపించింది. గతంలో మా బ్యానర్ నుంచి వచ్చిన ‘కొత్త బంగారు లోకం’ సినిమాలో ఎలాంటి అమాయకత్వంతో కూడిన ప్రేమకథ ఉందో.. ఇందులోనూ అలాంటి ఫీల్ కనిపించింది. డైరెక్టర్ అనిల్ రావిపూడి మాట్లాడుతూ.. ‘నేను దిల్ రాజు బ్యానర్‌లో పనిచేసిన రోజుల నుంచి నాకు బాగా కావాల్సి న వ్యక్తి, నిర్మాత కృష్ణన్న కోసమే నేను ఇక్కడికి వచ్చాను. డైరెక్టర్ కొరటాల శివ మాట్లాడుతూ.. “నిర్మాత కృష్ణన్న వల్ల చాలా రోజుల తర్వాత మైక్ పట్టుకుని స్టేజ్ ఎక్కే అవకాశం వచ్చింది. సినిమా చూసినప్పుడు చాలా ముచ్చటేసింది.

## ‘హనుమాన్ అంశ్’ 9న తెలుగులో విడుదల

ప్రముఖ నిర్మాణ సంస్థ హోంబలే ఫిల్మ్స్ ద్వారా తెలుగు ప్రేక్షకుల ముందుకు వస్తున్న నీమ్ కరోలి బాబా బయోపిక్ కొన్ని సినిమాలు విడుదలైన వెంటనే ప్రేక్షకులను ఆకట్టుకుంటాయి. మరికొన్ని సినిమాలు రోజులు గడిచేకొద్దీ మౌత్ టాక్‌తో మరింత బలపడతాయి. ‘హనుమాన్ అంశ్’హనుమాన్ అంశ్ కూడా అలాంటి చిత్రమే. ప్రముఖ ఆధ్యాత్మిక గురువు నీమ్ కరోలి బాబా, భక్తులు ప్రేమగా మహారాజ్‌జీ అని పిలుచుకునే ఆయన జీవితం, బోధనల స్ఫూర్తితో రూపొందిన ఈ హిందీ చిత్రం.. ఈ ఏడాదిలో అనూహ్య విజయాన్ని అందుకున్న చిత్రాల్లో ఒకటిగా నిలిచింది. పరిమిత స్థాయిలో తెరకెక్కిన ఈ సినిమా దేశవ్యాప్తంగా ప్రేక్షకాదరణను సొంతం చేసుకుంది. డాక్టర్ విశాల్ చతుర్వేది రచన, దర్శకత్వంలో ‘హనుమాన్ అంశ్’ తెరకెక్కింది. నీమ్ కరోలి బాబా పాత్రలో శోబినావ్ సత్యా నటించారు. చందన్ ఆనంద్, పూర్ణిమా తివారీ తదితరులు కీలక పాత్రల్లో కనిపించారు. శ్రేయాస్ ధర్మాధికారి సంగీతాన్ని అందించగా, రిషి పాఠక్ కూడా సంగీత దర్శకుడిగా క్రెడిట్ పొందారు. హిందీలో



విజయవంతమైన థియేట్రికల్ జర్నీ అనంతరం ఇప్పుడు ఈ చిత్రం తెలుగు ప్రేక్షకుల ముందుకు రాబోతోంది. హోంబలే ఫిల్మ్స్ తమ ఓవర్సీస్ డిస్ట్రిబ్యూషన్ విభాగం ద్వారా గతంలో ‘హనుమాన్ అంశ్’ను అంతర్జాతీయ ప్రేక్షకులకు చేరువ చేసింది. అక్టోబర్ 9న‘హనుమాన్ అంశ్’ తెలుగు వెర్షన్ థియేటర్లలో విడుదల కానుంది. అలాగే తమిళం, కన్నడ, మలయాళం మార్కెట్లలోనూ ఈ చిత్రాన్ని విడుదల చేయనున్నారు. హిందీలో ఇప్పటికే ప్రేక్షకులపై బలమైన ప్రభావాన్ని చూపిన‘హనుమాన్ అంశ్’.. ఇప్పుడు తెలుగు ప్రేక్షకులను పలకరించబోతోంది. మహారాజ్‌జీ ఆధ్యాత్మిక ప్రయాణాన్ని మరింత మందికి చేరువ చేయాలనే లక్ష్యంతో అక్టోబర్ 9న తెలుగు థియేటర్లలోకి వస్తోంది.హిందీ థియేటర్ల నుంచి ప్రపంచవ్యాప్తంగా ప్రేక్షకుల వరకు.. అక్కడి నుంచి ఇప్పుడు దక్షిణ భారతదేశంలోని ప్రేక్షకుల వరకు హనుమాన్ అంశ్ ప్రయాణం కొనసాగుతోంది.

## ‘టాల్కమ్ పౌడర్’ ఎంటర్టైనింగ్ గ్లింప్స్ రిలీజ్



‘పెళ్లిచూపులు’, ‘మెంటల్ మదిలో’, ‘చూసి చూడంగానే’ వంటి వైవిధ్యమైన, కంటెంట్ బేస్డ్ చిత్రాలను నిర్మించిన నేషనల్ అవార్డ్ విన్నింగ్ ప్రొడ్యూసర్ రాజ్ కందుకూరి మరో ఆసక్తికరమైన సినిమాతో రాబోతున్నారు. ఆయన ధర్మపథ క్రియేషన్స్ బ్యానర్‌పై శివ కందుకూరి హీరోగా‘టాల్కమ్ పౌడర్’ అనే చిత్రాన్ని నిర్మిస్తున్నారు. సాయి నాథ్ పొన్నా రచన, దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రంలో ద్రిషికా చందర్ కథా నాయికగా నటిస్తున్నారు. గ్లింప్స్‌లో బంటీ అనే డ్రగ్ పెడ్లర్ చుట్టూ కథను ఆసక్తికరంగా పరిచయం చేశారు. తెలియక చేసిన ఓ తప్పు కారణంగా బంటీ అనూహ్యమైన పరిస్థితుల్లో చిక్కుకుంటాడు. ఓవైపు పోలీసులు, మరోవైపు గ్యాంగ్‌స్టర్లు అతని కోసం వేట మొదలుపెట్టడంతో పరిస్థితులు మరింత గందరగోళంగా మారుతాయి. క్రైమ్, కామెడీ, డ్రామాను కలిపి రేసీ నెరేషన్‌తో తెరకెక్కుతున్న ఈ చిత్రం అనూహ్యమైన మలుపులు, ఫన్‌తో కూడిన సన్ని వేశాలతో అలరించ బోతున్నట్లు గ్లింప్స్ చూస్తే తెలుస్తోంది. దర్శకుడు సాయినాథ్ పొన్నా అద్భుతమైన కథనంతో సినిమాకు ప్రత్యేకమైన టచ్ ఇచ్చారు. శివ కందుకూరి ఎనర్జిటిక్ స్క్రీన్ ప్రెజెన్స్ ఆకట్టుకోగా, వెంకటేష్ మహా, జీవన్ కుమార్ తదితరుల పాత్రలను కూడా గ్లింప్స్‌లో పరిచయం చేశారు.టెక్నికల్‌గా కూడా సినిమా ఆకట్టుకుంది. సినిమాటోగ్రాఫర్ జీవీ అజయ్ కుమార్ స్టైలిష్ విజువల్స్ అందించగా, ఓషో వి తన సంగీతంతో కథకు మరింత ఎనర్జీని జోడించారు. సూర్య పొన్నపల్లి ఎడిటింగ్ రేసీగా వుంది.డిఫరెంట్ కాన్సెప్ట్, క్విర్కీ క్యారెక్టర్స్, క్రైమ్‌కామెడీతో వచ్చిన ది ఫస్ట్ స్ప్రింకిల్ టాల్కమ్ పౌడర్‌పై ఆసక్తిని పెంచింది. ఈ న్యూ ఏజ్ క్రైమ్ డ్రామెడీ నవంబర్ 13న థియేటర్లలోకి రానుంది.

## ‘కుకూన్స్’ సినిమా పోస్టర్ లాంచ్



జగన్ జోగిరాజ్, సాగర్ కిరణ్, వికాస్ చైతన్య, సంగన దుగ్గు, సురభి దీప్తి, దీప్తి పద్మనిమ్మనగోటి ప్రధాన పాత్రల్లో నటిస్తున్న సినిమా ‘కుకూన్స్’. ఈ చిత్రాన్ని న్యూ వేవ్ పిక్చర్స్, ఎం.ఆర్ట్స్ ఎంటర్ టైన్ మెంట్స్ బ్యానర్స్ పై సుఖేష్ పొట్ల, మమత రెడ్డి కాసం, మహేశ్ గౌరి నిర్మిస్తున్నారు. డైరెక్టర్ మహేశ్ గౌరి దర్శకత్వం వహిస్తున్నారు . యూత్ తో పాటు ఫ్యామిలీ ఆడియెన్స్‌కు నచ్చే మంచి ఎంటర్ టైనర్ గా తెరకెక్కు తున్న ఈ సినిమా త్వరలో ప్రేక్షకుల ముందుకు రాబోతోంది. ఈ రోజు ‘కుకూన్స్’ చిత్ర పోస్టర్ ను బ్లాక్ బస్టర్ డైరెక్టర్ అనిల్ రావిపూడి రిలీజ్ చేశారు. అనంతరం డైరెక్టర్ అనిల్ రావిపూడి మాట్లాడుతూ ‘కుకూన్స్’ సినిమా పోస్టర్ రిలీజ్ చేయడం హ్యాపీగా ఉంది. ఈ పోస్టర్ కొత్తగా ఉండి ఆకట్టుకుంది. డైరెక్టర్ మహేశ్ గౌరి సరికొత్త ఆలోచనలు ఈ పోస్టర్‌లో తెలుస్తున్నాయి. టైటిల్ కూడా చాలా బాగుంది. ఈ సినిమాలో వన్ ఆఫ్ ది లీడ్ రోల్ చేసిన వికాస్ గతంలో డ్రామా జూనియర్స్ ప్రోగ్రాంకు మెంటార్ గా పనిచేశారు. ఇప్పుడీ చిత్రంతో నటుడిగా ప్రేక్షకుల ముందుకు రాబోతున్నారు. జగన్, సాగర్, వికాస్ తో పాటు మిగతా ‘కుకూన్స్’ టీమ్ అందరికీ నా బెస్ట్ విశెస్ తెలియజేస్తున్నా. అన్నారు.

## ‘నా వైఫ్ మిస్సింగ్’ త్వరలో స్ట్రీమింగ్



ఎప్పటికప్పుడు ఎగ్జైటింగ్ కంటెంట్‌తో సబ్ స్క్రైబర్స్ ను ఎంగేజ్ చేస్తోన్న ఆహా ఓటీటీ ఇప్పుడు మరో ఎగ్జైటింగ్ సిరీస్ ను మన ముందుకు తీసు కొస్తోంది. వరుణ్ సందేశ్, శ్వేతా బసు ప్రధాన పాత్రల్లో ఆహా ఒరిజినల్ ‘నా వైఫ్ మిస్సింగ్’ త్వరలో స్ట్రీమింగ్‌కు రెడీ అవుతోంది. ఈ సిరీస్ తెలుగుతో పాటు తమిళంలోనూ సబ్ స్క్రైబర్స్ కు అందుబాటులో ఉండనుంది. ప్రతి కేసుకు ఒక కథ ఉంటుంది, ఈ కేస్ లో నిజం ఏంటి అనే క్యాప్షన్ తో ‘నా వైఫ్ మిస్సింగ్’ అప్డేట్ ఇచ్చింది ఆహా. తన భార్య మిస్సయ్యిందంటూ వరుణ్ సందేశ్ పోలీస్ స్టేషన్ లో కంప్లైంట్ ఇవ్వడాన్ని గతంలో రివీల్ చేసింది ఆహా. ఇప్పుడా కేసులో ఉన్న నిజం ఏంటో సిరీస్ లో చూడాలనే క్యూరియాసిటీ ఆడియెన్స్ లో క్రియేట్ అవుతోంది. త్వరలో ‘నా వైఫ్ మిస్సింగ్’ స్ట్రీమింగ్ డేట్ ను ఆహా ఓటీటీ అనౌన్స్ చేయబోతోంది. కొత్త బంగారులోకం వంటి సూపర్ హిట్ సినిమా చేసిన పెయిర్ వరుణ్ సందేశ్, శ్వేతాబసు ప్రసాద్ లాంగ్ గ్యాప్ తర్వాత చేస్తున్న ప్రాజెక్ట్ ఇదే కావడం విశేషం.

# వెస్టిండీస్‌తో నేడు మూడో వన్డే



**న్యూఢిల్లీ:** వెస్టిండీస్‌తో మూడు వన్డేల సిరీస్‌లో అదరగొట్టిన టీమిండియా ఆఖరి పోరుకు సిద్ధమైంది. న్యూ చండీగఢ్ వేదికగా ఈ నెల 3వ తేదీన జరగనున్న నామమాత్రపు ఆఖరి వన్డేలో వెస్టిండీస్‌తో తలపడనుంది. విరాట్ కోహ్లీ, శుభ్‌మన్ గిల్, రోహిత్ శర్మల విధ్వంసకర బ్యాటింగ్‌తో వరుసగా రెండు మ్యాచ్‌ల్లో గెలిచిన భారత్ ఇప్పటికే 2-0తో సిరీస్ కైవసం చేసుకుంది. న్యూ చండీగఢ్ వేదిక కూడా బ్యాటింగ్‌కు అనుకూలంగా ఉంటుంది. ఈ ఆఖరి వన్డేలో కూడా బౌండరీ మోత మోగే అవకాశం ఉంది. ఇప్పటికే సిరీస్ గెలిచిన నేపథ్యంలో భారత తుది జట్టులో

## భారత్ తుది జట్టులో స్వల్ప ఛేంజింగ్స్

మార్పులు జరిగే అవకాశం ఉంది. బెంచ్ ఆటగాళ్లకు అవకాశం దక్కవచ్చు. వరుసగా రెండు మ్యాచ్‌ల్లో ఆడిన టీమిండియా స్టార్ ఓపెనర్ రోహిత్ శర్మకు విశ్రాంతి ఇచ్చే అవకాశం ఉంది. అతని స్థానంలో యశస్వి జైస్వాల్‌ను ఓపెనర్‌గా ఆడించవచ్చు. రోహిత్‌ను కొనసాగించాలనుకుంటే మాత్రం జైస్వాల్ బెంచ్‌కే పరిమితమవుతాడు. రెండో వన్డేలో రోహిత్ విధ్వంసకర శతకంతో చెలరేగాడు. వరుసగా సెంచరీ, డబుల్ సెంచరీ సాధించిన కెప్టెన్ శుభ్‌మన్ గిల్ సూపర్ ఫామ్‌లో ఉన్నాడు. రోహిత్‌ను తప్పించలేని పరిస్థితుల్లో జైస్వాల్‌కు అవకాశం ఇవ్వాలనుకుంటే, కెప్టెన్ గిల్ తన స్థానాన్ని త్యాగం చేయాల్సి ఉంటుంది. సూపర్ ఫామ్‌లో ఉన్న విరాట్ కోహ్లీ ఫస్ట్ డౌన్‌లో ఆడనుండగా, నాలుగో స్థానంలో రుతురాజ్ గైక్వాడ్ బరిలోకి దిగనున్నాడు. రుతురాజ్, కేఎల్ రాహుల్, రవీంద్ర జడేజాలకు పెద్దగా బ్యాటింగ్ చేసే అవకాశాలు రాలేదు. ఆకిబ్ నబీకి మరో అవకాశం ఇస్తామని హెడ్ కోచ్ గౌతమ్ గంభీర్ ఇప్పటికే స్పష్టం చేశాడు. కాబట్టి నితీష్‌రెడ్డి మరోసారి బెంచ్‌కే పరిమితం కానున్నాడు. తొలి రెండు వన్డేలకు దూరంగా ఉన్న మహమ్మద్ సిరాజ్ ఆఖరి వన్డే ఆడే అవకాశం ఉంది. ప్రసిధ్ కృష్ణ గాయంతో దూరమవగా, అతని స్థానంలో అన్షుల్ కాంబోజ్ జట్టులోకి వచ్చినా తుది జట్టులో చోటు కష్టమే. ప్రసిధ్ కృష్ణ స్థానంలో సిరాజ్ ఆడనుండగా, రెండో పేసర్ ఆకిబ్ నబీ, మూడో పేసర్‌గా గుర్నూర్ బ్రార్ బరిలోకి దిగనున్నారు. నితీష్‌ను ఆడించాలనుకుంటే గుర్నూర్ బ్రార్ బెంచ్‌కు పరిమితం కావాల్సి ఉంటుంది. నమన్ ధీర్, కుల్దీప్ యాదవ్, రవీంద్ర జడేజా స్పిన్ బాధ్యతలు పంచుకోనున్నారు. ధ్రువ్ జురెల్‌కు మరోసారి నిరాశే ఎదురవ్వనుంది.



ఆసియా క్రీడలు బాక్సింగ్..

## పర్వీన్, లవ్లీనాలకు డబుల్ స్వర్ణం

### పురుషుల విభాగంలో అంకుష్‌కు పసిడి

**నిషియో:** ఆసియా క్రీడలు మహిళల, పురుషుల బాక్సింగ్స్ ఫైనల్లో శుక్రవారం ఒకే రోజు భారత్‌కు మూడు స్వర్ణపతకాలు లభించాయి. మహిళల బాక్సింగ్ ఫైనల్లో పర్వీన్ హుడా, లవ్లీనా బోర్గోహైన్‌లు రెండు స్వర్ణాలు గెలుచుకోగా, పురుషుల ఫైనల్‌లో అంకుష్ పంఘల్ స్వర్ణ పతకాన్ని దక్కించుకున్నాడు. మహిళల 65 కేజీల విభాగంలో భారత బాక్సర్ పర్వీన్ హుడా హోరాహోరీ ఫైనల్‌లో చైనీస్ తైపీ నీన్ చిన్ చెను ఓడించి స్వర్ణం కైవసం చేసుకుంది. 26 యేళ్ల పర్వీన్ తొలి రౌండ్‌ను 5-0 ఏకగ్రీవంగా, రెండవ రౌండ్‌లో కూడా 5-0తో గెలుచుకోవడంతో పోటీ ఫలితం ఫైనల్ రౌండ్‌కు చేరింది. నిర్ణయాత్మక రౌండ్‌లో ఆమె 3-2 తేడాతో విజయం సాధించి స్వర్ణ పతకాన్ని కైవసం చేసుకుంది. అలాగే లవ్లీనా బోర్గోహైన్ 75 కేజీల బాక్సింగ్ ఫైనల్‌లో చైనాకు చెందిన బావో జియిని 5-0 ఏకగ్రీవ నిర్ణయంతో ఓడించి స్వర్ణాన్ని సాధించింది. హోరాహోరీగా సాగిన తొలి రౌండ్‌ను 3-2 తేడాతో గెలుచుకున్న లవ్లీనా బౌట్‌లో ఆధిపత్యం చెలాయించింది. రెండు, మూడవ రౌండ్‌లలో ఆ 4-1 తేడాతో గెలుచుకుని విజయాన్ని ఖాయం చేసుకుంది. నలుగురు న్యాయనిర్ణేతలు ఈ బౌట్‌కు 29-28 స్కోరును ఆమెకు అనుకూలంగా ఇవ్వగా, ఒక న్యాయనిర్ణేత 30-27 తీర్పును వెలువరించారు. ఇక దక్షిణ కొరియాకు చెందిన మిన్సియోంగ్ కిమ్‌పై 4-0 తేడాతో విజయం సాధించి అంకుష్ పంఘల్ స్వర్ణ పతకాన్ని సాధించాడు. ఈ పోరులో ఐదుగురు న్యాయనిర్ణేతలలో నలుగురు ఈ పోటీకి 30-26 స్కోరును అతనికి అనుకూలంగా ఇవ్వగా, ఐదవ న్యాయనిర్ణేత 28-28 డ్రాగా నమోదు చేశారు.



ఆసియా గేమ్స్ సెపక్‌టక్రాలో..

## భారత్ పురుషుల టీమ్‌కు కాంస్యం

**నగోయా:** ఆసియా క్రీడల సెపక్‌టక్రా పురుషుల క్వాడ్రంట్ ఈవెంట్ సెమీఫైనల్‌లో జపాన్ చేతిలో 0-2 తేడాతో ఓడిపోయిన భారత్ కాంస్య పతకాన్ని కైవసం చేసుకుంది. నగోయా సిటీలో శుక్రవారం జరిగిన ఈ మ్యాచ్‌లో మలెంగన్బా సింగ్ సోరోఖైబామ్, రామ్ కుమార్ శర్మ, బాబీ కుమార్, ఆకాష్ యుమ్నామ్‌లతో కూడిన భారత క్వార్టెట్, హోరాహోరీగా జరిగిన సెమీఫైనల్‌లో జపాన్‌కు చెందిన యూకీ సాటో, రియోటా హారు హర, వటారు నరవా, యోటా ఇచికావాల చేతిలో 12-15, 13-15 తేడాతో ఓటమి పాలైంది. లోఖోన్ సింగ్ ఎలంగ్‌బామ్, టెకాంగ్ అరుణ్‌లు భారత్‌కు ప్రత్యామ్నాయంగా బరిలోకి దిగగా, సేయా టకానో, తోషిటకా నైటో జపాన్‌కు ప్రత్యామ్నాయంగా నిలిచారు. పురుషుల క్వాడ్రంట్ ఈవెంట్‌లో మూడు మ్యాచ్‌లలోనూ విజయం సాధించి భారత్ గ్రూప్ ఎలో అగ్రస్థానంలో నిలిచింది. గ్రూప్‌దశలో ప్రపంచ కప్ ఛాంపియన్ మయన్మార్‌పై ఈ జట్టు ఒక ముఖ్యమైన విజయాన్ని నమోదు చేయగా, వియత్నాం మరియు లావోస్‌లను ఓడించి సెమీఫైనల్స్‌కు చేరుకుంది. ఇక గ్రూప్ ఎ లో ఒక్క విజయం కూడా సాధించకుండా నాలుగో స్థానంలో నిలవడంతో భారత మహిళల క్వాడ్రంట్ ప్రచారం గ్రూప్ దశలోనే ముగిసింది. మహిళల డబుల్స్ జట్టు కూడా గ్రూప్ బి లో నాలుగో స్థానంలో నిలవగా, పురుషుల రెగ్యు జట్టు ఒక విజయం, రెండు ఓటములతో గ్రూప్ బిలో మూడో స్థానంలో నిలిచి నాకౌట్ దశకు చేరుకోవడంలో విఫలమైంది.

## ఆసియా గేమ్స్ రికర్వ్.. భారత్ జట్టుకు రజతం



**ఒకాజాకి:** ఆసియా క్రీడల పురుషుల రికర్వ్ టీమ్ ఈవెంట్ ఫైనల్‌లో, తొమ్మిది సార్లు ఛాంపియన్‌గా నిలిచిన దక్షిణ కొరియా చేతిలో 1-5 తేడాతో ఓడిపోయిన భారత్ జట్టు రజత పతకంతో సరిపెట్టుకుంది. ఒకాజాకిలో శుక్రవారం జరిగిన ఈ మ్యాచ్‌లో నీరజ్ చౌహాన్, యశ్‌దీప్ భోగే, ధీరజ్ బొమ్మదేవరలతో కూడిన భారత త్రయం, కిమ్ జే డియోక్, కిమ్ వూజిన్, లీ వూసోక్‌లతోకూడిన కొరియా జోడీని అధిగమించలేకపోవడంతో కొరియా తన ఆధిపత్యాన్ని కొనసాగిం చింది. భారత్, కొరియా జట్లు 56 పాయింట్లు సాధించి తొలి సెట్‌ను సమంగా పంచుకుని ఫైనల్‌ను ప్రారంభించాయి. తమ తొలి మూడు బాణాలతో 28 పాయింట్లు సాధించిన భారత ఆర్చర్లకు ఆ సెట్‌ను గెలుచుకునే అవకాశం లభించినప్పటికీ, వారు 10, 8, 9 పాయింట్లతో ముగించి స్కోరును సమం చేశారు. ఆ తర్వాత రెండో సెట్‌లో కొరియా ఒత్తిడి పెంచి, నాలుగు 10లు సాధించి 57-50 తేడాతో గెలుపొందింది. భారత్ నిలకడ కోసం ఇబ్బంది పడింది, యశ్‌దీప్, నీరజ్ చెరో ఎనిమిది నమోదు చేయగా, బొమ్మదేవర కూడా రెండు ఎనిమిది స్కోర్లు సాధించాడు. 1-3తో వెనుకబడిన భారత్, పోటీలో నిలవాలంటే మూడో సెట్ గెలవాల్సిన అవసరం ఏర్పడింది. భారత త్రయం తమ తొలి మూడు బాణాలతో 28 పాయింట్లు సాధించి, కొరియా స్కోరును సమంచేసింది. ఆ తర్వాత నీరజ్ ఏడు పాయింట్లు సాధించాడు. యశ్‌దీప్, బొమ్మదేవర వరుసగా తొమ్మిది, పది పాయింట్లు సాధించగా, కొరియా తమ చివరి మూడు బాణాలతో 28 పాయింట్లు సాధించి, సెట్‌ను 56-54 తేడాతో కైవసం చేసుకుంది.

## ఆసియా గేమ్స్ సెయిలింగ్.. నేత్రకు కాంస్యం



**గమగోరి:** భారత మహిళా నావికురాలు నేత్ర కుమనన్ శుక్రవారం ఐచినగోయా క్రీడల్లో మహిళల డింగీ విభాగంలో కాంస్య పతకం గెలుచుకోవడం ద్వారా, 12 యేళ్ల తర్వాత ఆసియా క్రీడల్లో పతకం సాధించారు. శుక్రవారం కైయో యాచ్ హార్బర్‌లో జరిగిన రెండు రేసుల ఫైనల్ సిరీస్ తర్వాత నేత్ర 14 నికర పాయింట్లతో ముగించింది. క్వాలిఫికేషన్ సిరీస్ నుండి తిరిగి లెక్కించిన ఏడు పాయింట్లతో నేత్ర ఫైనల్స్‌లోకి ప్రవేశించింది. ఫైనల్ 1లో ఆరవ స్థానంలో నిలిచి ఆరు పాయింట్లు జోడించుకున్న ఆమె, ఫైనల్ 2లో గెలిచి తన ఖాతాలో కేవలం ఒక పాయింట్ మాత్రమే చేర్చుకుంది. ఆమె హాంకాంగ్‌కు చెందిన స్టెఫానీ నార్టన్‌తో 14 నికర పాయింట్లతో సమంగా నిలిచినప్పటికీ, సిరీస్ మొత్తంలో మెరుగైన హెడ్ టుహెడ్ రికార్డును కలిగి ఉండటంతో టైబ్రేక్‌లో కాంస్యం కైవసం చేసుకుంది.



ఆసియా గేమ్స్ హాకీ ..

## భారత్ మహిళల హాకీ టీమ్‌కు స్వర్ణం

### ఫైనల్లో 1-0తో చైనా ఓటమి

**కాకమిగహారా:** ఫైనల్‌లో చైనాను 1-0 తేడాతో ఓడించి, భారత్ 44 యేళ్ల నిరీక్షణకు తెరదించి ఆసియా క్రీడల మహిళల హాకీ జట్టు స్వర్ణాన్ని కైవసం చేసుకుంది. శుక్రవారం కాకమిగహారాలో జరిగిన ఈ మ్యాచ్‌లో భారత్ తరపున లాల్‌రెమ్సియామి 10వ నిమిషంలో నిర్ణయాత్మక గోల్ చేసింది. పట్టుదలగా ఆడిన చైనాను నిలువరించి, ఆసియా క్రీడల టైటిల్‌ను భారత్ తిరిగి కైవసం చేసుకోవడానికి ఈ ఫార్వర్డ్ చేసిన గోల్ సరిపోయింది. మ్యాచ్ ఆద్యంతం స్కోరును సమం చేయడానికి చైనా తీవ్రంగా ప్రయత్నించింది. పెనాల్టీ కార్నర్లు, పెనాల్టీ స్ట్రోక్‌తో సహా పలు అవకాశాలను సృష్టించుకుంది. కానీ భారత గోల్ కీపర్ సవిత పునియా, రక్షణ విభాగం దృఢంగా నిలబడి తమ స్వల్ప ఆధిక్యాన్ని కాపాడుకున్నారు. ఆఖరి నిమిషాల్లో చైనా తమ గోల్ కీపర్‌ను వెనక్కి పిలిచి, అదనంగా ఒక ఫీల్డ్ ప్లేయర్‌ను ముందుకు పంపింది, కానీ భారత్ గోల్స్ ఇవ్వడానికి నిరాకరించింది. ఈ విజయంతో 1982 తర్వాత భారతదేశానికి ఆసియా క్రీడల మహిళల హాకీలో తొలి స్వర్ణం సాధించింది.




Printed and Published by GireeshSanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at D.No. 396, Lower Tankbund, Hyderabad - 500 080 Phone : 2764 4999. Fax: 040-27642512, RNI No. 62142/95, Editor : *DamerlaSai Baba, *responsible for selection of news under the PRB Act. Regd.: No.HSD/337/21-22 Air Surcharge: Delhi : 40 Ps. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.